R E P O R T   R E S U M E S

ED 019 644   48   AL 000 905
GRADED READINGS IN NEWSPAPER TELUGU--PRELIMINARY EDITION.
BY- REDDY, G.N.   MATSON, DAN M.
WISCONSIN UNIV., MADISON
REPORT NUMBER BR-5-1254   PUB DATE   66
CONTRACT OEC-4-14-043
EDRS PRICE MF-$0.75 HC-$6.32   156P.

DESCRIPTORS- *TELUGU, *READING MATERIALS, *NEWSPAPERS, COMPUTATIONAL LINGUISTICS, LANGUAGE INSTRUCTION,

THE 31 SELECTIONS IN THIS READER WERE TAKEN FROM THE PAGES OF A NUMBER OF DAILY AND WEEKLY TELUGU NEWSPAPERS. THEY WERE SELECTED TO ACQUAINT THE STUDENT WITH A VARIETY OF TYPES OF JOURNALISTIC WRITING IN TELUGU WHILE INSTRUCTING HIM IN IMPORTANT READING SKILLS. THE MATERIAL HAS BEEN GRADED FOR DIFFICULTY AND INCLUDES A VARIETY OF SUBJECTS. THE PREPARATION OF THIS READER WAS SIMILAR TO THAT OF "GRADED READINGS IN MODERN LITERARY TELUGU--PRELIMINARY EDITION" (AL 000 904). A COMPUTER WAS USED IN ARRANGING THE SELECTIONS BY RELATIVE DIFFICULTY. AGAIN, THE FIRST HALF OF THE READER INTRODUCES MAJOR GRAMMATICAL POINTS WHICH ARE THEN REINFORCED IN THE SECOND HALF. THE ACCOMPANYING GLOSSARY (AL 000 906) GIVES THE ENGLISH EQUIVALENT FOR THE TELUGU MATERIAL PRESENTED HERE IN DEVANAGARI. (JD)

FILMED FROM BEST
AVAILABLE COPY

GRADED READINGS IN NEWSPAPER TELUGU:

PRELIMINARY EDITION

U.S. DEPARTMENT OF HEALTH, EDUCATION & WELFARE
OFFICE OF EDUCATION

OEC-4-14-043
BR-5-1254
PA 48

ED019644

GRADED READINGS IN NEWSPAPER TELUGU: PRELIMINARY EDITION

U.S. DEPARTMENT OF HEALTH, EDUCATION & WELFARE
OFFICE OF EDUCATION

THIS DOCUMENT HAS BEEN REPRODUCED EXACTLY AS RECEIVED FROM THE PERSON OR ORGANIZATION ORIGINATING IT. POINTS OF VIEW OR OPINIONS STATED DO NOT NECESSARILY REPRESENT OFFICIAL OFFICE OF EDUCATION POSITION OR POLICY.

G.N. Reddy

Dan M. Matson

"PERMISSION TO REPRODUCE THIS COPYRIGHTED MATERIAL HAS BEEN GRANTED BY UNIVERSITY OF WISCONSIN TO ERIC AND ORGANIZATIONS OPERATING UNDER AGREEMENTS WITH THE U.S. OFFICE OF EDUCATION. FURTHER REPRODUCTION OUTSIDE THE ERIC SYSTEM REQUIRES PERMISSION OF THE COPYRIGHT OWNER."

THESE MATERIALS WERE PREPARED FOR EXPERIMENTAL USE IN THE CLASSROOM AND WILL BE REVISED. SUGGESTIONS WILL BE APPRECIATED.

University of Wisconsin
1966

AL 000 905

The research reported herein was supported by a contract with the United States Office of Education, Department of Health, Education, and Welfare.

Copyright: University of Wisconsin, 1966.

F O R E W O R D

The thirty-one selections in this reader were taken from the pages f recent editions of a number of daily and weekly Telugu newpapers; ey were selected to acquaint the student with a variety of types of urnalistic writing in Telugu, while instructing him efficiently in portant reading-skills. They present material of carefully graded ifficulty, on a variety of subjects.

In the preparation of this reader, our main premise was that the tudent will learn most efficiently if he is exposed early and repeatedly o those features of the language which occur most frequently. The einforcement provided by repetition makes it easier for him to learn hese features rapidly; later, when he meets words and patterns of lower requency, the student will already know much of the other material, and ill thus be able to concentrate on learning this less frequent material. he sooner this is accomplished, the sooner the student can devote his ttention to absorbing the content of what he reads, and to increasing is reading-speed.

In order to determine which were the most frequent features of these elections, the entire text was fed into a high-speed electronic computer nd analyzed for frequency. The absolute and relative frequencies were etermined for each lexical word in the text, as well as for some ninety nflectional affixes.

A specially-developed formula was applied, to assign to each election a "score" based on the length of the selection, the relative requency of the words and affixes it contained, and the proportion of igh-frequency words and affixes it contained. On the basis of these cores, the selections were arranged in the order in which they occur n this reader.

This done, the next step was to control the introduction of new aterial; a student can hardly be expected to learn rapidly to read nd comprehend rapidly if each page is filled with words and grammar hich he has never seen before. Accordingly, we did our best to replace ow-frequency items with higher-frequency equivalents, and to postpone he introduction of certain difficult and less frequent grammatical aterial until later in the text.

The result is a text which we hope will accomplish the aims stated n the first paragraph above. By the end of the fifteenth story, almost

all of the grammar in the text has already been covered, leaving the second half of the text for reinforcement of the grammar, for enlarging the student's vocabulary, and for increasing his reading-efficiency.

In the preparation of the accompanying glossary, in addition to providing the necessary semantic and grammatical information, we have tried to take most of the mechanical labor of dictionary-thumbing out of the hands of the student. The glosses and notes are arranged serially, in the order in which the student working through the text will need them. An alphabetical index to the glossary is also provided, to enable the student to refresh his memory.

We wish you success and satisfaction as a user of this text. If you have any comments or suggestions, we would like to hear from you.

G.N. Reddy
Dan M. Matson

విషయ సూచిక

1	స్వాతంత్ర్య దినోత్సవం	1
2	దేశంలో వైర్లెస్ కేంద్రాలు	4
3	ఆంధ్రప్రదేశ్ ఏగ్రికల్చరల్ యూనివర్సిటీ	7
4	అమెరికా సైనిక సహాయం	11
5	రాజ్యాంగ 17వ సవరణ బిల్లు	14
6	సైప్రస్ పైన విమానాల దాడి	17
7	క్రీడాభిరామం	21
8	దేశంలో ప్రతిపక్షాలు	26
9	మనపట్టణాలు: మంచినీళ్ళ సదుపాయం	29
10	కేరళ మంత్రివర్గంపై అవిశ్వాస తీర్మానం	32
11	నెహ్రూ వైదేశిక విధానం	40
12	చైనా సామ్రాజ్యవాదం	44
13	కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు: హిందీ	48
14	శ్రీ చాగ్లా సూచన	51
15	జనాభా సమస్య	55

16 సమితిలో చైనాకు సభ్యత్వం 59

17 ఆంధ్రలో మెడికల్ కాలేజ్ సీట్లు 66

18 నవభారత నిర్మాణంలో సాంకేతిక సిబ్బంది పాత్ర 73

19 పారిశ్రామిక క్షేత్రాల ప్రాముఖ్యత 79

20 జనసంఘం స్వతంత్ర పార్టీల ఎన్నికల పొత్తు 84

21 ఎంతటి దుర్దినం! 90

22 ప్రెసిడెంట్ కెనెడీ దారుణ హత్య 93

23 బర్మానుంచి 1500 మంది భారతీయుల రాక 99

24 నవభారత నిర్మాత నెహ్రూ అస్తమయం 103

25 ఆగస్టు 15 భావాలు 109

26 క్యూబానుంచి రష్యన్ బాంబర్ల తొలగింపు 114

27 పాఠకుల లేఖలు 119

28 ఆగస్టు 15. సంపాదకీయం 125

29 ఉస్మానియాలో అమెరికన్ పరిశోధనకళాశాల 131

30 పంచవర్ష ప్రణాళికలు 137

31 దారుణ హత్య 143

INTRODUCTION

Among the Telugu daily newspapers, the following six have state-wide circulation:

1. Andhra Patrika (lit. The Andhra Newspaper), published in Madras, is the oldest Telugu newspaper, founded in 1914.
2. Andhra Prabha (lit. The Glory of Andhra), founded in 1939, has the largest circulation of the Telugu dailies, and is published simultaneously in Madras and Vijayawada.
3. Gōlakoṇḍa Patrika is named after Gōlakoṇḍa, a place of historical importance near Hyderabad; it is published in Hyderabad and has a growing circulation.
4. Viśālāndhra (lit. Greater Andhra) has been published daily in Vijayawada since 1952; it is the voice of the Communist Party in Andhra.
5. Āndhra Jyōti (lit. The Light of Andhra) is a recent paper, published in Vijayawada and edited by Sri Narla Venkateswara Rao, a veteran Telugu journalist.
6. Āndhra Bhūmi (lit. The Land of the Andhras) is also a young paper, published in Secunderabad.

These papers usually contain six or eight pages on weekdays, and ten or twelve pages on Sundays. They report news of state, national, and international interest with more or less equal emphasis. The majority of the selections in this reader are taken from these six Telugu dailies.

Telugu has quite a wealth of periodicals. With the spread of literacy and political consciousness in the country, a number of new Telugu periodicals have sprung up in recent years. Most of the towns in Andhra have their own weeklies. They usually publish news of local and regional interest, and also summarize the national news for their readers. Some of the primarily literary periodicals--the Andhra Patrika weekly and the Andhra Prabha weekly for example--are very widely read.

This reader contains a few selections from the following periodicals:

7. Krishṇā Patrika, a weekly now published in Hyderabad, founded in 1902 at Masulipatam, Krishna District.
8. Vāhini (The Stream), a weekly published in Vijayawada, founded ca. 1934.
9. Prajāmata (The People's Opinion), published in Bangalore; also has a Kannada edition.
10. Amerikan Ripōrṭar, the Telugu edition of The American Reporter, published bi-weekly by the United States Information Service.
11. Panchāyat, a monthly journal recently started by the State Chamber of Panchayati Raj; published in Hyderabad.

Generally speaking, Telugu newspapers and periodicals, irrespective of their place of publication, tend to employ the dialect of the upper and middle classes of coastal Andhra--as do most contemporary writers of fiction. The local

periodicals coming from the different regions in the state are strongly influenced by the language and style of the dailies of state-wide circulation. The Andhra Patrika and the Golakonda Patrika, however, tend to use an older, more formal style of Telugu, particularly in their editorials.

Telugu newspapers are not against using English loanwords when Telugu equivalents are not readily available; see story 3, on rules for admission to a university, and story 7, taken from a sports page. Much of the news is received by the Telugu press only in English, so translation from English to Telugu forms an important part of the job of publishing a Telugu newspaper. In such translations one often sees the influence of English vocabulary and style; see story 29, Ambassador Chester Bowles on Nehru, and also story 11, an interview with Krishna Menon on Nehru's foreign policy.

The reader also includes excerpts from six editorials. The editorials in Telugu newspapers attempt to focus the attention of their readers on a variety of problems. Selection number 13 deals with the problem of Hindi in matters of Central Government employment, 14 is on the educational policy of the Government, and 25 and 26 are about August 15, Indian Independence Day, giving a critical review of national achievements and shortcomings; numbers 21 and 31 express national sentiments on the deaths of Nehru and Kennedy respectively.

The editorials are usually written in an elevated style, containing a high proportion of Sanskritic vocabulary.

Telugu newspapers contain a good deal of political news of both national and international interest. Story 16 is

on the U.N. debate on the admission of China, stories 6 and 26 are on other foreign news, 5 and 10 are reports on parliamentary debates, and 27, a typical letter from the readers' column, is on capital punishment.

We hope that this varied selection from representative Telugu journals will provide interesting as well as instructive reading for the student.

స్వాతంత్ర్య దినోత్సవం [A]

ఆకాశవాణి, హైదరాబాద్ కేంద్రం

ప్రత్యేక ప్రసారాలు

1964 'ఆగస్టు' 15న స్వాతంత్ర్య దినోత్సవమున ఆకాశవాణి హైదరాబాదు కేంద్రం ప్రత్యేక కార్యక్రమాలను ప్రసారం చేస్తుంది.[B]

ఆగస్టు 14 రాత్రి 8-30 గంటలకు ఢిల్లీ కేంద్రం నుంచి రాష్ట్రపతి స్వాతంత్ర్య దినోత్సవ సందేశం ప్రసారమవుతుంది.[C] రాష్ట్రపతి సందేశాన్ని హైదరాబాదు 'ఎ', 'బి' కేంద్రాలు 'రిలే' చేస్తాయి. దాని తరువాత రాష్ట్రపతి సందేశానికి ఉర్దూ అనువాదం హైదరాబాదు 'ఎ' కేంద్రం నుంచి, తెలుగు అనువాదం హైదరాబాదు 'బి' కేంద్రం నుంచి ప్రసారమవుతాయి. రాష్ట్రపతి సందేశం తెలుగు అనువాదాన్ని విజయవాడ, కడప, విశాఖపట్టణం కేంద్రాలు రిలే చేస్తాయి.

ఆగస్టు 15 ఉదయం 7-10 గంటలకు ఢిల్లీ 'రెడ్ ఫోర్టు' పై ప్రధాన మంత్రి పతాకావిష్కరణ చేస్తారు. ఆ పతాకావిష్కరణ కార్యక్రమాన్ని హైదరాబాదు కేంద్రం రిలే చేస్తుంది.

ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి[D] ఆగస్టు 15 ఉదయం

7-15 గంటలకు తెలుగులో ఇచ్చే స్వాతంత్ర్య దినోత్సవ సందేశాన్ని విజయవాడ, కడప, విశాఖపట్టణం కేంద్రాలు రిలే చేస్తాయి.

హైద్రాబాదు, సికింద్రాబాదు పట్టణాలలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని గురించి ఒక ప్రత్యేక కార్యక్రమం తెలుగులో హైద్రాబాదు 'ఎ' కేంద్రం నుంచి ఆ రాత్రి 8 గంటలకు ప్రసారమవుతుంది. హైద్రాబాదు కేంద్రం నుంచి మధ్యాహ్నం 2-10 గంటలకు శ్రీ యస్. సి. సత్యనారాయణ గారి సంగీత కార్యక్రమం ప్రసారమవుతుంది.

మధ్యాహ్నం 12 గంటలకు "మధుర స్వప్నం" అనే కార్యక్రమం హైద్రాబాదు 'ఎ', 'బి' కేంద్రాల నుంచి ప్రసారమవుతుంది. ప్రొఫెసరు మామిడిపూడి వెంకటరంగయ్య, 'రివరెండు' ఎ. ఆర్. మాసిలామణి, 'డాక్టరు' శ్రీదేవి, శ్రీ అడపా రామకృష్ణారావు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.

ఆకాశవాణి ఢిల్లీ కేంద్రం నుంచి రాత్రి 9.30 గంటలకు ఆంగ్లంలో ప్రసారమయ్యే "స్వతంత్ర దుర్గము" అనే కార్యక్రమాన్ని, జాతీయ సంగీత కార్యక్రమాన్ని హైద్రాబాదు కేంద్రం రిలే చేస్తుంది. రాత్రి 9-15 గంటలకు

ఢిల్లీ కేంద్రం నుంచి ప్రసారమయ్యే కార్యక్రమాన్ని హైదరాబాదు 'బి' కేంద్రం రిలే చేస్తుంది. ఆ రోజు ఉదయం 9 గంటలకు విజయవాడ కేంద్రం నుంచి ప్రసారమయ్యే సాహిత్య కార్యక్రమాన్ని హైదరాబాదు 'ఎ', 'బి' కేంద్రాలు రిలే చేస్తాయి. ఈ ప్రత్యేక సాహిత్య కార్యక్రమంలో శ్రీ సుబ్బన్న గారు పాల్గొంటారు.

మధ్యాహ్నం 12-30 గంటల కార్యక్రమంలో శ్రీ డి. రాజేశ్వరరావు గారి "దేశం కోసం" అనే నాటిక ప్రసారమవుతుంది. ఆ తరువాత శ్రీ యస్. వి. యస్. ప్రసాదరావు 'మన జాతీయ పతాకం" అనే విషయం గురించి మాట్లాడుతారు. మధ్యాహ్నం 3-30 గంటలకు 'బాలానందం" కార్యక్రమం ప్రసారమవుతుంది.

[గోలకొండ పత్రిక ఆగస్టు 15, 1964])

దేశంలో వైర్లెస్ కేంద్రాలు

భారత దేశంలో అన్ని ప్రాంతాలలోని వివిధ వైర్లెస్ కేంద్రాల ద్వారా తంతి తపాలా శాఖ వాళ్ళు ప్రజలకు ఏర్పాటు చేసిన సౌకర్యాలు చాలా మందికి తెలియదు.

అండమాన్, నికోబార్ దీవులలోనూ, అరేబియా సముద్రంలో మినికాయ్, లక్క దీవులలోనూ, వున్న ప్రజలు వైర్లెస్ కేంద్రాల ద్వారా ఇతర ప్రాంతాలకు, ఇతర దీవులకు 'టెలిగ్రాములు' పంపే సౌకర్యం కల్పించబడింది. అక్కడి ప్రజలు ఇతర ప్రాంతాలకు టెలిగ్రాములు పంపడానికి దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే టెలిగ్రాములు తీసుకొనడానికి కూడా సౌకర్యం కల్పించబడింది.

మారుమూల ప్రాంతాలలో వైర్లెస్ సౌకర్యాలు

నేఫాలో తేజు, ఝోనాస వంటి మారుమూల ప్రాంతాలలో 'టెలిగ్రాఫ్' తీగలు వేయడం చాలా కష్టమైన పని. అంతేగాదు, ఇక్కడ టెలిగ్రాఫ్ తీగలు వేయడానికి చాలా ఖర్చు అవుతుంది. అందువల్ల ఇటువంటి ప్రాంతాలలో టెలిగ్రాఫ్ తీగలు లేకుండా ఇక్కడి ప్రజలకు దేశంలోని ఇతర ప్రాంతాల ప్రజలకు వైర్లెస్ సౌకర్యం

కల్పించ బడింది. నేఫా, అస్సాము లల్లోనే కాక హిమాచల ప్రదేశ్, లడక్‌లలో కూడా వైర్లెస్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అందువల్ల అక్కడి ప్రజలకు టెలిగ్రాఫ్ సౌకర్యాలు కల్పించడం జరిగింది. ఆ మారుమూల ప్రాంతాలలో సౌకర్యాలు లేవు. అయినా తంతి తపాలా శాఖ వాళ్ళు కష్టపడి పని చేస్తున్నారు.

టెలిగ్రాములు త్వరగా పంపడం 'రేడియో టెలీప్రింటర్' ద్వారా జరుగుతుంది. ఇప్పుడు కలకత్తా- గౌహతి, కలకత్తా- డార్జిలింగు, ఢిల్లీ- శ్రీనగర్ పట్టణాల మధ్య వార్తలు పంపడానికి వైర్లెస్ టెలీప్రింటర్ 'సర్క్యూట్లు' ఏర్పాటు చేయబడ్డాయి. కలకత్తా- అగర్తాలాల మధ్య కూడా ఇటువంటి వైర్లెస్ టెలిప్రింటర్ సర్క్యూట్ల ఏర్పాటు త్వరలో జరుగుతుంది.

నౌకల నుంచి సందేశాలు

నౌకల నుంచి వచ్చే సందేశాలను, వార్తలను తీసుకొనడానికి బొంబాయి, కార్వార్, కొచ్చిన్, తూతికోరన్, విశాఖపట్టణం, కలకత్తాలలో వైర్లెస్ కేంద్రాలు ఏర్పాటు చేయబడ్డాయి. ఈ కేంద్రాలలో తంతి తపాలా శాఖ వాళ్ళు నౌకల నుంచి వచ్చే వార్తలను త్వరగా పంపడం కూడా

జరుగుతుంది.

మరొక ముఖ్య విషయం. సముద్రంలో నౌకలలోని ప్రయాణీకులు తమ బంధువులకు మిత్రులకు టెలిగ్రాములు పంపడానికి కూడా ఈ కేంద్రాలలో వైర్లెస్ టెలిగ్రాఫ్ సౌకర్యాలు వున్నాయి. ఇంకొక ముఖ్య విషయం. ఇటీవల బొంబాయి, మద్రాసు, కలకత్తా పట్టణాల నుంచి 'టెలిఫోన్ల' ద్వారా సముద్రంలో ఉన్న నౌకలలోని ప్రయాణీకులతో తక్కువ ఖర్చుతో మాట్లాడడానికి కూడా సౌకర్యం కల్పించబడింది.

ఇటీవల అస్సాములో బ్రహ్మపుత్రా నదికి ఈవైపు ఆవైపు ఉన్న తేజ్‌పూర్, నౌత్‌గాంగ్‌ల మధ్య వైర్లెస్ సర్క్యూట్లు ఏర్పాటు చేశారు. పాట్నా, ముజఫర్‌పూర్ వంటి పట్టణాల మధ్య కూడా ఇటువంటి సర్క్యూట్లు త్వరలో ఏర్పాటు చేస్తారు.

తంతి తపాలా శాఖ వాళ్ళు వైర్లెస్ కేంద్రాలే కాక వివిధ 'ప్రయివేటు' 'కంపెనీలు' కూడా ప్రత్యేకంగా కొన్ని వైర్లెస్ కేంద్రాలను తక్కువ ఖర్చుతో ఏర్పాటు చేయడం జరిగింది.

[ప్రజామత - జనవరి 26-1964]

ఆంధ్రప్రదేశ్ 'ఎగ్రికల్చరల్ యూనివర్శిటీ'
రాజేంద్ర నగర్, హైదరాబాద్.

మొదటి సంవత్సరం 'ఇంటిగ్రేటెడ్' బి.యస్.సి. (ఎగ్రికల్చర్) డిగ్రీ కోర్సులో 1964-65 'ఎకడమిక్' సంవత్సరానికి ఈ ఎగ్రికల్చరల్ యూనివర్శిటీ క్రింద వున్న (1) 'ది ఎగ్రికల్చరల్ కాలేజి', బాపట్ల, (2) శ్రీ వెంకటేశ్వర ఎగ్రికల్చరల్ కాలేజి, తిరుపతి, మరియు,(3) 'ది కాలేజ్ ఆఫ్ ఎగ్రికల్చర్', రాజేంద్రనగర్, హైదరాబాదులలో ప్రవేశం:

దరఖాస్తు 'ఫారం', మరియు 'ప్రాస్పెక్టస్'లను 'ప్రిన్సిపాల్', ఎగ్రికల్చరల్ కాలేజి, బాపట్ల లేక ప్రిన్సిపాల్, వెంకటేశ్వర ఎగ్రికల్చరల్ కాలేజి, తిరుపతి వారికి ఒక రూపాయి 'మనియార్డరు' ద్వారా చెల్లించిన పంపబడును. 'పోస్టలు స్టాంపులు', 'పోస్టలు ఆర్డర్లు' అంగీకరించ బడవు. పూర్తి చేయబడిన దరఖాస్తులు పై చెప్పబడిన ఆయా కాలేజీల ప్రిన్సిపాలులకు 1964 జూలై 13 వ తేదీకి ముందుగా చేరేలాగ పంపవలెను. ఈ తేదీ తరువాత చేరిన దరఖాస్తులు అంగీకరించబడవు.

పై చెప్పబడిన కాలేజీలలో మొదటి సంవత్సరం ఇంటిగ్రేటెడ్ బి.యస్.సి.(ఎగ్రికల్చర్)

డిగ్రీ కోర్సులో ప్రవేశానికి ఈ క్రింద చెప్పబడిన అర్హతలు అభ్యర్థులకు వుండవలెను.

ప్రవేశార్హతలు: అభ్యర్థులు ఈ క్రింది పరీక్షలు 'పాస' యి వుండవలెను.

(ఏ) ఆంధ్ర, శ్రీ వెంకటేశ్వర, ఉస్మానియా, మద్రాసు, అన్నామలై యూనివర్శిటీలలో లేక గుర్తింపబడిన యితర యూనివర్శిటీలలో 'ప్రీ-యూనివర్శిటీ' పరీక్షను ఈ క్రింది వానిలో ఏ రెండు 'సబ్జెక్టు'లతో నైనను పాసయి వుండవలెను.

(ఏ) (i) 'ఫిజికల్ సైన్సు'లు
(ii) 'బయొలాజికల్' లేక 'నేచురల్' సైన్సులు
(iii) ఎగ్రికల్చర్

లేదా

(బి) 'బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్' హైదరాబాదు వారు నిర్వహించు (తెలంగాణా ప్రాంతమునకు) 'హయ్యరు సెకండరీ (మల్టీపర్పస్) స్కూలు' 'సర్టిఫికెట్' పరీక్షను పై 'ఏ' లోని మూడు సైన్సు సబ్జెక్టులతో

అనగా

(1) ఫిజికల్ సైన్సులు
(2) బయొలాజికల్, లేక నేచురల్ సైన్సులు
(3) ఎగ్రికల్చర్ లలో ఏ రెండింటితో నైనను పాసయి వుండవలెను.

లేదా

(సి) జాయింట్ సెక్రెటరీ టు ది కమిషనర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్, గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, (ఆంధ్ర ప్రాంతము) హైదరాబాదు వారు నిర్వహించు హాయ్యర్ సెకండరీ 'అండ్' మల్టీపర్పస్ స్కూల్ లీవింగ్ సర్టిఫికేట్ 'పబ్లిక్' పరీక్షను పై 'ఏ' లో చెప్పబడిన మూడు సైన్సు పాఠ్య విషయములలో అనగా (i) ఫిజికల్ సైన్సులు, (ii) బయొలాజికల్ లేక నేచురల్ సైన్సులు, (iii) ఎగ్రికల్చర్ లలో ఏరెండింటితో సైనను ప్యాసయి వుండవలెను.

లేదా

(డి) ఆంధ్ర, శ్రీ వెంకటేశ్వర మరియు ఉస్మానియా యూనివర్శిటీలచే పై చెప్పబడిన పరీక్షలకు సమానముగా గుర్తించబడిన ఇతర పరీక్ష సైనను, ఈ మూడు సైన్సు పాఠ్య విషయములలో, అనగా (1) ఫిజికల్ సైన్సులు, (2) బయొలాజికల్ లేక నేచురల్ సైన్సులు మరియు (3) ఎగ్రికల్చర్ లలో ఏరెండింటితో సైనను ప్యాసయి వుండవలెను.

ప్రవేశార్హతకు కనీసపు 'మార్కు'లు:

సైన్సు పాఠ్య విషయములలో కనీసం 45% కు తక్కువ కాని మార్కులతో ప్యాసయిన అభ్యర్థులే దరఖాస్తులు వేయుటకు అర్హులు. అయితే, షెడ్యూల్డు

కులములు, షెడ్యూల్డు తెగల అభ్యర్థుల విషయమున కావలసిన కనీసపు మార్కులు 40% మాత్రమే.

ప్రవేశమును కోరు అభ్యర్థులకు 31.10.1964 తేదీ నాటికి పదునారు సంవత్సరములు పూర్తి అయి యుండవలెను.

'వైస్-ఛాన్సెలర్'
ఆంధ్రప్రదేశ్ ఎగ్రికల్చరల్ యూనివర్శిటీ
రాజేంద్రనగర్, హైదరాబాదు

[ఆంధ్ర పత్రిక - జూలై 4, 1964]

1965 లో కూడా 'అమెరికా' సైనిక సహాయం
'మెక్ నమారా' - చవన్ ల అంగీకారం

ఢిల్లీ, జూన్ 7 —

1965 వ ఆర్థిక సంవత్సరంలో భారత దేశానికి అమెరికా చేయబోవు సైనిక సహాయం గురించి ఒక అంగీకారం జరిగింది. ఇక దీనిని గురించిన అవసరమైన చర్యలను అమెరికా గవర్న్మెంటు తీసుకొనవలసి వుంది.

ఇటీవల అమెరికా వెళ్ళి వచ్చిన భారత రక్షణ మంత్రి శ్రీ వై. బి. చవన్ నిన్న ఇక్కడ ఒక ప్రకటనలో ఈ వార్తను తెలిపారు.

ఈ అంగీకారం వల్ల అమెరికా మన సైన్యానికి వార్తా ప్రసారాల పరికరాలను 'సప్లై' చేస్తుంది. సరిహద్దు ప్రాంతాలలో 'రోడ్లు' వేయడానికి కావలసిన పరికరాలను కూడా ఇస్తుందని చవన్ విశదీకరించారు.

1964 వ ఆర్థిక సంవత్సరంలో భారత దేశం వార్తా ప్రసార పరికరాలను రక్షణ పరికరాలను కొన్ని యంత్రాలను వెంటనే కొనడానికి ఋణ సహాయం పొందింది. మహారాష్ట్రలో నాగపూర్ పట్టణానికి దగ్గర ఒక ఆయుధోత్పత్తి కర్మాగారాన్ని ఏర్పాటు చేయడానికి కూడా అంగీకారం జరిగింది.

ఈ ఆయుధోత్పత్తి కర్మాగారానికి

యంత్రాలను కొనడానికి ఋణ సహాయం చేయవలెనని, 1965వ ఆర్థిక సంవత్సరం నుంచి సైనిక పరికరాలను అమ్మే సౌకర్యాన్ని భారత దేశానికి కూడా కల్పించవలెనని అమెరికా గవర్నమెంటుకు చవన్ విశదీకరించారు. ఇందుకు అమెరికా అంగీకారాన్ని అమెరికా రక్షణా మంత్రి శ్రీ మాక్‌నమరా శ్రీ చవన్‌కు తెలిపిన వార్త కూడా ఈ ప్రకటనలో వుంది.

అంతే కాకుండా భారత దేశానికి రక్షణా విమానాలను సప్లై చేసే విషయం గురించి సంప్రతింపులను కొనసాగించవలెనని కూడా శ్రీ మాక్‌నమరా శ్రీ చవన్‌లు ఒక అంగీకారానికి వచ్చారు.

'కమ్యూనిస్టు' చైనా చర్యల వల్ల భారత దేశానికి ఏర్పడిన ప్రమాదాన్ని ఎదుర్కొనడానికి భారత దేశానికి ఇక ముందు కూడా అమెరికా చేయవలసిన ఋణ సహాయాన్ని గురించి సంప్రతింపులు జరిగినట్లు ఈ ప్రకటనలో వుంది. 'వాషింగ్టన్' నుండి శ్రీ చవన్ ఢిల్లీకి తిరిగి వచ్చిన తర్వాత కూడా ఈ విషయమై సంప్రతింపులు కొనసాగినట్లు ఈ ప్రకటన ద్వారా చవన్ తెలిపారు.

వాషింగ్టన్‌లో జరిగిన సంప్రతింపులలో శ్రీ చవన్ భారత దేశ రక్షణకు సంబంధించిన విదేశీ మారక ద్రవ్య పరిస్థితిని చవన్ విశదీకరించి భారతదేశ ఆర్థిక పరిస్థితికి నష్టం లేకుండా చూడవలెనని తెలిపినట్లు ఈ ప్రకటనలో వుంది. దేశ రక్షణకు సంబంధించిన ఖర్చులను జాగ్రత్తగా చూడవలెనని విదేశీ మారక ద్రవ్య సహాయం అవసరమని కూడా ఈ ప్రకటన తెలియజేసింది.

(ఆంధ్రప్రభ - జూన్

రాజ్యాంగ 17వ సవరణ 'బిల్లు': రాజ్యసభ ఆమోదం

స్వతంత్ర 'పార్టీ' నాయకుని తీవ్రమైన విమర్శ

న్యూఢిల్లీ, జూన్ 5:

రాజ్యాంగ 17వ సవరణ బిల్లును ఈ రోజు రాజ్యసభ ఆమోదించింది. దీనివల్ల దేశంలో భూస్వామ్య సంస్కరణలు త్వరలో జరగడానికి అవకాశం ఏర్పడింది.

ఈ బిల్లును రాజ్యసభ 177-9 'ఓట్ల' తేడాతో ఆమోదించింది. అనగా రాజ్యసభలో 'ఓటింగ్'లో పాల్గొనిన సభ్యులలో మూడింట రెండు వంతులకు తక్కువ కాని సంఖ్యాబలంతో ఆమోదించింది. ఇప్పుడు దీనిని రాష్ట్రపతి ఆమోదం కోసం పంపుతారు.

ఈ వారంలో ఇంతకు ముందు లోక్ సభలో స్వతంత్ర పార్టీ సభ్యులు ఈ బిల్లును తీవ్రంగా ఎదుర్కొన్నారు. స్వతంత్ర సభ్యులు చాలా మంది ప్రతిపక్ష సభ్యులతో చేరి బిల్లుకు అనుకూలంగా ఓటు చేశారు.

ఈ బిల్లు రాజ్యాంగంలోని 31వ అధికరణానికి సవరణ. ఒక వ్యక్తి సేద్యం క్రింద

ఉన్న భూమిని స్వాధీనం చేసుకోడానికి ప్రభుత్వ చట్టం అవకాశం కల్పించినప్పుడు 'మార్కెట్' విలువ ప్రకారం నష్టపరిహారం చెల్లించి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవలసిన ఏర్పాటు బిల్లులో వుంది. ఈ బిల్లు 'ఎస్టేట్' అన్న పదాన్ని విశదీకరించింది. అంతేకాక రాష్ట్రాలు భూమి విషయమై చేసిన 64వ చట్టానికి రక్షణ కల్పించింది.

న్యాయశాఖా మంత్రి శ్రీ ఎ.కె.సేన్, కమ్యూనిస్టు సభ్యుడు శ్రీ భూపేష్ గుప్తకు జవాబు చెప్పుతూ ఒక వ్యక్తికి సంబంధించిన భూమిని స్వాధీనం చేసుకోడానికి మార్కెట్ విలువ ప్రకారం నష్టపరిహారం చెల్లించే ఏర్పాటు లేకుండా ఏ రాష్ట్రమైనా శాసనం చేస్తే న్యాయస్థానం దానిని అంగీకరించ రాదని చెప్పారు.

వ్యక్తిగత సేద్యానికి సంబంధించి కమ్యూనిస్టు సభ్యుడు శ్రీ కె. దామోదరన్ చేసిన ఒక సవరణను శ్రీ సేన్ అంగీకరించలేదు. వ్యక్తిగత సేద్యం అంటే వ్యక్తి చేసే సేద్యమే కాదనీ, అతడి కుటుంబంలోని వ్యక్తులు, పనివాళ్ళు చేసే సేద్యం కూడా వ్యక్తిగత సేద్యమే అవుతుందనీ, ఆయన తెలిపారు.

బిల్లు మూడవసారి సభలోకి

వచ్చినపుడు స్వతంత్ర పార్టీ నాయకుడు
శ్రీ దహ్యా భాయ్ పటేల్ తీవ్రంగా మాట్లాడుతూ
కమ్యూనిస్టులకు అనుకూలంగా కాంగ్రెసు
పార్టీ ఇలాంటి శాసనాలు తెస్తూ వుందని
వాదించారు.

ఈ బిల్లు ఆస్తికి సంబంధించిన
ప్రాథమిక హక్కులు స్వర్గీయ డాక్టర్
అంబేద్కర్ ఇచ్చిన మాటకు విరుద్ధంగా
ఉన్నదని కూడా ఆయన వాదించారు.

శ్రీ బి. ఎం. గైక్వాడ్ ('రిపబ్లికన్')
శ్రీ పటేల్ వాదాన్ని ఎదుర్కొంటూ స్వర్గీయ
డాక్టర్ అంబేద్కర్ భూమిని జాతీయం
చేయడం అంగీకరించని వ్యక్తి కాదని
తెలిపారు.

[ఆంధ్ర పత్రిక - ఆగస్టు 6-1964]

'సైప్రస్' 'గ్రీక్' పట్టణాల పైనా పల్లెల పైనా
'టర్కీ' విమానాల దాడి.
'రాకెట్లు', మరతుపాకుల ప్రయోగం:
ఇరవై నాలుగు మంది 'సైప్రియట్'ల మరణం:
రెండు వందల మందికి గాయాలు.
దీవిపై దండయాత్రకు టర్కీ సైన్యాల ప్రయాణం.
'బ్రిటన్', అమెరికాల ఆందోళన:
భద్రతా మండలి సమావేశం.

ఐక్యరాజ్యసమితి, ఆగస్టు 9:
టర్కీ సైన్యాలు సైప్రస్ దీవిలో దిగిన వార్తను ఇంకొక గంటలో వినగలరని సైప్రస్ ప్రతినిధి ఈ రోజు భద్రతా మండలిలో ప్రకటించారు. నాలుగున్నర గంటల తర్వాత ఆ ప్రతినిధే సైప్రస్ కోస్తాకు పదిహేను 'మైళ్ళ' దూరం వరకు వచ్చిన టర్కీ సైన్యాలు 30 మైళ్ళు వెనకకు వెళ్ళిపోయాయని కూడా ప్రకటించారు.

వాషింగ్‌టన్‌లో విదేశాంగ శాఖలోని అధికారులు టర్కీ దేశపు నౌకలు సైప్రస్ కోస్తాకు దగ్గరగా కనిపించలేదనీ, విమానాల దాడి వార్తను టర్కీ ప్రభుత్వమే ఖండించిందనీ తెలియజేశారు.

భద్రతా మండలి సభ్యులు రెండు గంటలకు పైగా గ్రీకు, టర్కీ దేశాలకు పంపవలసిన సందేశాన్ని గురించి చర్చించారు. కాని ఫలితం కనిపించలేదు. అందువల్ల

మండలి సమావేశం కొనసాగలేదు. ఆ చర్చలలో టర్కీ ప్రతినిధి దాడి వార్తను ఖండించారు.

సభ్యుల చర్చలలో ఫలితం కనిపించలేదను వార్తను అధ్యక్షులు శ్రీ నెలసన్ ప్రకటించారు. సంప్రదింపుల కోసం ప్రతినిధులు తమ తమ దేశాల రాజధానులకు చేరుకొన్నారు. సైప్రస్ లో ఇటీవల పరిణమించిన పరిస్థితులపై అత్యవసర నివేదికను ప్రకటించవలెనని కార్యదర్శి శ్రీ ఉథాంట్ ను కోరారు. భద్రతా మండలి యెప్పుడు మరొక సమావేశం తేదీ, సమయం నిర్ణయించడానికి అధ్యక్షునికి సభ్యులు అధికారమిచ్చారు.

టర్కీ సైప్రస్ మీద దాడి చేయలేదనీ కొన్ని డిస్ట్రాయర్లు మాత్రం కోస్తా వద్ద వున్నాయని, అవి అక్కడ తిరుగుతున్నాయనీ టర్కీ ప్రతినిధి మండలి సమావేశంలో చెప్పారు. సైప్రస్ ప్రతినిధి మాట్లాడుతూ టర్కీ నౌకాబలం పదిహేను మైళ్ళ దూరంలోకి వచ్చి ఆ తర్వాత ముప్పది మైళ్ళ వెనకకు వెళ్ళిందన్నారు. ఇలా ముందుకు వచ్చి వెనకకు పోవడం వారికి అలవాటుగా వుందని చెప్పారు.

నికోసియాలో ఐక్యరాజ్యసమితి ప్రతినిధి ఒకరు మాట్లాడుతూ సైప్రస్ లో పరిస్థితి ఆందోళన కలిగించేలాగ వుందన్నారు.

ఈ రోజు ప్రకటించబడిన సైప్రస్ ప్రభుత్వ
ప్రకటనలో నిన్న టర్కీ జరిపిన విమాన
దాడుల వల్ల ముప్పది మంది మరణించారని
రెండు వందల ముప్పది మందికి గాయాలు
తగిలాయని తెలుపబడింది. వైద్యసహాయం
పంపవలసిందని పెక్కు దేశాలను సైప్రస్
ప్రభుత్వం కోరింది.

మండలి చర్చలో ముందు సైప్రస్
ప్రతినిధి మాట్లాడవలెనని రష్యా చేసిన
ప్రతిపాదనకు అనుకూలంగా మూడు ఓట్లు,
ప్రతికూలంగా నాలుగు ఓట్లు వచ్చాయి.
నలుగురు పాల్గొనలేదు. అందువల్ల టర్కీ
ప్రతినిధికే మొదట మాట్లాడే అవకాశం
లభించింది. టర్కీ ఇరవైయారు యుద్ధ
నౌకలను, సైన్యాలతో నిండిన నౌకలను,
దాడికోసం పంపిస్తున్నట్లు టెలిఫోన్ ద్వారా
తన ప్రభుత్వం తెలియజేసిందని సైప్రస్
ప్రతినిధి చెప్పారు. టర్కీ ప్రతినిధి ఈ
వార్తను ఖండించి సైప్రస్ అధ్యక్షుడు 'మకారి
యోస్' సైప్రస్‌లోని టర్కిష్ 'మైనారిటీ'కి
తీవ్ర సమస్య తెచ్చిపెట్టుతున్నారని తెలిపారు.

మన్సూరా ప్రాంతం మీదనే టర్కీ
విమానాలు నిన్న దాడి చేశాయని సైప్రస్
నుంచి వార్తలు వచ్చాయి. సైప్రస్‌లోని
పరిస్థితులను గురించి సమితి సైనిక వర్గానికి

చెందిన 'బ్రిగేడియర్' తిమ్మయ్య రాజకీయ
నాయకులతో చర్చలు జరుపుతున్నారని
మండలి అధ్యక్షులు శ్రీ విల్సన్ చెప్పారు.
మన్సూరా వద్ద టర్కీ మైనారిటీ వారికి
రక్షణ కల్పించే బాధ్యత కూడా సమితి
సైన్యం తీసుకొనిందని వెల్లడించారు.

బ్రిటన్, అమెరికాల ఆందోళన

గ్రీకు-టర్కిష్ సైప్రియట్ల మధ్య పోరాటం మరలా కలగడాన్ని గురించి అమెరికా చాలా ఆందోళన పడుతున్నట్లు అధ్యక్షులు శ్రీ 'జాన్సన్' ఈరోజు వెల్లడించారు. సైప్రస్‌లో పోరాటం లేకుండా చేయడానికి సమితి సైనిక వర్గం చేసే ప్రయత్నం మంచిదని కూడా శ్రీ జాన్సన్ తెలియజేసారు.

'లండన్'లోని టర్కీ, గ్రీకు దేశాల రాయబారులకు బ్రిటిష్ విదేశాంగ మంత్రి తన ప్రభుత్వం యొక్క ఆందోళనను తెలియచేసారు.

[ఆంధ్ర పత్రిక — ఆగస్టు 10-1964]

క్రీడాభిరామం

'న్యూజిలెండ్'లో భారత 'హాకీ' జట్టుకు మరొక విజయం

నాపియర్, సెప్టెంబర్ 4

భారత హాకీ జట్టు నిన్న ఇక్కడ 'హాకీస్ బే' జట్టును పెద్ద తేడాతో ఓడించేసింది. భారత జట్టు తొమ్మిది 'గోలు'లు చేయగా హాకీస్ బే జట్టు ఒక్క గోలు మాత్రమే చేసింది.

ఆట మొదటి భాగంలో ఇండియా ఏడు గోలులు చేయగా హాకీస్ బే జట్టు ఒక్క గోలు కూడా చేయలేదు.

ఆట రెండవ భాగంలో మాత్రం హాకీస్ బే జట్టు ఒక్క గోలు చేసింది. భారత జట్టులో హర్బిందర్ సింగ్ నాలుగు గోలులు చేయగా, ప్రితిపాల్ సింగ్ రెండు, ఉధమ్ సింగ్, రామ్ సింగ్, హరిపాల్ సింగ్‌లు ఒక్కొక్కరు ఒక గోలు చేశారు.

'టేబుల్ టెన్నిస్' పోటీలు

హైదరాబాద్, సెప్టెంబర్ 3-

వివేక వర్ధని కాలేజిలో జరుగుతున్న అంతర్ కళాశాల టేబుల్ టెన్నిస్ పురుషుల

పోటీలలో గాంధి మెడికల్ కాలేజీని వివేక వర్ధని కాలేజ ఓడించి 'సెమి-ఫైనల్స్'కు చేరింది.

స్త్రీల పోటీలలో వివేక వర్ధనీ కాలేజ జట్టు స్త్రీల కళాశాల జట్టును ఓడించింది.

'ఒలింపిక్' జ్యోతి

కౌలాలంపూర్, సెప్టెంబర్-3. గ్రీస్ నుంచి టోక్యో వెళ్ళుతున్న ఒలింపిక్ జ్యోతి నిన్న ప్రత్యేక విమానంలో ఇక్కడకు వచ్చింది.

యూనివర్శిటీ క్రికెట్ పోటీలు అంతర్ మండల ప్రాతిపదికపై నిర్వహించడానికి ప్రయత్నాలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 3

1965-66 నుంచి యూనివర్శిటీలలో అంతర్ మండల ప్రాతిపదికపై 'ఛాంపియన్ షిప్' పోటీలను నిర్వహించడానికి 'క్రికెట్ కంట్రోల్ బోర్డు' నిర్ణయించింది.

ఈ విషయమై 13వ తేదీన ఇక్కడ జరుగబోయే సర్వసభ్య సమావేశంలో తుది నిర్ణయం తీసుకుంటారు.

ఈ ప్రతిపాదనకు క్రికెట్ కంట్రోల్

బోర్డు అధ్యక్షుడు బరోడా మహారాజ
అనుకూలంగా వున్నట్లు తెలుస్తున్నది.

వచ్చే సంవత్సరం నుంచి ఈ పోటీలు జరగగలవని బరోడా మహారాజ 'ఇంటర్ యూనివర్సిటీ బోర్డు' కు హామీ ఇచ్చినట్లు తెలుస్తున్నది.

అంతర్ కళాశాల 'ఫుట్‌బాల్' పోటీలు
హైదరాబాద్ సాయం కళాశాల విజయం

హైదరాబాద్, సెప్టెంబర్-3

సికిందరాబాద్ 'జింఖానా గ్రౌండ్స్' లో నిన్న జరిగిన అంతర్ కళాశాల ఫుట్‌బాల్ పోటీలలో హైదరాబాద్ సాయం కళాశాల జట్టు నిజాం కాలేజని 3-2 గోలులతో ఓడించేశారు.

హైదరాబాద్ సాయం కళాశాల జట్టులో బాసిల్ ఒకరే ఈ మూడు గోలులు చేశారు. ఆట సగభాగం పూర్తి అయ్యేసరికి సాయం కళాశాల రెండు గోలులు చేసింది.

సాయంత్రం జరిగిన ఉత్సవంలో సికిందరాబాద్ కాలేజి ప్రిన్సిపాల్ ఆటల్లో విజయం పొందిన జట్టుకు 'ట్రోఫీ' బహూకరించారు.

[ఆంధ్ర జ్యోతి - సెప్టెంబర్ 4-1964]

క్రీడాలోకం

ఎల్. ఆర్. డి. ఇ. జట్టుతో
సి. ఐ. ఎల్. జట్టు 'డ్రా'

మద్రాసు ఫుట్ బాల్ 'షీల్డు' పోటీ

మద్రాసు, జూలై 18

ఎల్. ఆర్. డి. ఇ. జట్టుకు (బెంగళూరు) సి. ఐ. ఎల్. జట్టుకు (బెంగళూరు) నిన్న సాయంత్రం నెహ్రూ 'స్టేడియం' లో జరిగిన సెమిఫైనలులో ఉభయ పక్షాలూ చెరో రెండు గోలులు చేసి సమానమైనాయి. అన్ని గోలులూ మొదటి అరగంటలోనే పడ్డాయి.

ఉభయ పక్షాల వారు తుదివరకు చాల నేర్పుతో ఆడారు. కాని, ఎల్. ఆర్. డి. ఇ. జట్టు మాత్రం ఎదుటి పక్షం వారికంటే కొంత ఎక్కువ నేర్పును ప్రదర్శించినారు. ఎల్. ఆర్. డి. ఇ. 'సెంటర్ ఫార్వార్డు' దామోదరన్ అందరికంటే ప్రజ్ఞతో ఆడి తాను రెండు గోలులు సాధించాడు.

సి. ఐ. ఎల్. ఆటగాళ్ళు బంతిని ఒక వైపునుండి మరొక వైపుకు దూరదూరంగా అందజేస్తూ ఆడారు. అయినా వాళ్ళు యిదివరకు పోటీలలో ప్రదర్శించినంత నేర్పును యీ ఆటలో ప్రదర్శించలేకపోయారు.

ఎల్. ఆర్. డి. ఇ. జట్టు మొదట సెంటర్ ఫార్వర్డు దామోదరన్ ద్వారా తొలి గోలు సాధించుకొనింది. మరొక పది నిమిషాలలో సి. ఐ. ఎల్. జట్టు ఇక్బల్ ద్వారా ఒక గోలు వేసి సమానమైనారు. కాని, మళ్ళీ వెంటనే ఎల్. ఆర్. డి. ఇ. దామోదరన్ అసమాన ప్రజ్ఞతో రెండవ గోలు చేసాడు. ఆపైన సి. ఐ. ఎల్. జట్టు 'కార్నరు' బంతిని వేసినప్పుడు ఎత్తుగా వచ్చిన బంతిని ఇక్బల్ తలతో గోలు వైపు కొట్టగా ఎల్. ఆర్. డి. ఇ. ఆటగాడు అసరాలో దానిని ఆపడానికి ప్రయత్నించినపుడు పొరపాటున బంతి గోలులోకి వెళ్ళిపోయింది.

రెండవ అరగంటలో ఉభయపక్షాలు ఒకరిపై ఒకరు దాడులు కొనసాగించారు. దాని ఫలితం మాత్రం మారలేదు.

[ఆంధ్రప్రభ - జూలై 19-1964]

దేశంలో ప్రతిపక్షాలు

నెహ్రూ మరణం తర్వాత భారత ప్రతిపక్షాల చరిత్రలో కూడా ఒక నూతన దశ ప్రారంభమయింది. నెహ్రూ వ్యక్తిత్వం, దేశంలో ప్రతిపక్షాలు అభివృద్ధి పొందడానికి, బలపడడానికి అవకాశం కలిగించలేదు. నెహ్రూజీని చూసి కాంగ్రెసుకు ఓట్లిచ్చే అవకాశం ఇక ఆ పక్షానికి లేదు. ప్రతిపక్షాలను అభివృద్ధి పొందనివ్వకుండా చేసే నెహ్రూ వ్యక్తి ఇక లేడు. ఇట్టి నూతన పరిస్థితులలో లభించిన అవకాశంలో ప్రతిపక్షాలు బలపడగలవా లేవా అనే విషయాన్ని కొంచెం చూద్దాం.

కమ్యూనిస్టులలో చీలిక

అఖిల భారత స్థాయిలో ముఖ్యంగా చెప్పదగినది నాలుగు ప్రతిపక్ష పార్టీలు. అవి (1) కమ్యూనిస్టు పార్టీ (2) సంయుక్త 'సోషలిస్టు పార్టీ' (3) జనసంఘ్ పార్టీ (4) స్వతంత్ర పార్టీ

స్వాతంత్ర్యం తరువాత మొదటి దశలో కాంగ్రెసుకు బలమైన ప్రతిపక్ష

పార్టీగా కమ్యూనిస్టు పార్టీ ఏర్పడింది. కమ్యూనిస్టుల బలాన్ని తక్కువ చేయడానికి నెహ్రూ దేశంలో సోషలిస్టు విధానాలను, అంతర్జాతీయంగా కమ్యూనిస్టుల విమర్శలకు లోబడని విధానాన్ని ప్రారంభించాడు. స్టాలిన్ మరణం తర్వాత కమ్యూనిస్టు ప్రపంచంలో వచ్చిన మార్పుల వలన నెహ్రూ విధానాలు త్వరగా మంచి ఫలితాలను ఇవ్వసాగాయి. "నెహ్రూ ప్రభుత్వంలో అభివృద్ధి కలిగించే విధానాలకు మద్దతు' అని నెహ్రూ ప్రభుత్వానికి కమ్యూనిస్టు పార్టీ తన తీర్మానాల ద్వారా మద్దతు యివ్వసాగింది. కాని ఈ మద్దతు ఏకగ్రీవమైనది కాదు. అందువల్ల కమ్యూనిస్టు పార్టీలో చీలికలు ఏర్పడ్డాయి. మొన్నటి వరకు అవి బయటు పడకపోయినా, కాంగ్రెసు ప్రభుత్వానికి పూర్తిగా మద్దతును యిచ్చే డాంగే వర్గం, కమ్యూనిస్టు పార్టీలో ఏర్పడింది.

డాంగే వర్గానికి ప్రతికూలంగా అతివాదుల వర్గం ఒకటి అప్పటి నుండి బలంగా ఏర్పడి పని చేస్తున్నది. రష్యా, చైనా కమ్యూనిస్టు పార్టీల మధ్య ఏర్పడిన పార్టీ సిద్ధాంత భేదాలు ఈ వర్గాల మీద కూడా పడ్డాయి. అప్పటి నుండి డాంగే వర్గం

రష్యన్ 'లాబీ' గాను, సుందరయ్య. గోపాలన్ వర్గం చైనా లాబీగానూ ఏర్పడి కమ్యూనిస్టు పార్టీలో రెండు చీలికలు అఖిల భారత స్థాయిలో ప్రారంభమైనాయి.
ఈ భేదాలు, చీలికలు కమ్యూనిస్టు పార్టీ జాతీయ మండలి నుండి ముప్పై రెండు మంది అతివాద (చైనా) కమ్యూనిస్టుల 'సస్పెన్షన్' లో ప్రారంభమై, తెనాలి సభలో మరొక కమ్యూనిస్టు పార్టీ ఏర్పడడంతో పూర్తి అయింది.

[వాహిని - ఆగస్టు 7-1964]

మన పట్టణాలు : మంచి నీళ్ళ సదుపాయం

గ్రామీణ ప్రజలకు మంచి నీళ్ళ సదుపాయాలను కలిగించడానికి ప్రతి సంవత్సరం కోట్లకొలది రూపాయలు కేటాయించబడుతున్నాయి. ఆ కోట్లు ఏమవుతున్నాయో కాని త్రాగడానికి నీరు లేక అనేక ప్రాంతాలలో ప్రజలు ఇంకా బాధ పడుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పెద్ద నదులు వున్నా మంచి నీళ్ళు లేని గ్రామాలు, పట్టణాలు వేనకు వేలుగా వున్నాయి.
నెల్లూరు జిల్లా కనిగిరిలో మంచి నీళ్ళను ఇరుగు పొరుగు గ్రామాల నుంచి 'లారీ' ల్లో 'బస్సు' ల్లో తెచ్చుకుంటున్నారని పత్రికల్లో వార్తలు పడినాయి. జనానికి మంచి నీటిని సప్లై చేయడం కూడా ఈ రోజుల్లో ఒక పరిశ్రమగా పరిణమించింది. ముఖ్యంగా అభివృద్ధి పొందుతున్న పట్టణాలలో త్రాగే నీరు సప్లయి చేయడం ఒక పెద్ద పరిశ్రమగా పరిణమించింది. నదుల దగ్గర వున్న పట్టణాల్లో కూడా జనానికి అత్యావసరమైన మంచి నీరు సప్లయి కావడం లేదు. పట్టణ ప్రజల సమస్యలు ఇలా వుండగా, గ్రామీణ ప్రజలకు మంచి నీటిని

సప్లై చేసే పథకం ఏదీ అమలులో లేక పోవడం చాలా శోచనీయం.

గోదావరికి పది మైళ్ళు

మంచినీటి ప్రణాళికకు ఎన్ని మైళ్ళు?

గోదావరి నదికి పది మైళ్ళు దూరంలోపల వున్న పద్దెనిమిది గ్రామాలకు మంచినీటి సప్లయి పథకం తయారై కొన్ని సంవత్సరాలయింది. కాని దానిని అమలు జరపడంలో జాప్యం జరుగుతూ వుంది. ఒక పెద్ద ఉద్యోగి మారినప్పుడల్లా పథకం మరొకలాగ మార్పు చేయకూడదా అని ప్రశ్నలు వేస్తూ జాప్యం చేయడం జరుగుతూ వుంది. కనీసం మంచినీటినైనా జనానికి సప్లయి చేయవలసిన బాధ్యత ప్రభుత్వం మీద వున్నదనే విషయం ఈ ఉద్యోగులకూ, వారి పై అధికారులకూ తెలిసినట్లు లేదు. పిఠాపురం తాలూకాలో మూడు వేల జనాభాగల ఒక గ్రామంలో డబ్బిచ్చి మంచినీరు తెచ్చుకుంటున్న పరిస్థితిని ఈ రచయిత స్వయంగా చూడడం జరిగింది.

ఏలేరు కాలవ సమీపం, కాలువ నీరు దూరం.

దగ్గరలో ఏలేరు కాలవ వున్నది.

మంచి నీటి కోసమైనా ఆ కాలవను ఆ ఊరి దగ్గరకు తీసుక రావచ్చు. అలాంటి అభిప్రాయం పంచాయితీ సమితి వాళ్ళకు, 'రెవెన్యూ' అధికారులకు ఎందుకు లేదో తెలియడం లేదు. తమ మంచి నీటి అవసరాన్ని తీర్చుకోడానికి గ్రామస్థులు అధికారుల మీద ఒత్తిడి చేసే అభిప్రాయం వారికి లేదు. ప్రజాభివృద్ధికి వేయబడే పథకాలలో ప్రణాళికలలో ఏది ముందు, ఏది వెనుక అని నిర్ణయించడంలోనే అధికారుల ప్రజ్ఞ కనబడుతుంది.

త్రాగటానికి నీరు లేదు: బంతి ఆట నేర్పుతారు

త్రాగటానికి మంచి నీరు లేని గ్రామస్థులకు బంతి ఆటను నేర్పించే ప్రజాభివృద్ధి కార్యక్రమాలకు అర్థం లేదు. స్త్రీలకు అల్లికలను నేర్పించే కార్యక్రమానికీ అర్థం లేదు. ఆంధ్ర ప్రదేశ ప్రభుత్వం ఈ విషయంలో ఒక ఉద్యమాన్ని ప్రారంభం చేయడం అవసరం.

[కృష్ణా పత్రిక - జూన్ 27-1964]

కేరళ మంత్రివర్గంపై అవిశ్వాస తీర్మానం
వచ్చే సోమవారంనాడు అసెంబ్లీలో చర్చ

త్రివేండ్రం, సెప్టెంబర్-3

కేరళ కాంగ్రెసు మంత్రివర్గంపై అవిశ్వాస తీర్మానం ప్రతిపాదించడానికి అసెంబ్లీ నేడు అనుమతించింది. ఎస్.ఎస్.పి. నాయకుడు శ్రీ పి.కె. కుంజు అవిశ్వాసం తీర్మానం 'నోటీసు' ఇచ్చారు.

అవిశ్వాస తీర్మానంపై చర్చ ఈనెల ఏడవ తేదీ సోమవారం నాడు జరుగగలదని 'స్పీకర్' ప్రకటించి, అప్పటి వరకు సభను వాయిదా వేశారు.

శ్రీ ఆర్. శంకర్ నాయకత్వాన వున్న కాంగ్రెసు మంత్రివర్గం ఇరువది మూడు నెలలుగా అధికారంలో వున్నది. ప్రత్యర్థి వర్గ కాంగ్రెసు శాసన సభ్యులు నేడు ప్రతిపక్షాలతో కలసి అవిశ్వాస తీర్మానం చర్చకు అనుకూలంగా ఓటు చేశారు. ప్రత్యర్థి వర్గ కాంగ్రెసు శాసన సభ్యులు పదిహేను మంది ప్రత్యేక 'బ్లాకు'గా ఏర్పడి, అసెంబ్లీలో వేరుగా కూర్చున్నారు.

అసెంబ్లీ నిబంధనలననుసరించి అవిశ్వాస తీర్మానానికి అవసరమైన ఇరువది మంది సభ్యుల కంటే ఎక్కువ మంది అనుమతించారని స్పీకర్ ప్రకటించారు.

ప్రతిపక్ష సభ్యుల సూచన ప్రకారం అవిశ్వాస తీర్మానంపై చర్చ జరిగేవరకు శాసన సభను వాయిదా వేయడానికి స్పీకర్ సమ్మతించారు. ఈ సూచనకు కాంగ్రెసు పార్టీ నాయకుడు శ్రీ శంకర్ కూడా సమ్మతించారు.

ప్రశ్నోత్తరాల సమయం తర్వాత ఎస్. ఎస్. పి. నాయకుడు శ్రీ పి. కె. కుంజు, మితవాద కమ్యూనిస్టు పక్షం నాయకుడు శ్రీ పి. అచ్యుత మీనన్‌ల వద్ద నుంచి రెండు అవిశ్వాస తీర్మానాలు అందినవని స్పీకర్ ప్రకటించారు.

ఎస్. ఎస్. పి. నాయకుడు ప్రతిపాదించిన తీర్మానం ముందు అందినదని స్పీకర్ తెలిపారు.

అవిశ్వాస తీర్మానం ప్రతిపాదనకు అనుకూలంగా వున్న సభ్యులు తమ 'సీట్ల' వద్ద లేచి నిలబడాలని స్పీకరు కోరగా కాంగ్రెస్ ప్రత్యర్థి వర్గానికి చెందిన పదునాలుగు మంది సభ్యులూ (ఒక సభ్యుడు హాజరు కాలేదు) ప్రతిపక్ష సభ్యులూ లేచి నిలబడ్డారు.

అవిశ్వాస తీర్మానం ప్రతిపాదనకు అసెంబ్లీ అనుమతించినదని స్పీకర్ ప్రకటించిన పిదప ప్రతిపక్ష నాయకుడు మాట్లాడుతూ

అధికార పార్టీలోని కొందరు సభ్యులు తీర్మానానికి అనుకూలంగా ఓటు చేయడం వల్ల మంత్రి వర్గం పై శాసన సభకు విశ్వాసం లేదనే విషయం అర్థమయిందని స్పీకర్‌కు చెప్పారు. మంత్రి వర్గం రాజీనామా చేయాలని, శాసన సభ ఏ విధమైన అంశాలను చర్చించరాదని ప్రతి పక్ష నాయకులు కోరారు.

మితవాద కమ్యూనిస్టు పక్ష నాయకుడు శ్రీ సి. అచ్యుత మీనన్ మాట్లాడుతూ మంత్రి వర్గం వెంటనే రాజీనామా చేయాలి అని అన్నారు. మంత్రి వర్గం మీద కొందరి కాంగ్రెసు సభ్యులకు కూడా విశ్వాసం లేదని ఆయన అన్నారు. అవిశ్వాస తీర్మానాలను రేపు చర్చించాలని చెప్పారు.

పదకొండు మంది సభ్యులు గల ముస్లిం లీగ్ నాయకుడు శ్రీ ఎం.పి. అహమ్మద్ మాట్లాడుతూ, మంత్రి వర్గంపై తన అవిశ్వాసాన్ని ప్రకటించారు.

ఎస్. ఎస్. పి. నాయకుడు శ్రీ కె. చంద్రశేఖరన్ మాట్లాడుతూ "అధికార పక్షానికి చెందిన కొందరు సభ్యులు ప్రతి పక్షాలతో చేరి మంత్రి వర్గం పై అవిశ్వాసం ప్రకటించడం శాసన సభ చరిత్రలో ఇంత వరకు జరగలేదు" అని

అన్నారు. అవిశ్వాస తీర్మానాన్ని వెంటనే చర్చకు తీసుకోవాలని ఆయన కోరారు.

ముఖ్యమంత్రి శ్రీ ఆర్. శంకర్ మాట్లాడుతూ అవిశ్వాస తీర్మానాన్ని వెంటనే చర్చించరాదని, అవిశ్వాస తీర్మానం చర్చకు అనుమతించడంలో కొన్ని నిబంధనలు వున్నాయని తెలిపారు. చర్చ ఎప్పుడు ఏ విధంగా జరగాలనే విషయం నిర్ణయించవలసింది స్పీకర్ అని కూడా తెలిపారు.

అవిశ్వాస తీర్మానంపై చర్చను వాయిదా వేయాలనే అభిప్రాయం తనకు లేదని స్పీకర్ అన్నారు.

శ్రీ రాజగోపాలన్ రాక

అఖిల భారత కాంగ్రెసు కార్యదర్శి శ్రీ జి. రాజగోపాలన్ నేటి ఉదయం ఇక్కడ పరిస్థితిని పరిశీలించడానికి ఢిల్లీనుంచి వచ్చారు.

"అధికార పక్షానికి, ప్రత్యర్థి వర్గానికి మధ్య రాజీ చేయడం జరుగుతుందా?" అని విలేకరులు ప్రశ్నించగా 'పరిస్థితిని అర్థం చేసుకోకుండా ఏమీ చెప్పలేను' అని అన్నారు.

తాను ఇక్కడ అవసరమైనంత కాలం వుండగలనని కూడా శ్రీ రాజగోపాలన్ అన్నారు.

ఇండియా రక్షణా చట్టం క్రింద 'అరెస్టు' అయిన శ్రీ ఇ.ఎం.ఎస్. నంబూద్రిపాద్ ను కమ్యూనిస్టు శాసన సభ్యులను నేడు ఉదయం విడుదల చేశారు.

ప్రత్యర్థి వర్గం కాంగ్రెసు శాసన సభ్యుల నాయకుడు శ్రీ కె.ఎం. జార్జి నేడు అసెంబ్లీలో ఒక ప్రకటన చేస్తూ స్వర్గీయ శ్రీ చాకోకు జోహారులర్పించడానికి సభ్యులకు అవకాశం ఇవ్వక పోవడం శోచనీయం అని పేర్కొన్నారు.

[ఆంధ్ర జ్యోతి - సెప్టెంబర్ 4-1964]

'ఫిబ్రవరి' వరకు కేరళలో
రాష్ట్రపతి పాలన
కేంద్ర మంత్రివర్గం అత్యవసర
సమావేశంలో నిర్ణయం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10

శంకర్ మంత్రివర్గం పతనం ఫలితంగా కేరళ రాష్ట్రంలో ఏర్పడిన పరిస్థితిపై రాష్ట్ర 'గవర్నర్' యొక్క నివేదికను కేంద్ర మంత్రివర్గం నేడిక్కడ అత్యవసర సమావేశంలో పరిశీలించింది.

ఈ సమావేశం ముప్పది నిముషాలు పాటు జరిగింది.

ఆ తర్వాత 'హోం' మంత్రి శ్రీ నందా

రాష్ట్రపతి రాధాకృష్ణన్‌ను కలుసుకొని మంత్రివర్గం అభిప్రాయాన్ని తెలియజేశారు.

కేరళలో రాష్ట్రపతి పాలనను ప్రవేశపెడుతూ నేడు ఒక ప్రకటన జరుగగలదని భావిస్తున్నారు. రాష్ట్రపతి పాలన ఫిబ్రవరిలో జరుగనున్న 'జనరల్' ఎన్నికల వరకు అమలులో వుంటుంది.

ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి కేరళ అసెంబ్లీలోని ప్రతిపక్షాలేవీ ముందుకు రానందువల్ల అక్కడ రాష్ట్రపతి పాలనను ప్రవేశపెట్టడం తప్పదని అధికార వర్గాల వారు అన్నారు.

కేరళ గవర్నరు శ్రీ వి.వి. గిరి నివేదికను తీసికొని ఒక ఉద్యోగి నిన్న సాయంకాలం రాష్ట్రపతి రాధాకృష్ణన్‌ను కలుసుకొని ఎనభై నిముషాలసేపు చర్చలు జరిపారు.

కేరళ పరిపాలనా విషయంలో మార్పును తీసుకొనివచ్చే సమస్యను కూడా కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తున్నది. అడ్మినిస్ట్రేటర్'ను నియమించే విషయంలో పెక్కుమంది 'సీనియర్' ప్రభుత్వాధికారుల యొక్క పేర్లను కూడా పరిశీలిస్తున్నది.

రాష్ట్రపతి రాధాకృష్ణన్ శుక్రవారం రాత్రి 'మాస్కో' వెడుతున్నారు. వారు వెళ్ళేలోగా రాజ్యాంగం 56వ 'ఆర్టికల్' క్రింద

కేరళలో రాష్ట్రపతి పాలనను ప్రవేశపెట్టుడానికి ఒక నిర్ణయాన్ని తీసికొనవచ్చును.

మితవాద కమ్యూనిస్టు పార్టీ, సంయుక్త సోషలిస్టు పార్టీ, ముస్లిం లీగ్‌ల నాయకులు మొన్న సాయంకాలం కేరళ గవర్నర్ శ్రీ వి.వి.గిరిని కలుసుకొని ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేని స్థితిని వెల్లడించారు.

అసెంబ్లీలోని అతివాద కమ్యూనిస్టు నాయకుడు శ్రీ ఇ.యం.యస్. నంబూద్రిపాద్ కూడా నిన్న ఉదయం గవర్నర్‌ను కలుసుకొని ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే స్థితిలో తమ పార్టీ లేదని చెప్పారు.

కేరళ పి.సి.సి. అధ్యక్షుని ప్రకటన

పదిహేను మంది కాంగ్రెసు శాసనసభ్యులపై క్రమశిక్షణా చర్య తీసుకోడానికి పార్టీ సిద్ధాంతాలను, నిబంధనలను అమలులో పెట్టుడానికి కాంగ్రెసు పార్టీ నిర్ణయించింది - అని కేరళ ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీ కె.సి. అబ్రహాం నిన్న తిరువేంద్రంలో ప్రకటించారు.

కాంగ్రెస్ వాదులకు పి.సి.సి. హెచ్చరిక:

కాంగ్రెస్ సంస్థనుంచి క్రమశిక్షణా చర్యవల్ల వెళ్ళిపోయిన శాసనసభ్యుల

సన్మాన సభలకు హాజరు కాకూడదని
కాంగ్రెస్ 'కమిటి' ఉత్తరవు చేసింది.
ఈ ఉత్తరువుకు విరుద్ధంగా హాజరు
అయ్యేన వారిపై క్రమశిక్షణా చర్య తీసికొనబడ
గలదని కూడా తెలియజేసారు.

[ఆంధ్ర జ్యోతి - సెప్టెంబర్ 11, 1964]

నెహ్రూ వైదేశిక విధానం

నెహ్రూను గూర్చి కృష్ణమీనన్ అభిప్రాయాలు

(మాజీ రక్షణమంత్రి శ్రీ కృష్ణమీనన్ 1932నుండి శ్రీ నెహ్రూకు స్నేహితుడు. 'పార్లమెంటేరియన్' గానూ ప్రధానిగానూ నెహ్రూను గూర్చి "ఇన్ఫా" విలేఖరి జరిపిన ఈ ఇంటర్వ్యూలో కృష్ణమీనన్ తన అభిప్రాయాలు చెప్పారు. ఇంటర్వ్యూలో తొలిభాగమిది).

ప్రశ్న: 'పార్లమెంటు' నాయకుడుగా, పార్లమెంట్ సంప్రదాయాల విషయంలో నెహ్రూ చేసిన సేవ ఎలాటిదో చెబుతారా?

సమాధానం: పార్లమెంటులో నెహ్రూకు సమానులు లేరు. ప్రధానిగా ఆయన పార్లమెంటులో ప్రవేశించాడు; ప్రధానిగానే మరణించాడు. దేశాన్ని మూడు జనరల్ 'ఎలెక్షన్ల'లో నడిపాడు. ప్రతి జనరల్ ఎలెక్షనూ దేశానికి ప్రజాస్వామ్య విదాన ఉద్యమమైంది. దీని ద్వారా కోట్లకొలది ప్రజలు ప్రజాస్వామ్యమంటే ఏమిటో తెలుసుకొన్నారు. ప్రజాస్వామ్యంపై విశ్వాసం పొందారు. పార్లమెంటులో విధానం పట్ల నెహ్రూ వల్ల వ్యతిరేక పక్షాలు పొందిన మర్యాద వ్యతిరేక పక్షాలకు మరెక్కడా లభించలేదు. అప్పుడప్పుడాయన పార్లమెంటులో పరిహాసానికి దిగేవాడు కూడా. పార్లమెంటంటే ఆయనకెంతో మర్యాద, గౌరవం ఉండేవి. పార్లమెంటులో ఆయన

చాలా చనవుగా వుండే వారు.

పార్లమెంటు మీద ప్రజలు గౌరవ మర్యాదలు కలిగి ఉండాలని ఆయన కోరిక. పార్లమెంటును సందర్శించడానికి ప్రజలు చాలా మంది వచ్చినప్పుడాయన కెంతో సంతోషం కలిగేది. పార్లమెంటరీ చరిత్రలో ఆయన పండితుడని చెప్పడానికి వీలులేదు.

అవసరమని తనకు తోచినప్పుడు పార్లమెంటు చర్చల్లో ఎప్పుడంటే అప్పుడు జోక్యం కల్పించుకొనే వాడు. ప్రతిపక్షాలకు చాలా మర్యాద ఇచ్చే వాడు. వారి దృక్పథాలకు చోటిచ్చాడు. పండిట్ జీ రూపొందించిన ఈ సంప్రదాయాలు మనం కొనసాగించాలని నా కోరిక.

పార్లమెంటులో చేసే ప్రకటనలూ, ఇచ్చే సమాధానాలూ వీలైనంత చక్కగా, సమగ్రంగా ఉండాలని ఆయన కోరే వాడు. పార్లమెంటులో ఏదో సమాధానం చెప్పడం ఆయనకు ఇష్టపడదు. ఏ విషయంలోనైనా పార్లమెంటు న్యాయమైన చర్చావేదికగా ఉండాలని ఆయన భావించే వాడు. తోటి మంత్రులు ప్రతిపక్షాలకు విషయం తెలియ చేయలేక పోతున్నారని తోచినప్పుడూ, ఏ సమస్యను గుర్చిగానీ తాను చెప్పినంత బాగా ఇతరులు చెప్పలేరనుకొన్నప్పుడూ, తోటి మంత్రులకు వేసిన ప్రశ్నలకు

తానే సమాధానం చెప్పేవాడు. సర్వసామాన్యంగా ప్రధాని చేయవలసిన దానికంటె మించిన పని తన మీద వేసుకొనేవాడు.

ప్రశ్న: ఇతరులు తనంత బాగా నిర్వహించలేరనా అలా చెయ్యడం?

సమాధానం: పార్లమెంటు యొక్క జాతీయ స్వభావాన్ని నిలబెట్టని సమాధానాలు ఆయనకు ఇష్టం కావు. పార్లమెంటుకు సేవ చెయ్యాలనీ, దేశ ప్రజలందరికి పార్లమెంటు మీద గౌరవం, మర్యాద కలిగేలాగ చెయ్యాలనీ ఆయన అభిలాష.

ప్రశ్న: ప్రతిపక్షాల దృక్పథాల ప్రభావానికి ఆయన ఎక్కువ లోనవుతారని కొందరంటారు. అది నిజమేనా?

సమాధానం: ప్రతిపక్షాల విషయంలో ఆయన ఎక్కువ ప్రజ్ఞ చూపేవాడు. అందుచేత ప్రతిపక్షాల దృక్పథాన్ని పరిగణించడమనే విషయంలో ఆయన విశిష్టతను చూపేవాడు. కొంచెం తక్కువగా పదిహేడేండ్ల కాలం ఆయన ప్రధానిగా పని చేశారు. ఇంతకాలం ప్రధానిగా మరెవ్వరూ లేరనుకొంటాను. ఒక్క 'కెనడా' దేశ చరిత్రలో తప్ప.

ప్రశ్న: వైదేశిక విధానంలో ఆయన ప్రవేశపెట్టిన విశిష్టత ఏమిటంటారు?

సమాధానం: సర్వసామాన్యంగా ఆయన

"ఇండియా ముఖ్యం" అనే మాట ఉపయోగిస్తూ ఉండే వారు. ప్రతి ఉపన్యాసంలోను వైదేశిక విషయాలను గురించి మాట్లాడే వారు. అయితే, అది మన ప్రజలకు ఒక రకమైన ప్రయోజన విద్యగా ఉపకరించింది. ప్రజాస్వామ్య దేశ ప్రజలకు ప్రపంచ విషయాలు తెలియక పోతే ప్రజాస్వామ్యమే అంతరించి పోతుంది. అలా జరుగకూడదని ఆయన కోరిక. అందు చేతనే, విదేశ వ్యవహారాలను గురించిన ప్రయోజన విద్య అవసరముంది. ఇది ప్రజాస్వామ్యాన్ని రక్షించడానికి ఉపకరిస్తుంది. అంతర్జాతీయ దృక్పథానికి అనుగుణంగా మనం జీవించడానికి, మానవులందర్నీ సమైక్యం చేయడానికి కూడా ఉపకరిస్తుంది.

[కృష్ణా పత్రిక - జూన్ 27, 1964]

చైనా సామ్రాజ్య వాదంపై లోక్ సభలో ప్రధాని ఖండన: చైనా దండయాత్ర భారత చరిత్రను మార్చిందని హెచ్చరిక

న్యూఢిల్లీ, నవంబరు 8:

"చైనా ప్రభుత్వం పాతకాలపు సామ్రాజ్య వాదాన్ని అనుసరిస్తూ ఆ వాదంలోని దురాక్రమణ, సామ్రాజ్యాభివృద్ధి అనే సిద్ధాంతాలను కొనసాగిస్తూ వున్నది" అని ప్రధాని నెహ్రూ నేడు చైనా దండయాత్రపై తీర్మానాన్ని లోక్ సభలో ప్రతిపాదిస్తూ ప్రకటించారు.

"ఈ రోజున మనం ఒక పెద్ద దండయాత్రను ఎదుర్కొంటున్నాము" అని కూడా అన్నారు.

ప్రధానమంత్రి చైనా దండయాత్రను సామ్రాజ్యవాదుల దండయాత్రలతో పోల్చారు. "ఇది మనకు పెద్ద సవాలు. దానిని మనం ఎదుర్కొంటున్నాం" అని వారు విశదీకరించారు.

సభ్యులు హర్షధ్వానాలు చేస్తూవుండగా శ్రీ నెహ్రూ "భారత ప్రభుత్వం ఫలితాలు ఎట్లావైనా, ఇట్టి దండయాత్రలకు తలవంచదు. ఈ సవాలును అన్ని పరిణామా

లకు సిద్ధపడే మనం ప్రవేస్తున్నాము" అని ఆయన ప్రకటించినప్పుడు సభ్యులు హర్ష ధ్వానాలు చేశారు.

శ్రీ నెహ్రూ ఇంకా ఇట్లా అన్నారు: "ఇది సవాలే కాదు. ఒక మంచి అవకాశం కూడాను. భారత ప్రజలు చైనావారి సవాలు ఎట్లా ఎదుర్కొగలిగింది స్పష్టం చేశారు. ఐకమత్యాన్ని, ఉత్సాహాన్ని ప్రదర్శించారు. ఇట్టి ఐకమత్యం, ఇట్టి ఉత్సాహం మన దేశ చరిత్రను మార్చవచ్చు."

"ఇప్పుడు ఒక్క భారతదేశచరిత్రలోనే గాక, అఖిల 'ఆసియా' చరిత్రలోను, ఆమాటకు వస్తే ప్రపంచ చరిత్రలోను ఒక మార్పు ఆరంభమైంది. మన దేశ చరిత్రలో యిది సంధి కాలం. ఈ యుద్ధం యొక్క ఫలితాల మీద మన భవిష్యత్తంతా ఆధారపడి వుంది.

"ఈ యుద్ధ పరిణామాలు సామాన్యమైనవి కావు. అందువల్ల దీనిని మనం అన్ని దృక్పథాల నుంచి పరిశీలించవలసి వుంది."

"సూయజ్ లోను, యితర చోట్లలోను ఒకటి రెండు దురాక్రమణలు జరిగినా, ఇట్టి దురాక్రమణలు పాతకాలపు విషయాలని మనం విశ్వసించాము.

"కాని ఇప్పుడు చైనా మనదేశం మీద పెద్ద దండయాత్రను ప్రారంభిం

చేసింది."

"ఇది మనకే గాక ప్రపంచానికంతా ఆందోళన కలిగించింది."

"చైనా వారు పరోక్షంగా మెక్‌మాహన్ సరిహద్దును ఆమోదించారు. బర్మాలో ఈ సరిహద్దును బర్మా ప్రభుత్వం ఆమోదించింది. ఇందులోని న్యాయశాస్త్రాంగాలు ఏవైనా ఇది మాత్రం నిర్వివాదం. చైనా వారు ఈ సరిహద్దు యొక్క దక్షిణ ప్రాంతాలకు ఎప్పుడూ రాలేదు. ఒక లాంగ్జు గ్రామం దగ్గరికి రావడం తప్ప, ఆ సరిహద్దు ఈవలకు ఎప్పుడూ రాలేదన్నది నిర్వివాదమైన విషయం. దానిని కాదనలేరు."

"సామ్రాజ్య వాద వ్యతిరేకులమని చెప్పుకొనే చైనా ఇప్పుడు ఆ సామ్రాజ్య వాదాన్నే పరోక్షంగా అనుసరిస్తున్నది. ఇది ఆశ్చర్యం కాదా!"

"నేఫాలో ఇప్పుడు చైనావారు దండెత్తిన ప్రాంతం పదివేలేండ్ల దీర్ఘ చరిత్రలో ఎన్నడూ వారి పాలనలో లేదు. మెక్‌మాహన్ రేఖను వారు అంగీకరించకపోయినా, ఆ రేఖ దాదాపు యాభై ఏళ్ళనుంచీ మన దేశపటాలలో, మన రాజ్యాంగంలో వున్నది. దానినే మనం ఉత్తర సరిహద్దుగా గ్రహించాం. దానిని వారు అంగీకరించకపోయినా మార్చివేయటానికి దండయాత్ర జరిపే హక్కు వారికి వస్తుందా?"

"శ్రీ చౌ ఎన్ లై మన దేశం వచ్చినప్పుడు, అనేక కారణాల వల్ల మెక్ మాహన్ రేఖ అక్రమమైనదని తమ ప్రభుత్వం భావిస్తున్నప్పటికీ బర్మా చైనాల మధ్య ఈ రేఖనే సరిహద్దుగా తాము అంగీకరించి ఉన్నారు కనుక, భారత చైనాల మధ్య కూడా దానినే సరిహద్దుగా అంగీకరించినట్లు నాతో అన్నారు. కాని చైనా వారు ఆ మాట తప్పారు."

"భారత్ టిబెట్టుల మధ్య సర్దుబాటు కావలసిన సరిహద్దు సమస్యలు కొన్ని వున్నా, టిబెట్టును పరిపాలించిన ఏ ప్రభుత్వం కూడా ఇప్పుడు చైనా కోరుతున్నంత భూభాగం తమకు చెందాలని చెప్పలేదు. నేఫాలో దాదాపు మూడింట రెండు వంతుల ప్రాంతం తమదని చైనా వారంటున్నారు. ఇప్పుడు అక్కడ చైనావారి దండయాత్రకు గురి అయిన ప్రాంతం చాలా కాలంగా భారతదేశంలో వుండి, భారతదేశ పరిపాలన క్రింద వున్నది. దానిపై తమకు హక్కు వున్నదని చైనా వారు భావిస్తే, ఆ విషయమై మాట్లాడవలసింది, చర్చించవలసింది, అంతేగాని దండెత్తవలసింది కాదు."

[ఆంధ్ర పత్రిక – నవంబర్ 9, 1962]

సంపాదకీయం:

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు - హిందీ

కేంద్ర ప్రభుత్వమునకు సంబంధించిన అన్ని ఉద్యోగాల పోటీ పరీక్షలలో పాల్గొను అభ్యర్థులు ఇంగ్లీషుతో పాటు హిందీలో గూడ సమాధానాలు వ్రాయవచ్చునని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినది. ఈ నిర్ణయము యెంతమాత్రము సముచితమైనది కాదు. ఇందువలన హిందీ మాతృభాష కాని ప్రాంతాలకు ఎక్కువ నష్టము కలుగుచున్నది. అఖిల భారత ఉద్యోగాలలో ముఖ్యముగా 'అడ్మినిస్ట్రేటివ్', 'పోలీసు సర్వీసు'లలో దక్షిణ రాష్ట్రాలవారు తగినంత నియమింపబడుట లేదను అసంతృప్తి వ్యాపించియున్నది. ఇటువంటి పరిస్థితులలో ప్రస్తుత నిర్ణయము యీ అసంతృప్తిని హెచ్చించగలదు. హిందీని ఇంగ్లీషుతో పాటు అధికారభాషగా ఎన్నుకొనినంత మాత్రాన తత్క్షణమే యీ నిర్ణయము చేయవలసిన అవసరము ఏమియు కనిపించుటలేదు. ఇంకను కొన్ని సంవత్సరాలు ఇంగ్లీషునే అధికార భాషగా వుంచవలెనని చాలమంది అభిప్రాయమై యున్నది. హిందీ మాతృభాష కాని రాష్ట్రాలవారి ఆమోదము లభించనంత వరకు హిందీని ప్రవేశపెట్టకూడదని స్వర్గీయ శ్రీ జవహర్‌లాల్ చెప్పియున్నారు.

ప్రస్తుత నిర్ణయము యిందుకు విరుద్ధముగా
వున్నది. ఇది మిక్కిలి శోచనీయమైన సంగతి.

'యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్
పరీక్షలో కొందరు హిందీలో వ్రాయవచ్చునని
నిర్ణయించుట వలన యెన్నియో అవకతవకలు
జరుగు అవకాశాలు కనిపించుచున్నవి.
మాతృభాష హిందీ అయిన వారు తప్పక
అందులోనే వ్రాయగలరు. అందువలన వారికి
ప్రత్యేక సదుపాయము కలిగి ఎక్కువ
గుణములను సంపాదించు అవకాశము
లభించుచున్నది. ఈ వ్యత్యాసమును తొలగించు
టకు తగిన మార్గాలను నిర్ణయించుట జరుగ
గలదని చెప్పబడినది. కాని యీ వ్యత్యాసమును
దృష్టిలో వుంచుకొనిన ఇంగ్లీషులో వ్రాసిన
వారికి న్యాయము జరగదు. ఇది కేవలము
హిందీ మాతృభాష కాని వారి కళ్ళనొళ్ళుతుడుచు
టకు మాత్రమే చేసిన వాగ్దానము. హిందీ
భాషను దొడ్డిదారి నుండి తీసుకొని వచ్చు
పద్ధతి యిదియని కొందరు భావించినచో
ఆశ్చర్యపడవలసిన పనిలేదు. కేంద్రప్రభుత్వము
యీ విషయములో చాల తొందర పడినది.
ఈ తొందరపాటు మిక్కిలి విచారకరమైనది.

తొందరపాటుతో చేసిన యీ
నిర్ణయము వలన కలుగు నష్టమును తొలగించు
టకు రెండే మార్గములున్నవి. మొదటి మార్గము

హిందీతో పాటు రాజ్యాంగములో పేర్కొనిన భాషలన్నిటిలోను సమాధానాలు వ్రాయుటకు అవకాశాలు కలిగించుట; రెండవ మార్గము వివిధ భాషలు మాట్లాడువారి జనాభా ప్రకారము అఖిల భారత ఉద్యోగాలలో తగిన స్థానాలను కేటాయించుట. ఈ రెండు మార్గాలు గూడ ఆచరణయోగ్యాలుగా కనిపించుటలేదు. అందుచేత హిందీభాషలో సమాధానాలు వ్రాయు అవకాశమును వెంటనే తొలగించి అన్ని ప్రాంతాల వారు ఇంగ్లీషులోనే సమాధానాలు వ్రాయవలెనని నిర్ణయించుట దేశశ్రేయస్సుకు అనుకూలమయిన పద్ధతి. కేంద్ర ప్రభుత్వము ఈ నిర్ణయమును వెంటనే మార్చగలదని ఆశించుచున్నాము. హిందీపట్ల ఇటువంటి దృష్టి శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి వంటి వ్యక్తి ప్రధానమంత్రిగా వున్నప్పుడు జరుగవలసిన పని కాదు; వారి ఆధ్వర్యమున ఇటువంటి నిర్ణయము జరుగుట సముచితము కాదు. అందుచేత తొందరపడి చేసిన యీ నిర్ణయమును తత్‌క్షణమే మార్చుకొనుట జరుగగలదని ఆశించుచున్నాము.

[గోలకొండ పత్రిక, జూలై 11, 1964]

సంపాదకీయం:

శ్రీ చాగ్లా సూచన

విద్యామంత్రిగా శ్రీ ఎం. సి. చాగ్లా మొదట చేసిన పని విద్యాశాఖకు చెందిన పెకుర్లి-'కమిటీ'లను రద్దు చేయడం. విద్యాశాఖ సామర్థ్యానికి సహాయపడకుండా దాని నిర్వహణకు అడ్డపడుతూ వుండినందువల్ల ఆ కమిటీలను ఆయన రద్దు చేశారు. ఇప్పుడు శ్రీ చాగ్లాయే ఒక కొత్త కమిషన్‌ను నియమించబోతున్నట్లు నిన్న లోకసభలో ప్రకటించారు. ఇది విద్యారంగానే కనబడవచ్చు.

అయితే ఈ కమిషను దేశంలోని మొత్తం విద్యా విధానాన్ని సమీక్ష చేయడానికి నియమిస్తున్నట్లు శ్రీ చాగ్లా ప్రకటించారు. విద్యా విషయాలలో నిపుణులైన భారతీయ విదేశీయ ప్రముఖులను ఈ కమిషన్‌లో సభ్యులుగా నియమిస్తారట. అది మరొక ఏడాదికి తన నివేదికను సమర్పిస్తుందట.

మన విద్యా విధానాన్ని సమగ్రంగా సమీక్ష చేయవలసిన అవసరం వుందనడంలో ఎంత మాత్రం సందేహం అక్కరలేదు. మన జాతీయ జీవితంలో విద్యారంగంలోని అవకతవకలు మరొకచోట లేవేమో! విద్యాప్రమాణాలలో, విద్యా ప్రణాళికలలో పాఠ్యాంశాలలో

బోధన భాషలో ఒక రాష్ట్రానికి మరొక
రాష్ట్రానికి వ్యత్యాసముంది. కొన్ని సందర్భాలలో
ఒకే రాష్ట్రంలో ఒక యూనివర్శిటీ పద్ధతులకు
మరొక దాని పద్ధతులకు కూడా సమన్వయం
లేకుండా వుంటున్నది. రాజ్యాంగరీత్యా విద్య
రాష్ట్రాల బాధ్యత కావడమే ఈ అవకతవక
లకు ప్రధాన కారణం.

ఈ అవకతవకలను తొలగించడానికే
విద్యను కేంద్రానికి రాష్ట్రాలకు చెందిన
ఉమ్మడి జాబితాలో చేర్చాలని శ్రీ చాగ్లా
సూచిస్తున్నారు. ఈ విధంగా రాజ్యాంగాన్ని
సవరించాలని ఆయన కోరుతున్నారు.
అయితే, ఇందుకు అన్ని రాష్ట్రాలు
అనుకూలంగా లేవు. మన 'ఫెడరల్' రాజ్యాంగం
ప్రకారం తమకు వచ్చిన అధికారాలలో
ఏ ఒక్క దాన్ని వదులుకొనడం, రాష్ట్రాలకు
ఇష్టంలేదు. ముఖ్యంగా విద్యవంటి ముఖ్యాంగం
రాష్ట్రాల ఆధ్వర్యంలోనే వుండాలని అవి
వాదిస్తున్నాయి. సంకుచిత భాషాభిమానాలు
కూడా ఇందుకు ఒక కారణమై వుండవచ్చు.
విద్యపై కేంద్రానికి కూడా అధికారం
వుంటే, హిందీ ప్రాబల్యానికి అది కారణ
మవుతుందని 'నాన్-హిందీ' రాష్ట్రాలను
ఇంగ్లీషు ఉపయోగాన్ని శాశ్వతం
చేయడానికి కేంద్రం ప్రయత్నిస్తుందని

హిందీ రాష్ట్రాలను, భయపడుతున్నాయి. మొత్తం దేశ శ్రేయస్సుకు, జాతీయ సమైక్యానికి సాధనం కావలసిన విద్యపట్ల రాష్ట్రాలు ఇట్టి సంకుచిత భాషా వైఖరిని ప్రదర్శించడం శోచనీయం.

మన దేశంలో అవిద్యా నిర్మూలనకు చేయవలసిన పని ఇంకా ఎంతో వున్నది. ఇది సాధ్యమైనంత త్వరలో జరగడం అవసరం. విద్యావ్యాప్తితో పాటు, వైజ్ఞానికంగా ఉన్నత ప్రమాణాలను అందుకొనడానికి కూడా ఎంతో కృషి జరగవలసి వుంది. సాంకేతిక విద్య, వైజ్ఞానిక విద్య ఇంకా అభివృద్ధి కావాలి. లేకుంటే మన ఆర్థికాభివృద్ధి కృషి కూడా వెనకపడే ప్రమాదం వుంది.

అయితే, వివిధ రాష్ట్రాలు విద్యాప్రణాళికల ప్రాధాన్యాన్ని పూర్తిగా గుర్తించినట్లు కనబడదు. దేశ సౌభాగ్యానికి ప్రధానమైన విద్యకు హెచ్చు మొత్తాలను కేటాయించి ఖర్చుపెట్టడానికి రాష్ట్రాలు శ్రద్ధ వహించడం లేదు, విద్యా ప్రమాణాలను అభివృద్ధి చేయడంలో గాని, ఉపాధ్యాయుల కొరతను నివారించడంలో గాని, వారి సామర్థ్యాన్ని పెంపొందించడంలో గాని, అవి చేస్తున్న కృషి చాలా తక్కువనే చెప్పాలి.

ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకొనే శ్రీ చాగ్లా

విద్యాపై కేంద్రం అజమాయిషీ వుండడం అవసరమనే అభిప్రాయానికి వచ్చారు. విద్యను ఉమ్మడి జాబితాలో చేర్చడంవల్ల ఉన్నత విద్యా విషయాలలోనే గాక, 'సెకండరీ' 'ప్రైమరీ' విద్యా కార్యక్రమాలలో కూడా రాష్ట్రాలకు ఆదేశాలివ్వడానికి సాధ్యమవుతుంది. ముఖ్యంగా జరుగుతున్న పనిని అజమాయిషీ చేయడానికి, మొత్తం దేశానికి వర్తించగల శాసనాలు చేసి సమన్వయం సాధించడానికి కేంద్రానికి అవకాశం కలుగుతుంది. అన్ని రాష్ట్రాలలోను కాంగ్రెసు ప్రభుత్వాలే అధికారంలో వున్న కాలంలోనే ఇది జరగడం సాధ్యం కాకపోతే ముందు ముందు ఎన్నడైనా ఇతర పక్షాల ప్రభుత్వాలు కూడా అధికారంలోకి రావడం జరిగితే అది సాధ్యమవునా?

'ఆలిండియా ఎడ్యుకేషనల్ సర్వీసు' ఏర్పాటు చేయడానికి అన్ని రాష్ట్రాలు అంగీకరించాయని నిన్న శ్రీ చాగ్లా వెల్లడించారు. జాతీయ సమైక్య సాధన కృషిలో ముందుకు మరొక అడుగు అనదగిన ఈ విజయం అభినందించదగింది. ఇదే విధంగా విద్యా విషయాలను కూడా కేంద్ర రాష్ట్రాల ఉమ్మడి బాధ్యత క్రిందికి తేవడానికి ప్రయత్నించడం అత్యవసరం.

[ఆంధ్ర జ్యోతి - మార్చి 14, 1964]

జనాభా సమస్య
అశోక్ మెహతా హెచ్చరిక

న్యూఢిల్లీ, జూలై-17

మన దేశంలో జనాభా పెరుగుదలను నిరోధించక పోతే "సాంఘిక, రాజకీయ ఉత్పాతాల" నుంచి తప్పించుకునే వీలు వుండదని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు శ్రీ అశోక్ మెహతా నేడు ఇక్కడ తెలియజేశారు.

జనాభా పెరుగుదల 'రేటు'పై మనం యుద్ధం చేసి తీరాలనీ, అన్ని యుద్ధాలలో వలెనే ఈ యుద్ధంలో కూడా అన్నీ మనకు అనుకూలంగా వుండక పోవచ్చుననీ, అయినప్పటికీ జయించాలన్న కోరికతో యుద్ధం చేసి తీరాలని కూడా ఆయన అన్నారు.

ఇక్కడ ఏర్పాటైన కుటుంబనియంత్రణ సమావేశాన్ని ప్రారంభిస్తూ శ్రీ మెహతా ఈ సూచనలు చేశారు. ఒక వంక జనాభా పెరుగుదల అదుపులేకుండా కొనసాగుతూ, వేరొక వంక మరణ సంఖ్య తగ్గుతున్నప్పుడు వరదలు, భూకంపాలు వంటి ఉత్పాతాలు సంభవిస్తాయని ఆయన హెచ్చరిక చేశారు. 1891-1921 మధ్య కాలంలో గడచిన భయంకరమైన సంవత్సరాలు మళ్ళీ రావనుకునే వీలులేదు" అని కూడా శ్రీ మెహతా వివరించారు.

జనాభా పెరుగుదల సమస్య మన

ఇంట్లో ప్రవేశించిన శత్రువులాగ వున్నదనీ, మనం కష్టపడి సాధించిన ఆర్థికాభివృద్ధిని అది దోచుకుపోతున్నదని శ్రీ మెహతా విశదీకరించారు.

కుటుంబ నియంత్రణం పట్ల ప్రజల ఆసక్తిని పెంచటం అవసరమే. అయినా, ఆ కార్యక్రమాన్ని మనం సాధించగల ఫలితాలను బట్టిగాక, మన అవసరాలను దృష్టిలో వుంచుకొని రూపొందించుకోవాలని ఆయన సూచించారు.

కుటుంబాలకు తగు సదుపాయాలు లభింపచేయగలిగితే, జనాభా పెరుగుదలను తేలికగా నిరోధించవచ్చునని అన్నారు. కాని, ప్రస్తుత ఆర్థికాభివృద్ధి స్థాయిలో మనం ఆ పని చేయలేకున్నా జాగ్రత్త పడడం అవసరమనీ ఆయన చెప్పారు.

వైద్య పరీక్షా కేంద్రాల సంఖ్య సంతాన నిరోధక శస్త్రచికిత్స పొందుతున్నవారి సంఖ్య, గర్భ నిరోధక ప్రక్రియలు బాగా పెరిగిన మాట నిజమే. అయినా, జనాభా సమస్యను పరిశీలిస్తే, ప్రస్తుత ఉద్యమం స్వల్పమైనదిగా కనిపిస్తుందన్నారు. మూడవ ప్రణాళికలో కుటుంబ నియంత్రణ కార్యక్రమానికి ఇరవై యేడు కోట్ల రూపాయలు మాత్రమే కేటాయించినా, దానిలో 70%, ఇంకా

ఖర్చు కాలేదని కూడా శ్రీ మెహతా అన్నారు.

కేంద్ర ఆరోగ్య మంత్రి డా. సుశీలా నయ్యర్ అధ్యక్షోపన్యాసం యిస్తూ, కొన్ని ప్రాంతాలలో ఇప్పుడు జనన సంఖ్య తగ్గినట్లు కనిపిస్తుందనీ, అయితే దేశమంతా సంతాన నిరోధక సదుపాయాలు కల్పించడానికి ఎక్కువ కృషి జరుగవలసి ఉన్నదనీ తెల్పారు. జనాభా పెరుగుదలను అదుపులో పెట్టడం దేశ సౌభాగ్యానికి ముఖ్యమని కూడా తెల్పారు.

[ఆంధ్ర పత్రిక జూలై 20, 1964]

సంతాన నిరోధ లక్ష్యసాధనకు ప్రభుత్వ సహాయం

కుటుంబ నియంత్రణా నిపుణుల ఆదేశం

సంవత్సరానికి ఇరవైయైదు లక్షల మందికి సంతాన నిరోధక శస్త్ర చికిత్స చేయాలన్న లక్ష్యాన్ని సాధించడానికి ప్రభుత్వం నూటికి నూరు పాళ్ళు సహాయం చేయాలని ఇక్కడ మూడు రోజులుగా జరుగుతున్న కుటుంబ నియంత్రణా నిపుణుల సమావేశం కోరింది. జనాభా పెరుగుదలను అదుపులో పెట్టడానికి సంతాన నిరోధక సస్త్రచికిత్స జరపడమే రక్షణోపద్ధతి అని ఈ సమావేశం

అభిప్రాయ పడింది.

శస్త్ర చికిత్స ద్వారా, వచ్చే పది సంవత్స రాల కాలంలో నూటికి యాభై పాళ్ళ వరకు జన సంఖ్యను నిరోధించవచ్చునని కుటుంబ నియంత్రణా నిపుణుల యొక్క అభిప్రాయాన్ని ప్రకటించింది.

గర్భ స్రావాలకు సంబంధించిన ప్రస్తుత చట్టాన్ని సవరించే విషయమై కూడా ఈ సమావేశం పరిశీలించింది. ప్రస్తుత పరిస్థితుల్లో జనన సంఖ్యను తగ్గించవలసిన అవసరం దృష్ట్యా ముగ్గురు పిల్లల తర్వాత భార్యగాని, భర్తగాని సంతాన నిరోధక శస్త్ర చికిత్సకు అంగీకరిస్తే గర్భస్రావానికి అడ్డు వుండకూడదని ఈ సమావేశంలో ఎక్కువ మంది అభిప్రాయపడ్డారు.

[విశాలాంధ్ర - జూలై 21, 1964]

సమితిలో చైనాకు సభ్యత్వం
ఇవ్వటానికి మరొకసారి నిరాకరణ
అనుకూలంగా నలభై ఒక్క ఓట్లు
ప్రతికూలంగా ఏభై యేడు ఓట్లు వచ్చాయి

సమితి, అక్టోబరు 22

సమితి సర్వసభ్య సమావేశం కమ్యూనిస్టు చైనాకు ఏ ప్రపంచ సంస్థలలో సభ్యత్వం ఇవ్వరాదని తీర్మానించింది. ఈ తీర్మానానికి అనుకూలంగా ఏభై యేడు ఓట్లు, ప్రతికూలంగా నలభై ఒక్క ఓట్లు వచ్చాయి. సమితి పద్నాలుగేండ్లుగా ప్రతి సంవత్సరం చైనా ప్రాతినిధ్యాన్ని నిరాకరిస్తూ వుంది. నిరుడు ఇలాంటి తీర్మానమే ఏభై యారు ఓట్లతో గెలిచింది. అప్పుడు ప్రతికూలంగా నలభై రెండు ఓట్లు వచ్చాయి. భారత దేశం చైనాకు అనుకూలమే అయినా, పద్నాలుగేండ్లలో ఈసారి మాత్రమే జోక్యం కలిగించుకోలేదు. కాని అనుకూలంగా ఓటు మాత్రం వేసింది. నిరుడు ఓటు ఇస్తూ, చైనా దౌర్జన్య చర్యలను భారత దేశం ఖండించింది. సమితిలో చైనాకు సభ్యత్వం ఉంటే తప్ప, అణ్వస్త్ర ప్రయోగ నిషేధానికి చైనా కూడా సంతకం చేస్తే తప్ప ప్రయోజనం లేదని భారత దేశం చెప్పింది. కనుక సర్వసభ్య సమావేశంలో భారత దేశం చైనాకు

ప్రత్యేకంగా అనుకూలంగా ప్రసంగించలేదు.

చైనా సభ్యత్వానికి నిరుడు కన్న ఈ సంవత్సరము చాలా దేశాలు అనుకూలంగా ఉన్నాయనే చెప్పవచ్చు. సైప్రస్, మలేషియా, టోగో దేశాలు నిరుడు పాల్గొనలేదు. ఈ ఏడు వ్యతిరేకంగా ఓటు చేశాయి. యెమెన్ ఈసారి అనుకూలంగా ఓటు చేసింది. ఎథియోపియా హాజరు కాలేదు. భారత దేశంపై చైనా దురాక్రమణకు పూనుకున్నది. కనుక మలేషియా, సైప్రస్ వ్యతిరేకిస్తున్నాయి. అణ్వాస్త్ర ప్రయోగ నిషేధాన్ని చైనా వ్యతిరేకించడం శాంతి స్థాపనకు భిన్నంగాను, యుద్ధ వాతావరణానికి అనుకూలంగాను వుందని ఈ దేశాలు చైనాను విమర్శించాయి.

భారత దేశంపై చైనా దురాక్రమణకు పూనుకోనలేదనీ, భారత దేశమే చైనాపై దురాక్రమణకు పూనుకొన్నదనీ అల్బేనియా విమర్శించింది. ఓటింగ్ కు ముందు అల్బేనియా విదేశాంగ మంత్రి ప్రసంగిస్తూ "భారత దేశంపై చైనా దండయాత్ర చేసిందని అనటం నిజం కాదు. చైనా సరిహద్దు వివాదాన్ని పరిష్కరించుకోవాలని వాంఛిస్తున్నది. కాని భారత దేశం ముందుకు రావటం లేదు. పైగా సైనిక చర్యకు పూనుకొన్నది.

చైనా శాంతి స్థాపనను ఆశిస్తుంది. కాని భారత దేశం సరిహద్దు వివాదాన్ని పరిష్కరించే చర్చలకు అంగీకరించటం లేదు. త్వరలో ఇరుదేశాలు శాంతియుత సంప్రదింపుల ద్వారా సమస్యను పరిష్కరించుకోగలరని ఆశిస్తున్నాను," అన్నారు.

అల్బేనియా, కంబోడియా ప్రతిపాదనను సమర్థించిన దేశాలు: ఆఫ్ఘనిస్థాన్, అల్బేనియా, అల్జీరియా, బల్గేరియా, బర్మా, బురుండి, బైలోరష్యా, కంబోడియా, సింహళం, క్యూబా జెకొస్లొవేకియా, డెన్మార్క్, ఫిన్లాండ్, ఘనా, గినియా, హంగరీ, భారతదేశం, ఇండొనేషియా, ఇరాక్, లావోస్, మాలి, మంగోలియా, మొరాకో, నేపాల్, నార్వే, పాకిస్తాన్, పోలండ్, రుమేనియా, సోమాలియా, సూడాన్, స్వీడన్, సిరియా, టాంగనైకా, టునీషియా, ఉగాండా, యూక్రేనియా, రష్యా, అరబ్ రిపబ్లిక్, బ్రిటన్, ఎమెన్, యుగోస్లావియా (41).

వ్యతిరేకించిన దేశాలు: అర్జెంటీనా, ఆస్ట్రేలియా, బెల్జియం, బొలీవియా, బ్రెజిల్, కామరూన్, కెనడా, మధ్య ఆఫ్రికా, చాడ్, చిలీ, చైనా, కొలంబియా, బ్రాజావిల్లే (కాంగో) లియోపాల్డ్ విల్లే (కాంగో) కోస్టారికా, సైప్రస్, దహోమి.

డొమినికన్ రిపబ్లిక్, ఈక్వెడార్, ఎల్ సాల్వడార్, ఫ్రాన్స్, గాబన్, గ్రీస్, గ్వాటిమాలా, హైటీ, హాండూరాస్, ఇరాన్, ఐర్లండ్, ఇటలీ, ఐవరీ కోస్టు, జమైకా, జపాన్, జోర్డాన్, లైబీరియా, లిబియా, లక్సెంబర్గ్, మడగాస్కర్, మలేషియా, మెక్సికో, న్యూజిలాండ్, నికారాగ్వా, నైగేరియా, పనామా, పరాగ్వే, పెరూ, ఫిలిప్పైన్స్, రువాండా, సెనెగల్, దక్షిణాఫ్రికా, స్పెయిన్, థాయ్‌లాండ్, టోగో, టర్కీ, అమెరికా, అప్పర్ వోల్టా, ఉరుగ్వే, వెనిజులా (57).

పాల్గొనని దేశాలు: ఆస్ట్రియా ఐస్‌లాండ్, ఇజ్రేల్, కువాయత్, లెబనాన్, మారిటేనియా, నెదర్లాండ్స్, నైగీరియా, పోర్చుగల్, సౌదీ అరేబియా, సెరా లియోన్, ట్రినిడాడ్, టొబాగో (12).

ఎథియోపియా అసలు సమావేశాలకు హాజరు కాలేదు.

[ఆంధ్ర ప్రభ - అక్టోబర్ 23, 1963]

"చైనా బెడద ఇంకా తీరలేదు
ప్రధాని శాస్త్రి ప్రకటన

ఢిల్లీ, ఆగస్టు ౨౦

"చైనా వలన భారతదేశానికి ప్రమాదం కలిగే పరిస్థితి ఇంకా అట్లే ఉన్నది" అని ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి నిన్న జాతీయ రక్షణ సంఘ సమావేశంలో వెల్లడించారు.

సమావేశానికి అధ్యక్షత వహిస్తూ, "చైనాతో న్యాయమూ, గౌరవప్రదమైన పరిష్కార సాధనకై భారత ప్రభుత్వం సంప్రతింపులకెప్పుడూ సిద్ధంగానే ఉంటుంది. కాని హింసా ప్రవృత్తిని మాత్రం సహించదు" అని ప్రధాని సభ్యులకు వెల్లడించారు. ఇరుగు పొరుగు దేశాలన్నిటితో స్నేహాన్ని వాంఛిస్తున్నామని పాక్ అధ్యక్షుడు అయూబ్‌తో సంప్రతింపులకు ఎదురు చూస్తున్నామని అన్నారు.

దేశంలో ఆహార పరిస్థితిని, ధరల సమస్యనెదుర్కొనేందుకు ప్రభుత్వం చర్యలను తీసుకొంటున్నదని తెలిపారు.

"శాంతియుతమైన ప్రదర్శనలలో, ఉద్యమాలలో కలగజేసుకోవాలని ప్రభుత్వం వాంఛించడం లేదు. కాని హింసా ప్రవృత్తిని మాత్రం ఎట్టి పరిస్థితులలోనూ ప్రభుత్వం సహించదు" అని

శ్రీ శాస్త్రి గట్టిగా చెప్పారు.

ఏప్రిల్ 11న జరిగిన జాతీయ సంఘ సమావేశం నుండి ఇప్పటి సమావేశం వరకు దేశ పరిస్థితులన్నిటిని ప్రధాని సమీక్షించినారు. "ఈ సంఘానికీ, ప్రజానీకానికీ నాయకుడైన మన జవహర్‌లాల్ నెహ్రూ ఈనాడు మనకు లేడు. ఆయన లేకుండానే ఈ భారం మనం వహించవలసి వచ్చింది. ధైర్యంతో మన కర్తవ్యాన్ని మనం నిర్వహించాలి" అని శ్రీ శాస్త్రి అన్నారు.

తర్వాత భూతల సేనాపతి ముఖ్యుడు (చీఫ్ ఆఫ్ ది ఆర్మీ స్టాఫ్) భారత భూభాగానికి ఎక్కడా ఎట్టి బెడదా కల్గకుండా ఇంతవరకు తీసుకున్న చర్యలను వివరించారు. జమ్మూ కాశ్మీర్ నిరుద్ధరేఖ సమీపంలో పాక్ ఉల్లంఘనల సంఖ్య, ఫిబ్రవరి నుండి వరుసగా పెరుగుతూనే వచ్చాయనీ, కానీ గడచిన నెలలో కన్నా ఈ నెలలో తక్కువగా ఉన్నవనీ తెలిపారు.

సైన్యాలలో కొత్తవారిని చేర్చుకొనే కృషి, పథకం ప్రకారమే తృప్తికరంగా జరుగుతున్నదన్నారు. కొన్ని సాంకేతిక శాఖలలో మాత్రం కొరతలున్నవనీ సైనిక ముఖ్యుడు తెలిపారు.

వైమానిక సైన్య ముఖ్యాధికారి క్రితం సారి జాతీయ రక్షణా సంఘం సమావేశమైనప్పటి నుండి ఇప్పటి వరకు జరిగిన భారత వైమానిక బలాల కృషిని వివరించారు. మొత్తంమీద పరిస్థితులు తృప్తికరంగానే ఉన్నవనీ సైనిక శిక్షణలు సక్రమంగా సాగుతున్నవనీ, కొన్ని సాంకేతిక శాఖలలో తప్ప మనుష్య బలం కూడా తృప్తికరంగానే ఉన్నదనీ తెలిపారు.

[ఆంధ్రప్రభ - ఆగస్టు 21, 1964]

ఆంధ్రులో 'మెడికల్' కాలేజీ సీట్లు
ప్రవేశానికి అత్యధిక విద్యార్థుల ప్రయత్నం

ఆంధ్రులో ఈ సంవత్సరం కూడా మెడికల్ కాలేజీలలో చేరడానికి ప్రయత్నిస్తున్న విద్యార్థుల సంఖ్య అత్యధికంగా వున్నట్లు ఇక్కడ అందిన సమాచారాన్ని బట్టి తెలుస్తోంది.

విద్యార్థులలో పెక్కుమంది మొదట మెడికల్ కోర్సుకు, ఆ తరువాత వెటర్నరీ, అగ్రికల్చర్, ఆ తరువాత మామూలు కాలేజీ కోర్సులకు ప్రాధాన్యత యిస్తున్నారు.

గుంటూరు, విశాఖ, కర్నూలు మెడికల్ కాలేజీలలో ఒక్కొక్క కాలేజీలో నూట యాభై మంది చొప్పున విద్యార్థులను చేర్చుకొంటారు.

తిరుపతిలో వున్న శ్రీ వెంకటేశ్వర మెడికల్ కాలేజీలో వంద మందిని మాత్రమే చేర్చుకొంటారు.

మెడికల్ కాలేజీలలో విద్యార్థులను చేర్చుకొనేందుకు ఆంధ్ర ప్రాంతాన్ని మూడు మండలాలుగా విభజించారు.

శ్రీకాకుళం, విశాఖ, జిల్లాలు కలిసి మొదటి మండలం. ఉభయ గోదావరి జిల్లాలు, కృష్ణా, గుంటూరు జిల్లాలు కలిసి రెండో మండలం, వెంకటేశ్వర

యూనివర్సిటీ ప్రాంతానికి చెందిన జిల్లాలు మూడో మండలం. మొదటి రెండవ మండలాలకు చెందిన కాలేజీల్లో ఒక్కొక్క దానికి వందా యాభై చొప్పున, మూడో మండలంలోని కాలేజీల్లో రెండు వందల యాభై చొప్పున విద్యార్థులను చేర్చుకొంటారు.

మొత్తం ఆంధ్ర ప్రాంతంలో నాలుగు మెడికల్ కాలేజీలలో అయిదు వందల యాభై సీట్లు వున్నాయి.

మొత్తం సీట్లలో 30 శాతం స్త్రీ విద్యార్థులకు కేటాయించారు. 33½ శాతం సీట్లు హయ్యర్ సెకండరీ స్కూళ్ళనుండి వచ్చిన వారికి కేటాయించారు. మరో అయిదు శాతం సీట్లు ఎన్. సి. సి., ఎ. సి. సి. లలోనూ, క్రీడారంగంలోనూ, ఇతర కార్యక్రమాల్లోనూ ప్రాధాన్యత సంపాదించిన వారికి కేటాయించారు. ఈ అయిదు శాతంలో, మూడు శాతం ఎన్. సి. సి. వారికే, మిగిలిన సీట్లను ఇతర రంగాల్లో ప్రజ్ఞ గలవారికీ యిస్తారు.

మెడికల్ కాలేజీలలో విద్యార్థులను 'సెలక్టు' చేయడానికి సెలక్షన్ బోర్డు వుండదు. కేవలం మార్కుల యోగ్యతను బట్టి సీట్లను కేటాయించుతారు.

[విశాలాంధ్ర - జూన్ 19, 1964]

భారత్ కు అమెరికా సహాయం పట్ల
భుట్టో ఆగ్రహం

"భారత దేశానికి భారీ ఎత్తున ఆయుధ సహాయం చేయడానికి అమెరికా ఇటీవల నిర్ణయించుకున్నందువల్ల దేశంలోని పరిస్థితిని పునః పరిశీలన చేయడానికీ, రాజకీయ సైనిక బాధ్యతలను పునః పరిశీలన చేయడానికి సమయం వచ్చింది" అని పాకిస్తాన్ విదేశాంగ మంత్రి భుట్టో యీ రాత్రి పార్లమెంటు లో అన్నారు.

"పాకిస్తాన్ భద్రతకు ప్రమాదం కలిగిస్తూ భారత-పాకిస్తాన్ వివాదాల పరిష్కారాన్ని బలహీన పరచే విధంగా భారత దేశానికి అమెరికా భారీ యెత్తున ఆయుధ సహాయం చేస్తున్నది", అన్నారు.
పార్లమెంటు లో జరిగిన చర్చలకు సమాధానం ఇస్తూ భుట్టో ఇలా అన్నారు.

"ఒక ప్రత్యేక పరిస్థితిలో పాకిస్తాన్ తన మిత్రుల విషయంలో కొన్ని బాధ్యతలనూ, వాగ్దానాలనూ నిలబడింది. కానీ, యిప్పుడా పరిస్థితి మారింది. ప్రస్తుత పరిస్థితి లో బాధ్యతలను పునః పరిశీలన చేయకపోతే ప్రజల పట్ల తమ బాధ్యతను ఉల్లంఘించినట్లవుతుంది"

'మన మిత్రులనూ, మన బాధ్యతలనూ

కొత్తగా కొత్త దృష్టితో పరిశీలన చేయవలసిన సమయం వచ్చింది. సాగుతున్న చర్చలూ, వాదోపవాదాలు అంతం కావాలి" అని భుట్టో అన్నారు. అంటే ప్రభుత్వ విధానంలో తీవ్రమైన మార్పు వుంటుందని కాదు, మనం మన బాధ్యత గుర్తించకుండా ప్రవర్తించలేము. మన ప్రజల పట్ల, మన మిత్రుల పట్ల మనకు బాధ్యత వుంది" అని ఆయన వెంటనే అన్నారు.

పదేళ్ళ క్రితం పాకిస్తాన్‌కు అమెరికా సహాయం ఇచ్చినపుడు భారత దేశం సర్దుబాటు చేసుకొన్న విధంగానే, భారత దేశానికి అమెరికా ఇస్తున్న సహాయానికి పాకిస్తాన్ సర్దుబాటు చేసుకుంటుందని అన్న ఒక అమెరికా అధికారి ప్రకటనను ప్రస్తావించి "అమెరికాకు ఇపుడే చెపుతున్నాను. ఈ పరిస్థితిలో రాజీపడే సమస్య వుండదు" అని భుట్టో అన్నారు.

భారత పాకిస్తాన్ సంబంధాలను గురించి ముఖ్యంగా కాశ్మీరును గురించి అమెరికా వైఖరి విడ్డూరంగా వుందని భుట్టో అన్నారు, "అమెరికాకున్న ప్రపంచ వ్యాప్త ప్రయోజనాలకూ పాకిస్తాన్ జాతీయ ప్రయోజనాలకూ ఘర్షణ ఏర్పడితే, ఈ రెండు దేశాల మధ్య పొత్తుకు ప్రాతిపదిక వుండదు.

అమెరికా తన మిత్రుల ప్రయోజనాలను రక్షిస్తూ తన ప్రపంచ వ్యాప్త ప్రయోజనాలను

అనుసరించాలి. లేదా పాత్తు చేసుకునే విధానాన్ని విసర్జించాలి" అని భుట్టో అన్నారు.

[విశాలాంధ్ర - జూన్ 24, 1964]

శ్రీ నాగేశ్వర రావు స్వదేశాగమనం

సుప్రసిద్ధ 'సినిమా' నటుడు శ్రీ అక్కినేని నాగేశ్వర రావు అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స, పశ్చిమ జర్మనీ, స్విజ్జర్ లాండ్, డెన్మార్క్, జపాన్, హాంకాంగ్, బాంగ్ కాక్, సింగపూర్ మొదలైన దేశాలలో మూడున్నర నెలలపాటు పర్యటించి ఈ నెల 28 వ తేది రాత్రి మద్రాసుకు తిరిగి వస్తున్నారు.

అమెరికా స్టేట్ డిపార్టుమెంటు వారి ఆహ్వానం మీద నటుడు శ్రీ నాగేశ్వరరావు వెళ్ళారు. అదే విధంగా అనేక దేశాలలోని అసంఖ్యాకమైన సాంస్కృతిక సంస్థల వారు కూడా ఆహ్వానించారు. ప. జర్మనీ, ఫ్రాన్స ప్రభుత్వాలు తమ దేశాలలో 'ఫిలిం' పరిశ్రమ నాటక రంగాలను పరిశీలించేందుకు శ్రీ నాగేశ్వర రావును ఆహ్వానించాయి.

ఈ పర్యటనలో శ్రీ అక్కినేని దాదాపు ముప్పదికి పైగా సుప్రసిద్ధ ఫిలిం 'ప్రొడక్షన్' కేంద్రాలను చూచారు. తన పర్యాటనలో

అనేక నాటక 'స్కూళ్ళ'ను, నాటక కేంద్రాలను సందర్శించారు.

'బ్రాడ్వే', లండన్, పారిస్, టోక్యో నగరాల పర్యటనలో వీరు ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన వారితో నాటకరంగంలో ఆధునిక విధానాలు 'ప్లే ప్రొడక్షన్' మొదలైన వాటిని చర్చించారు.

శ్రీ నాగేశ్వరరావు మార్చి 19న భారత దేశం వదలి అదే రోజు రాత్రి వాషింగ్టన్ చేరి మే 18 వరకు వివిధ రాష్ట్రాలలో పర్యటించారు. తదుపరి లండన్ చేరి అచ్చట ఆరు రోజులు గడిపారు. అక్కడ 'కొడక్ కంపెనీ' వారు ఆహ్వానించారు. తదుపరి నేషనల్ ఆర్టు గ్యాలరీ, బకింగ్ హామ్ పాలెస్, క్వీన్స్ గ్యాలరీ, హైడ్ పార్కు, సెంట్ జేమ్స్ పార్కు, పార్లమెంటు హౌస్, మొదలైన అనేక సుప్రసిద్ధ 'ఆర్టు గ్యాలరీ'లను సందర్శించారు.

మే 24 న పారిస్ చేరి అచ్చట మూడు రోజులు గడిపి, అచ్చట నుండి జెనీవా మీదుగా పశ్చిమ జర్మనీ చేరారు. అచ్చట అయిదు రోజులు వుండి జూన్ 24 న డెన్మార్కు వెళ్ళారు. రెండు రోజులు గడిపి, పోలార్ రూట్ మీదుగా టోక్యో చేరారు.

ఆరు రోజుల జపాన్ పర్యటనలో అనేక ఫిలిం పరిశ్రమ కేంద్రాలను, ఆర్టు గ్యాలరీలను, 'థియేటర్ల'ను శ్రీ నాగేశ్వరరావు

సందర్శించారు. జూన్ 10న హాంకాంగ్, ఆ తరువాత శుక్రవారం బాంగ్‌కాక్ సందర్శించారు. జూన్ 14న సింగపూర్ వచ్చారు. అదేరోజు వారి సతీమణి శ్రీమతి అన్నపూర్ణ వారిని సింగపూర్‌లో కలుసుకొన్నారు. మలేషియాలోని ఆంధ్ర అసోషియేషన్ ఆఫ్ ఫెడరేషన్ ఆఫ్ మలయా అండ్ ఆర్ట్స్ కౌన్సిల్, పెనాంగ్ వారి ఆహ్వానం మీద పదిహేను రోజులపాటు వారి సతీమణితో పాటు పర్యటించారు. మలయాలో స్థిరపడిన ఆంధ్రులు అనేక ప్రాంతాలలో శ్రీ అక్కినేనికి, వారి సతీమణికి సన్మానం చేశారు.

వీరు జులై 2న హైదరాబాద్‌కు వస్తున్నారు.

[విశాలాంధ్ర - జూన్ 28, 1964]

నవభారత నిర్మాణంలో సాంకేతిక సిబ్బంది పాత్ర

నవభారత నిర్మాణానికి మిగతా అన్ని వనరుల కంటె ముఖ్యంగా, శిక్షణ పొందిన సిబ్బంది అత్యంత అవసరం. క్రొత్త పరిశ్రమలు నెలకొల్పి నిర్వహించడానికి, విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను, రవాణా సంస్థలను పెంపొందింప చేయడానికి, వ్యవసాయ రంగంలో అధికోత్పత్తి సాధించడానికి, దేశంలో ఉన్న సహజ వనరులను వినియోగంలోకి తీసుకొని రావడానికి, శాస్త్రీయ విజ్ఞానం, సాంకేతిక ప్రజ్ఞ కల స్త్రీ పురుషులు వేలకొలది అవసరం. దేశం యొక్క ఆర్థిక అభివృద్ధి దృష్ట్యా దేశరక్షణ దృష్ట్యా శాస్త్రజ్ఞులు, 'ఇంజనీర్లు', సాంకేతికజ్ఞులు, పనివారికి శిక్షణ ఇచ్చే కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యం ఉన్నది.

1961 లో తయారు చేసిన అంచనాలను బట్టి తృతీయ ప్రణాళికా కాలంలో ప్రతి సంవత్సరం దాదాపు ముప్పై వేల మంది ఇంజనీర్ల సిబ్బంది అవసరం అని తెలుస్తున్నది. వీరు కాక 1966-71 మధ్య కాలంలో చతుర్థ పంచవర్ష ప్రణాళికా కార్యక్రమాలను అమలు పరచేందుకు మరో రెండు లక్షలమంది

ఇంజనీర్లు అవసరం అవుతారు.

తృతీయ ప్రణాళికా కాలంలో ఈ అవసరాలను తీర్చడానికి తగిన శిక్షణా సౌకర్యాలు ఉన్నాయి. ఇప్పుడు దేశంలో నూటికి పైగా ఇంజనీరింగ్ కళాశాలలు, వందా నలభై పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్నాయి. వీనిలో ప్రతిసంవత్సరం మొత్తం నలభైవేలమంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. 1961 తరువాత అనేక క్రొత్త ఇంజనీరింగ్ కళాశాలలు నెలకొల్ప బడ్డాయి. రాబోయే కొద్ది సంవత్సరాలలో ఇటువంటి మరికొన్ని కళాశాలలు నెలకొల్పడం జరుగుతుంది.

ఈ సంస్థలలో మెకానికల్, ఎలెక్ట్రికల్ ఇంజనీరింగ్, గనులకు, లోహ పరిశ్రమలకు సంబంధించిన ఇతర వివిధ సాంకేతిక శాస్త్రాలలోనూ శిక్షణా ఇవ్వడం జరుగుతున్నది.

1961-66 మధ్యకాలంలో అనగా తృతీయ పంచవర్ష ప్రణాళికా కాలంలో దేశంలో వివిధ ఇంజనీరింగ్, వృత్తి, వ్యాపార రంగాలలో దాదాపు ఎనిమిది లక్షల మంది నిపుణులైన పనివారు అవసరం అవుతారని అంచనా వేశారు. ఈ అవసరాలను తీర్చడానికి వీలుగా పూర్వం కంటే ఎక్కువగా అనేక పారిశ్రామిక శిక్షణ కేంద్రాలను నెలకొల్పడం జరిగింది. దీని ఫలితంగా 1956 నాటికంటె సాంకేతిక

సిబ్బంది సంఖ్య ఈనాడు బాగా పెరిగింది. ఇవికాక అధిక సంఖ్యలో యువకులకు సాంకేతిక శిక్షణ సౌకర్యం కల్పించేందుకు పబ్లిక్, ప్రయివేటు రంగాలలో అనేక పారిశ్రామిక సంస్థలలో క్రొత్త పథకాలను ప్రారంభించడం జరిగింది.

జాతీయ పరిశోధనా సంస్థలు, పరిశ్రమలు ఇతర సంస్థలలో పనిచెయ్యడానికి అధిక సంఖ్యలో శాస్త్రజ్ఞులు అవసరం. ఈ అవసరం తీర్చడానికి వీలుగా కళాశాలలు, విశ్వవిద్యా లయాలలో శాస్త్ర పట్టభద్రులకు సౌకర్యాలు పెంపొందింప చేశారు.

1951-'61 మధ్య దేశంలో వ్యవసాయ కళాశాలల సంఖ్య రెట్టింపు అయింది. తృతీయ ప్రణాళికా కాలంలో సుమారు ఇరవై వేల మంది వ్యవసాయ పట్టభద్రులు అవసరం అవుతారని అంచనా. ప్రస్తుతం వున్న ఏభైమూడు వ్యవసాయ కళాశాలలలో దాదాపు నాలుగువేల ఆరువందల విద్యార్థులు చదువుకొంటున్నారు. వీనిలో అనేక కళాశా లలలో వ్యవసాయంలో ఉన్నత విద్యకు సంబంధించిన కోర్సులు నిర్వహించటం జరుగుతోంది. పశువైద్యం, పాడిపరిశ్రమ, అడవుల పెంపకం, మత్స్య పరిశ్రమ, భూసార రక్షణ- వీటికి సంబంధించిన శిక్షణాసంస్థలలో

కూడా ఉన్నత విద్యా సౌకర్యాలను కల్పించడం జరుగుతోంది.

నభై ఆరుకోట్ల ప్రజల కృషి, త్యాగాల మూలంగా నవభారత నిర్మాణం కొనసాగుతున్నది. నవభారత నిర్మాణంలోనూ, స్వాతంత్ర్య రక్షణలోనూ శాస్త్రజ్ఞులు, సాంకేతికజ్ఞులు, యితర సిబ్బందులు ముఖ్యపాత్ర వహించ వలసి వుంటుంది.

[ఆంధ్రజ్యోతి - మే 13, 1964]

లఘు పరిశ్రమలకు ప్రభుత్వ ప్రోత్సాహం

కాకినాడలో గోష్ఠికి ప్రారంభోత్సవంచేస్తూ మంత్రి డాక్టర్ లక్ష్మీనరసయ్య వివరణ.

కాకినాడ, మే 12-

దేశ ఆర్థికాభివృద్ధికి గ్రామీణ పారిశ్రామిక అభివృద్ధి అవసరము అని, అందుకు మధ్యరకం లఘు పరిశ్రమలను ప్రోత్సహించడం రాష్ట్రప్రభుత్వ విధానమని పరిశ్రమల మంత్రి డాక్టర్ ఎం.ఎస్. లక్ష్మీనరసయ్య ఇక్కడ పేర్కొన్నారు.

తూర్పు గోదావరి జిల్లాపరిషత్ పరిశ్రమల స్థాయీ సంఘం ఆధ్వర్యం క్రింద ఏర్పాటు చేయబడిన లఘు పరిశ్రమల గోష్ఠికి మంత్రి డాక్టర్. లక్ష్మీనరసయ్యా తొమ్మిదవ తేదీన

ఇక్కడ ప్రారంభోత్సవం చేశారు. తమ ప్రసంగంలో భారత దేశానికి రాజకీయ స్వాతంత్ర్యం సాధించాము, కాని ఆర్థిక, సాంఘిక, స్వాతంత్ర్యాలు ఇంకా సాధించలేదని ఆయన చెప్పారు. ప్రప్రథమంగా ఇటువంటి గోష్ఠిని ఏర్పాటు చేసిన 'కలెక్టర్' డాక్టర్ రామ్.కె. వేపాను మంత్రి అభినందించారు. జిల్లా కలెక్టర్ చేసిన సూచనలను తాను అంగీకరిస్తున్నానని, వాటిని ఎంతవరకు అమలు చేయవచ్చో చూడవలసిందిగా పరిశ్రమల శాఖ డైరెక్టర్‌ను కోరానని డాక్టర్ లక్ష్మీ నరసయ్యా వివరించారు. దేశం పారిశ్రామికంగా అభివృద్ధి చెందాలని మంత్రి అన్నారు. ఉక్కు 'ఫ్యాక్టరీని విశాఖపట్నంలో నెలకొల్పుతామని కేంద్ర భారీ పరిశ్రమల మంత్రి శ్రీ సి. సుబ్రహ్మణ్యం హామీ ఇచ్చారని డాక్టర్ లక్ష్మీనరసయ్యా తెలిపారు. దేశంలోని పరిశ్రమలను గురించి ప్రస్తావిస్తూ భారీ పరిశ్రమలు లేని పంజాబ్‌లో తలసరి ఆదాయం ఎక్కువగా ఉన్నదని, ఎక్కువ భారీపరిశ్రమలు వున్న బీహార్‌లో తక్కువగా వున్నదని చెప్పారు.

'మార్కెటింగ్' సౌకర్యాల కొరతను గురించి ప్రస్తావించి, స్థానికంగా తయారయిన వస్తువులను కొనవలసిందని డాక్టర్ లక్ష్మీ నరసయ్యా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

పరిశ్రమల అభివృద్ధికి ప్రభుత్వం సాధ్యమయిన సహాయం చేస్తుందని మంత్రి హామీ యిచ్చారు.

ప్రయివేట్ పారిశ్రామికవేత్తలు జిల్లాలలో పరిశ్రమలు నెలకొల్పితే వారికి నీరు, విద్యుచ్ఛక్తి సరఫరా చేస్తామని, స్థలం ఇస్తామని ప్రభుత్వం అందుకు కోటి రూపాయలు కేటాయించిందని డాక్టర్ లక్ష్మీనరసయ్య వివరించారు.

[ఆంధ్రజ్యోతి – మే 13, 1964]

పారిశ్రామిక క్షేత్రాల ప్రాముఖ్యత

మనరాష్ట్రం వ్యవసాయం ప్రధానంగాగల రాష్ట్రం కాబట్టి గ్రామీణప్రాంతాల ఆర్థిక అభివృద్ధికి శ్రద్ధవహించటం ముఖ్యం. ఈ ఉద్దేశ్యంతోనే గ్రామీణ పారిశ్రామిక క్షేత్రాల స్థాపనకై ఒక పథకం రూపొందించబడింది. విద్యుచ్ఛక్తి నీటి సరఫరా వంటి సదుపాయాలు కల్పించి గ్రామాలలో పరిశ్రమలకు అనుకూలమైన వాతావరణం కల్పించేందుకు కృషి జరుగుతున్నది. ప్రభుత్వం వీటిపట్ల అత్యంత శ్రద్ధతో పని చేస్తున్నది. వివిధ పరిశ్రమలకు చెందిన పనులలో శిక్షణను ఇచ్చేనిమిత్తం 'నేషనల్ స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ ట్రెయినింగ్ ఇన్స్టిట్యూట్' నెలకొల్పబడింది. తృతీయ ప్రణాళికా కాలంలో పాత తరహా పారిశ్రామిక క్షేత్రాలు పదీ, ప్రభుత్వ సహాయంతో నెలకొల్పబడినవి పట్నాలుగూ గ్రామీణ క్షేత్రాలు ఐదూ, సహకార క్షేత్రం ఒకటీ ఏర్పాటుచేయడానికి తీర్మానించబడింది. వీటికిగాను రెండుకోట్ల ఇరవైలక్షల రూపాయలు కేటాయించబడినవి.

గ్రామీణ క్షేత్రాలు

గ్రామీణ పారిశ్రామిక క్షేత్రాలలో పెద్ద భవనాలు నిర్మించే అవసరం వుండదు. స్థానికులైన పనివారందరికీ సౌకర్యంగా

ఉండేందుకు పెద్దపెద్ద 'షెడ్డు'లు వేస్తారు. వారికి అందులో అన్ని సదుపాయాలూ వుంటాయి. నిత్యజీవితంలో కావలసిన కొన్ని వస్తువులూ, ఇతర పనిముట్లూ ఈ క్షేత్రాలలో తయారు అవుతాయి.

నిజామాబాదు, మహబూబ్‌నగర్, అనంతపురం కృష్ణా జిల్లాలలో అయిదు గ్రామీణ పారిశ్రామిక క్షేత్రాలు స్థాపించేందుకు ధనం మంజూరయింది. వీటివల్ల గ్రామప్రజలలో పారిశ్రామిక, సాంకేతిక విషయాలపట్ల ఆసక్తి పెరిగే అవకాశం కూడా ఉంది.

పారిశ్రామిక క్షేత్రాల స్థాపనలో సహకార విధానంపై ఆధారపడిన పద్ధతి కూడా యిటీవల రూపొందింపబడింది. ఇటువంటిదానిని ఈ ప్రణాళికా కాలంలో సనత్‌నగర్‌లో ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇదేకాకుండా పటన్‌చెరువు గ్రామంలో ఒకటి, సనత్‌నగర్‌లో మరొకటి 'యాన్సిలరీ' పారిశ్రామిక క్షేత్రాలు ఏర్పాటుచేసేందుకు కూడా అవకాశం కల్పించబడింది. హైదరాబాదులో 'సింథెటిక్' మందుల కర్మాగారం ఒకటి నెలకొల్ప బడుతున్నది. భారీ విద్యుత్ పరికరాలు యంత్ర విభాగాలు తయారుచేసే కర్మాగారం కూడా స్థాపించబడబోతుంది.

ఇటువంటి పారిశ్రామిక క్షేత్రాలను నెలకొల్పటంవల్ల రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి

సులభ సాధ్యం అవుతుంది. పైగా ఇవన్నీ ఒకే చోటకాకుండా రాష్ట్రంలో వివిధ ప్రాంతాలలో ఏర్పాటు కావటం వల్ల అన్ని ప్రాంతాలలోనూ అభివృద్ధి కనబడుతుంది. చిన్నతరహా పరిశ్రమలను సాధ్యం అయినంత ఎక్కువగా స్థాపించే అవకాశం లభిస్తుంది. ఐతే ప్రభుత్వం చేయదలచిన సహాయ విధానాలను గురించీ, సహకార అవకాశాలను గురించీ తగినంత ప్రచారం జరగటం అవసరం. దాని మూలంగా పారిశ్రామిక వేత్తలు అందరికీ, ఉత్సాహమూ ప్రోత్సాహమూ లభించే అవకాశము ఉంటుంది.

[పంచాయత్-జూన్1964]

మహిళలు - పొదుపు

ధరలు విపరీతంగా పెరిగిపోతున్న యీ రోజులలో ప్రతి గృహిణి తమ యింటిఖర్చుకి యిచ్చిన మొత్తంతో నెలాఖరు వరకూ కుటుంబ అవసరాలు కొనడానికి అటుమటులాడిపోతున్నారు. పశ్చిమజర్మనీలో మహిళలు యిటువంటి అవసరాల కోసం అక్కడ లభించే 'కూపన్లు' కొనుక్కొంటూరు.

పశ్చిమ జర్మనీలో యీ కూపన్ల పద్ధతి కడచిన అరవైయారు సంవత్సరాల నుంచీ

అమలులో వున్నది. ఆ దేశంలో నూటికి తొంభైరెండు మంది గృహిణులు కూపన్లను కొంటారు. ఈ కూపన్లు కొన్నవారికి ఆయా షాపులలో కొంత ముదరా లభిస్తుంది. ఇలా లభించే ముదరా లేక 'రిబేటు' మొత్తంతో వారు సెలాఖరు రోజులలో కూడా కుటుంబ అవసరాలు కొనుక్కుంటూరు. పెద్ద వర్తకుల పోటీనుంచి జర్మనిలో కొనుగోలుదార్లను చిన్న దుకాణాలకి ఆకర్షించడం కోసం మధ్యతరగతి చిల్లర దుకాణాదార్లు కలిసి యీ కూపన్ల పద్ధతి ప్రవేశపెట్టారు. మొదటి ప్రపంచయుద్ధం తర్వాత 'రూర్' బొగ్గుగనుల ప్రాంతాలలో కూడా దుకాణాదార్లు ఈ కూపన్ల పద్ధతి ప్రవేశపెట్టారు. ఈ కూపన్లని పుస్తకాల రూపంలో గృహిణులు నెలమొదట కొనుక్కొంటారు. వీటి మీద తిండి సరుకుల దుకాణాలలో రిబేటు దొరుకుతుంది. దుకాణం దగ్గరకు వెళ్ళి కూపన్లు కొనుక్కోవడం కష్టం గనుక దుకాణాదార్లు కలిసి కూపన్ల విక్రయ సహకార సంఘాలుగా ఏర్పడి అమ్మడం మొదలు పెట్టారు. చిల్లర దుకాణాలు ఏవైనా వీటిలో చేరకుండా వుండవచ్చు. ఏ సరకుల మీద కొనుగోలు దార్లకు రిబేటు యివ్వడం అనే విషయం ఆయా దుకాణాలు నిర్ణయించుకోవచ్చుగాని సాధారణంగా అన్ని దుకాణాలు పాగాకు,

పాలు, ఆహార పదార్థాల మీద రిబేటు యిస్తాయి.

1961 లో యిలాంటి సరుకుల కూపన్లు ఏడు కోట్ల ఏభైలక్షల రూపాయల విలువైనవి అమ్మకం అయ్యాయి. వీటిని వసూలు చేసిన ఆయా దుకాణాదార్లు కూపన్ల బేంకుల దగ్గరకెళ్లి తమ డబ్బు వసూలు చేసుకుంటారు. ఈ కూపన్ల మీద వచ్చే ముదరా డబ్బును గృహిణులు నెలాఖరున తమ ఖర్చుకి వినియోగిస్తారు.

[పంచాయత్ - సంపుటి 10, సంచిక 2, జులై 1964]

జనసంఘుం - స్వతంత్రపార్టీల ఎన్నికల పొత్తు
హైదరాబాద్‌లో శ్రీదేవ్‌ప్రసాద్ వివరణ

హైదరాబాద్, మే 7

ఎన్నికల విషయంలో స్వతంత్రపార్టీతో ఒక తరహా ఒప్పందాన్ని తమ పార్టీ కుదుర్చుకున్నదని జనసంఘుం అధ్యక్షులు శ్రీదేవ్ ప్రసాద్ ఘోష్ మొన్న ఇక్కడ తెలిపారు.

రెండుపార్టీల కార్యదర్శులు, శ్రీఉపాధ్యాయ, శ్రీ ఎం. ఆర్. మసానీ ఇటీవల ఎన్నికల సర్దుబాట్లకు సంబంధించిన కార్యక్రమాన్ని రూపొందించినట్లు ఆయన వెల్లడించారు.

మొన్న ఇక్కడ పత్రికల వారితో మాట్లాడుతూ, ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన విషయాలలో స్వతంత్రపార్టీకి, తన పార్టీకి అంగీకారం వున్నదని ఆయన అన్నారు. లోహియా సోషలిస్టు పార్టీతో కూడా ఎక్కువ సంబంధాలు వున్నట్లు ఆయన వివరించారు. డాక్టర్. లోహియా పార్లమెంటుకు ఎన్నిక కావడంలో తమ పార్టీ ప్రధానమైన పాత్రను నిర్వహించినట్లు ఆయన తెలిపారు.

శ్రీ దేవ్ ప్రసాద్ తూర్పు పాకిస్తాన్‌లో 'మైనారిటీ'ల దుస్థితిని గురించి ప్రస్తావించి, వారి పరిస్థితి ఎంతో కష్టంగా వున్నదన్నారు.

అక్కడ నుంచి శరణార్థులుగా వచ్చిన వారికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కలుగ జేయాలని అన్నారు.

లక్ష కొలది ప్రజలు హింసకు, హత్యకు గురి అయ్యారని అన్నారు. దాదాపు ఏడువేల మంది స్త్రీలను అపహరించడం, అవమానపరచడం జరిగి వుంటుందని అంచనా వేశారు. ఎనిమిది వేలమంది హిందువులను బలవంతంగా ఇస్లాం మతంలోకి మార్చారని ఆయన అన్నారు. శరణార్థుల సంఖ్య రోజురోజుకు ఎక్కువ అవుతున్నదని చెప్పారు.

సరిహద్దు సమస్యల గురించి జరిగిన ప్రతిపక్షాల సమావేశం పిదప శ్రీ దేవ్ ప్రసాద్ దేశమంతటా పర్యటిస్తున్నారు. తూర్పు పాకిస్తాన్ లో నేటికి కూడా జరుగుతున్న హింస, హత్యల విషయం దేశప్రజలకు తెలియ జేయడానికి పర్యటిస్తున్నాను అని ఆయన అన్నారు.

ఎన్నికల విషయం ఆయన ప్రస్తావించి ఏదో ఒక విధంగా కాంగ్రెసును అధికారం నుంచి తొలగించాలనే శ్రీ రాజాజీ సిద్ధాంతాన్ని తాము అంగీకరించడం లేదని ఆయన అన్నారు.

ఆంధ్రప్రదేశ్ లో జనసంఘం రోజుకు రోజు బలపడుతున్నదని అన్నారు.

[ఆంధ్రజ్యోతి - మే 8-1964]

అధికార వ్యవహారాలలో హిందీభాష వినియోగం
తగు ఏర్పాట్లు జరపడం యుక్తమని రాష్ట్రాల
ముఖ్యమంత్రుల అంగీకారం.

న్యూఢిల్లీ, మార్చి-12

అధికార వ్యవహారాలకు హిందీభాషను అధికంగా వినియోగించడానికి చర్యలు తీసుకొనడం యుక్తమైన విషయమని నేడిక్కడ జరిగిన సమావేశంలో వివిధరాష్ట్రాల ముఖ్యమంత్రులు అంగీకరించినట్లు తెలుస్తున్నది.

అయితే దేశంలోని జనాభాలో అధిక సంఖ్యాకుల మాతృభాష హిందీ కాని పరిస్థితుల వల్ల కొన్ని సమస్యలు ఎదురవుతాయని, ఆ సమస్యలను తొలగించి, సక్రమంగా పరిపాలన సాగేటట్లు తమకు హామీ ఇవ్వాలని వారు కోరినట్లు తెలుస్తున్నది.

అధికార ప్రయోజనాలకు హిందీ వినియోగం, హిందీభాషలో కేంద్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షల నిర్వహణ మున్నగు అంశాలపై హిందీ, హిందీయేతర భాషలు మాట్లాడే రాష్ట్రాల ముఖ్యమంత్రులు నేటి సమావేశంలో చర్చించారు.

కేంద్ర హోం మంత్రి శ్రీ జి.ఎల్. నందా ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి శ్రీ సి. సుబ్రహ్మణ్యం, శ్రీ ఎం.సి. చాగ్లాతో మరి కొందరు కేంద్రమంత్రులు కూడా

హాజరైనారు.

ఈ సమావేశానికి హాజరైన ముఖ్యమంత్రులలో శ్రీ కె.బి. సాహా (బీహార్) శ్రీప్రతాప్ సింగ్ కైరాన్ (పంజాబు) శ్రీమతి సుచేత కృపలానీ (ఉత్తర ప్రదేశ్) శ్రీ ఎం. భక్తవత్సలం (మద్రాసు) శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి (ఆంధ్ర ప్రదేశ్) శ్రీ డి. పి. మిశ్రా (మధ్య ప్రదేశ్) మున్నగు వారున్నారు.

మైసూరు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల తరఫున ఆ రాష్ట్రాల హోం మంత్రులు హాజరయ్యారు.

అధికార ప్రయోజనాలకు హిందీని ప్రవేశపెట్టే సందర్భంలోనూ, కేంద్ర పబ్లిక్ సర్వీసు కమిషన్ పరీక్షల్ని హిందీలో కూడా నిర్వహించే విషయంలోనూ హిందీయేతర రాష్ట్రాల వారికి "మోడరేషన్" (సరళ వైఖరి) పద్ధతిని ప్రవేశపెట్టాలని ఈ సమావేశంలో కొందరు కోరారు.

హిందీలో అధికార వ్యవహారాల నిర్వహణను ప్రవేశపెట్టడానికి దీర్ఘకాలం తీసుకొనరాదని ఈ సభలో అభిప్రాయపడ్డారు.

అయితే హిందీయేతర ప్రాంతాల నుంచి వచ్చేవారి శ్రేయస్సును దృష్టిలో పెట్టుకోవాలని సూచించబడింది.

హిందీలో సాంకేతిక పదజాలం

సులభంగా అర్థమయ్యేట్టు వుండాలని, కొత్త పదాలను చేర్చడానికి బదులు, బాగా వాడుకలో వున్న వాటినే గ్రహించాలని శ్రీ భక్తవత్సలం సూచించినట్లు తెలుస్తున్నది.

హిందీ భాషా బోధనకు ఎక్కువగా పాఠశాలలు నెలకొల్పాలని మైసూరు, పశ్చిమ బెంగాల్ ప్రతినిధులు సూచించారు.

హిందీ భాషను బోధించే ఉపాధ్యాయులు కూడా చాలమంది కావాలని వీరు అభిప్రాయపడ్డారు.

హిందీ ప్రచారానికై హిందీ భాషేతర రాష్ట్రాలకు ఎక్కువ ధనం కేటాయించాలని మొత్తం మీద అందరూ అంగీకరించారు. హిందీ భాషా ప్రచారానికి ఎక్కువ ధనం కేటాయించవలసిందిగా ప్లానింగ్ కమిషన్‌కు సిఫార్సు చేయాలని నిశ్చయించారు.

పరిపాలనా వ్యవహారాలలో హిందీని ప్రవేశపెట్టే విషయమై మొత్తం పరిస్థితిని తిరిగి సమీక్షించడానికై వచ్చే ఏడాది ఫిబ్రవరిలో తిరిగి ముఖ్యమంత్రులు సమావేశం కాగలరని తెలుస్తున్నది.

హోం మంత్రి శ్రీ నందా ఈ సమావేశానంతరం కొన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులను విడివిడిగా కలుసుకొని పరిపాలనలో అవినీతిని గురించిన కేసులు పరిశీలించే

నిమిత్తం "విజిలెన్సు కమిషన్'లు ఏర్పాటు చేయడాన్ని గురించి దీర్ఘ చర్చలు సాగించారు.

రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేసే విజిలెన్స్ కమిషన్స్‌లో ప్రజల విశ్వాసాన్ని గలిగిన ప్రముఖ వ్యక్తులను మాత్రమే నియమించాలని సూచింపబడింది.

విజిలెన్సు కమిషనర్లు తాము పదవీ విరమణ చేసిన తర్వాత మరెక్కడా ఉద్యోగం చేయమని వాగ్దానం చేయడం మంచి సంప్రదాయం కాగలదని కూడా సూచింపబడింది.

[ఆంధ్రజ్యోతి - మార్చి 14 - 1964]

ఎంతటి దుర్దినం

బరువెక్కిన హృదయంతో, వణికే చేతులతో మాటల కోసం వెతుక్కుంటూ నేటి మా సంపాదకీయాన్ని ప్రారంభిస్తున్నాము.

ఉదయం 11 గంటల 13 నిమిషాలకు న్యూఢిల్లీ నుంచి "ప్రెస్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా' విలేఖరి పంపిన వార్త ప్రకారం నేటి ఉదయం 6 గంటల 20 నిమిషాలకు ప్రధాన మంత్రి శ్రీ నెహ్రూకు హఠాత్తుగా ప్రమాదకరమైన జబ్బు చేసిందట. ఆయన పరిస్థితి ఆందోళన కలగజేస్తున్నదని ఆర్థికమంత్రి శ్రీ టి. టి. కృష్ణమాచారి రాజ్యసభ సభ్యులకూ, హోంమంత్రి శ్రీ నందా లోక్ సభ వారికి విషాదకరమైన పై వార్తను అందజేశారట.

వెంటనే నందా, కృష్ణమాచారిగార్లు ఇద్దరూ ప్రధాని ఇంటికి వెళ్ళారట. ప్రెసిడెంట్ రాధాకృష్ణన్ కూడా నెహ్రూ ఇంటి వద్దనే వుండినారట.

ప్రధాని ఇంటివద్ద ఉన్న పత్రికా ప్రతినిధులతో 11-45 గంటలకు శ్రీ నందా మాట్లాడుతూ నెహ్రూ పరిస్థితిలో మార్పేమీ లేదని, ప్రమాదకరంగానే ఉన్నదని పేర్కొన్నారట.

12-45 గంటలకు వెలువడిన అధికార ప్రకటన ప్రకారం ప్రధానమంత్రి పరిస్థితిలో మార్పేమీ లేదు. ఈ విషయం అధికార ప్రకటనలో లేకున్నా, ఉదయం జబ్బు ప్రారంభమైనది మొదలుకొని మేము ఈ మాటలు వ్రాస్తున్న యిప్పటివరకు (సుమారు ఒంటిగంట) ప్రధానికి స్పృహ లేదని నమ్మకంగా తెలుస్తున్నది.

ఇంతవరకు వచ్చిన వార్తలనుబట్టి పాఠకులు మా హృదయావేదనను – మాహృదయావేదనమేమిటి–భారతజాతి హృదయావేదనను గుర్తించగలరు.

గతజనవరి నెలలో, భువనేశ్వర్ మహాసభకుహాజరైన సందర్భంలో హఠాత్తుగా జబ్బుపడిన మనప్రధాని త్వరలో సంపూర్ణారోగ్యంతో తిరిగి తనవిధులను నిర్వహించుకోగలుగుతున్నారని విని ఎంతో ఆనందించాము కదా.

22వతేదీనే కదా శ్రీనెహ్రూ తన ఆరోగ్యం గురించి న్యూఢిల్లీ పత్రికా విలేఖరులగోష్టిలో మహోత్సాహంతో మాట్లాడింది.

"ప్రధానమంత్రి పదవికి సంబంధించి మీవారసులెవ్వరో మీరే ప్రజాస్వామికపద్ధతిలో యిప్పుడే నిర్ణయం చేయరాదా?" అన్న ఒక విలేఖరిప్రశ్నకు సమాధానంగా " నాజీవితకాలం అంత త్వరలో ముగియడంలేదు" అని శ్రీజవహర్‌లాల్ నెహ్రూ అన్నప్పుడు అక్కడ సమావేశమైన రెండువందలమంది, దేశీయ విదేశీయ పత్రికాప్రతినిధులంతా హర్షధ్వానాలు చేశారు.

ఆ హర్షం న్యూఢిల్లీలో ఆనాడాగోష్ఠిలో పాల్గొన్న రెండువందలమంది పత్రికాప్రతినిధులది మాత్రమే కాదు. ఆసేతుహిమాచలంలో వున్న భారతజాతిది ఆ హర్షం; ఆసియా ఖండమంతటిది ఆ హర్షం. మానవత్వాన్ని, ప్రజాస్వామ్యాన్ని గౌరవించే సర్వమానవకోటిది ఆ హర్షం.

కాని, తన జీవితం పట్ల అంతటి విశ్వాసాన్నిప్రకటించిన ఆ ఆశావాది డేరాడూన్ నుంచి తిరిగి రావడంతోటే ఇంత హఠాత్తుగా తిరిగి జబ్బుపడగలరని ఎవరనుకున్నారు?

ఈ వాక్యాలు వ్రాస్తున్నది మధ్యాహ్నం రెండుగంటలకు. ఇప్పటివరకు నెహ్రూ పరిస్థితిలో మార్పు రాలేదు. ఆయనకు

స్పృహ రాలేదు. ఏమో ఎప్పుడో ఏ దుర్వార్త వింటామో (పాపం శమించుగాక!) అని గుండె మాత్రం దడదడలాడుతున్నది.

వారి వారీ; అనుకున్నదంతా జరిగి తీరింది. మధ్యాహ్నం 2-25 గంటలకు — ఇపుడే మా చేతికి అందిన హృదయావేదనకరమైన వార్తనుబట్టి—ప్రధాని నెహ్రూ స్వర్గస్థుడయ్యాడని కేంద్ర మంత్రి శ్రీ సి. సుబ్రహ్మణ్యంగారు లోక్‌సభలో ప్రకటించారట.

ఎంతమాట! ఎంతమాట!! మన ప్రధాని మనకు లేడు. మన జవహరు మనకు లేడు. మన నాయకుడు మనకిక లేడు. ఆ ఆశావాది యిక లేడు. విధి బలీయం. దైవసంకల్పం ఇదే కాబోలు.

ఇంతకంటె ఇపుడు మాకు మాటలు రావడం లేదు. కలం వణుకుతుంది. ఎంతటి దుర్దినం!

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

('ఆంధ్రప్రభ'- మే 28, 1964)

ప్రెసిడెంట్ కెనెడీ దారుణ హత్య

భార్యతో కలసి డలాస్ నగరవీధులలో 'కారు'లో వెడుతుండగా హంతకుని తుపాకి కాల్పులకు గురిఅయి కన్నుమూత.

ఆస్వాల్డ్ అనే యువకునిపై హత్యానేరం ఆరోపణ.

'వైస్-ప్రెసిడెంట్' లిండన్ జాన్సన్ అధ్యక్ష పదవీ బాధ్యతలను స్వీకరించినట్లు వార్త.

డలాస్, నవంబరు 22 –

అమెరికా ప్రెసిడెంట్ కెనెడీ నేడు తుపాకి కాల్పులకు గురిఅయి కన్నుమూశారు.

స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం ఒంటిగంటకు ఆయన శాశ్వతంగా కన్నుమూశారు.

కెనెడీ మరణం కారణంగా అమెరికా ఉపాధ్యక్షుడు లిండన్ జాన్సన్ అధ్యక్ష పదవీ బాధ్యతలను స్వీకరించారు.

లీ హార్వే ఆస్వాల్డ్ అనే 24 సంవత్సరాల యువకుని 'పోలీసు'లు 'అరెస్టు' చేశారు. ఇతను ప్రెసిడెంట్ కెనెడీపై కాల్పులు జరిగిన చోటు ఒక భవనంలో పనిచేస్తున్నాడని పోలీసులు తెలియజేశారు.

ఒక పోలీసు హత్య చేయబడిన తర్వాత ఆస్వాల్డును పోలీసులు అరెస్టు చేశారు.

ఈ హత్యలో ఇతనిని అనుమానంపై అరెస్టు చేయడం జరిగిందని, కాస్ట్రో అనుకూలవర్గమైన "ఫెయిర్‌ప్లేఫర్‌క్యూబాకమిటీ"కి ఇతడు అధ్యక్షుడని పోలీసులు గుర్తించినట్లు నేషనల్ బ్రాడ్‌కాస్టింగ్ కంపెనీ తెలియజేసింది.

రహస్యశాఖకు చెందిన ఒకవ్యక్తి కూడా హత్యచేయ బడినట్లు వచ్చిన వార్తలను వాషింగ్టన్‌లో విదేశాంగశాఖ సహాయకార్యదర్శి 'రాబర్టు వాలస్' ఖండించారు.

పోలీసు హత్యచేయబడిన వార్తను మాత్రం నిజం అని ఆయన అన్నారు.

ఆస్వాల్డ్ నుంచి పోలీసులు ఒక 'పిస్టల్'ను స్వాధీనం చేసుకున్నారు. "మంచిది ఇపుడు అంతా ముగిసింది" అని ఆవ్యక్తి తమతో చెప్పినట్లు పోలీసులు చెప్పారు.

చనిపోయిన పోలీసు జె.డి.టిపేట్ సినిమాహాలు సమీపంలో కాల్చివేయబడ్డాడు. ఆస్వాల్డు అరెస్టుకు ప్రెసిడెంట్ కెనెడీ హత్యకు సంబంధం వుంటుందని డల్లాస్‌లో ప్రజలు అనుకుంటున్నారు.

ప్రెసిడెంట్ కెనెడీ తన భార్యతో కలసి మోటారు కారులో వెడుతుండగా ఈ దారుణహత్య జరిగింది. మూడు తుపాకి గుండ్లు ఆయన తలకు తీవ్రంగా తగిలాయి. వెంటనే కెనెడీని ఆస్పత్రికి తీసుకునిపోయి రక్తం ఎక్కించారు. కాని ఫలితం లేకపోయింది. ఆయన భారత కాలమానం ప్రకారం సరిగా రాత్రి 12-30 గంటలకు కన్నుమూశారు.

అమెరికా నేర పరిశోధన శాఖ అధిపతి ఎడ్గార్ హూవర్ హంతకుడు లేదా హంతకుల కోసం వెతక వలసిందిగా ఉత్తర్వులు జారీ చేశారు. డలాస్ నగరంలో ప్రధాన వాణిజ్య కేంద్రంగుండా కారు వెడుతున్న సందర్భంలో ఈ హత్య జరిగింది. కాల్పులు జరిగిన వెంటనే ప్రెసిడెంట్ కెనెడీ తనతలను వెనుకకు వాల్చివేశారు.

శ్రీమతి కెనెడీ తనభర్త తలను పట్టుకోడానికి యత్నించారు. కెనెడీ దంపతులతోపాటు అదేకారులో వున్న టెక్సాస్ 'గవర్నర్ జాన్ కనల్లీ కూడా తుపాకి గుండ్లవల్ల గాయపడ్డారు. పోలీసులు కెనెడీని సమీపంలో వున్న ఆస్పత్రికి తీసుకుని వెళ్ళారు.

ప్రెసిడెంట్ కెనెడీ వయస్సు 46 సంవత్సరాలు. ఆయన ప్రెసిడెంట్ పదవిలో రెండు సంవత్సరాల పదిమాసాలపాటు వున్నారు.

'పార్క్ ల్యాండ్' ఆస్పత్రికి వెళ్ళి 25 నిమిషాల తర్వాత శ్రీ కెనెడీ శాశ్వతంగా కనుమూశారు.

'నీగ్రో'లకు పౌరహక్కులను ఇచ్చే బిల్లుపై దక్షిణాది రాష్ట్రాలలో వున్న అసంతృప్తిపట్ల ప్రెసిడెంట్ కెనెడీ ఆందోళన చెందారు. రానున్న ప్రెసిడెంట్ ఎన్నికలలో డెమోక్రాటిక్ పార్టీ తరఫున మూడు రోజులపాటు ప్రచారం చేయడానికి ఆయన టెక్సాస్ రాష్ట్రంలో పర్యటిస్తున్నారు. ఈ హత్య జరిగేటప్పటికి ఆయన నగర పర్యటన పూర్తి అయింది.

ప్రెసిడెంట్ కెనెడీ ఆయన సతీమణితో కలసి తాను ఉపన్యసించవలసిన ప్రదేశానికి కారులో వెడుతుండగా ఈ హత్య జరిగింది.

అసలు కాల్పులు ఎలా జరిగినవన్న విషయమై స్పష్టమైన వార్తలు ఏవీ రావడం లేదు. ప్రెసిడెంట్ కారు వాణిజ్యకేంద్రంగుండా వెడుతున్నపుడు మూడు కాల్పులు విన్నానని ఒక వ్యక్తి చెబుతున్నాడు.

ప్రెసిడెంట్ వెనుక మూడవ కారులో వెళ్ళుతున్న ఒక 'సెనేటర్' తన కుడివైపు నుంచి రెండు కాల్పులు వచ్చినవని, మూడవదాన్ని గురించి తాను చెప్పజాలనని అన్నారు.

హంతకుడు ముప్పై ఏళ్ళ శ్వేతజాతీయుడని అభిప్రాయపడుతున్నారు. కెనెడీ హత్య జరిగిన ఒక గంటసేపటికి కెనెడీ కుటుంబం

డల్లాస్ చేరింది. హత్యచేయబడిన అమెరికన్ ప్రెసిడెంట్లలో కెనెడీ నాలుగవ వ్యక్తి.

ప్రెసిడెంట్ కెనెడీని ఆస్పత్రిలో చేర్చిన తర్వాత రహస్య శాఖ ప్రతినిధి మాట్లాడుతూ కెనెడీని అత్యవసరగదిలో వుంచారని గవర్నర్‌ను శస్త్రచికిత్సల గదిలో చేర్చడం జరిగిందని తెలియజేశారు.

వైస్-ప్రెసిడెంట్ లిండన్ జాన్సన్ కూడా స్వల్పంగా గాయపడ్డారని ఒక అనధికార వార్తవల్ల తెలియవచ్చింది. జాన్సన్ తన చేతిని పట్టుకొని ఆస్పత్రినుంచి బయటకు రావడం చూశానని ఒకరు చెప్పారు. కాని తర్వాత ఈవార్తను జాన్సన్ సతీమణి ఖండించారు. విలేకరులు మరికొన్ని ప్రశ్నలు అడుగగా పోలీసులు వారిని నెట్టివేశారు.

టెక్సాస్ గవర్నర్‌కు తలమీద, చేతిమీద గాయాలు తగిలినవని పోలీసులు చెప్పారు.

హంతకుడు 30-30 రివాల్వర్‌ను ఉపయోగించాడని పోలీసులు విశ్వసిస్తున్నారు.

ఆ దారుణ సంఘటనను స్వయంగా చూసినట్లు ఒక మహిళ ఒక రేడియో ఇంటర్వ్యూలో మాట్లాడుతూ కాల్పులు వినబడినప్పుడు కెనెడీ దంపతులు వీధిలో ఒక కుక్క వైపు చూస్తున్నారని చెప్పింది. అప్పుడు మూడుకాల్పులు వినబడినవని కెనెడీ తనసీటులో వెనకకు వాలిపోయారని ఆయన తలను శ్రీమతి కెనెడీ పట్టుకొనిందని ఆ మహిళ చెప్పింది. ఆమె పేరు శ్రీమతి జాన్ హిల్.

గవర్నర్‌కు శస్త్రచికిత్స

ప్రెసిడెంట్ కెనెడీతోపాటు తుపాకి గుండ్లవల్ల గాయపడిన గవర్నర్ కానల్లీకి శస్త్రచికిత్స చేశారు.

గవర్నరు పరిస్థితి ఘరవాలేదని డాక్టర్లు ప్రకటించారు.ఒక భవనం పై అంతస్థునుంచి ప్రెసిడెంట్ పై కాల్పులు జరిగినట్టు తెలుస్తుంది.

ప్రెసిడెంట్ కెనెడీ మృతిచెందిన ఒకగంట తర్వాత ఆయన మృతదేహాన్ని ఆస్పత్రి నుంచి 'అంబులెన్సు'లో బయటకు తీసుకొని వెళ్లారు.

శ్రీమతి కెనెడీ కూడా తన భర్త మృతదేహంతో పాటు ఆ కారులో వెళ్లారు.

డీన్ రస్క్ జపాన్ పర్యటన రద్దు

అమెరికా విదేశాంగ మంత్రి డీన్‌రస్క్ విదేశాంగ శాఖోద్యోగులు జపాన్ వెడుతూ ఈవార్త తెలిసిన వెంటనే తిరిగి స్వదేశం వచ్చారు.

ప్రెసిడెంట్ కెనెడీ సోదరుడు అటార్నీజనరల్ రాబర్ట్ కెనెడీ వాషింగ్టన్‌లో వున్నారు.

ఈ వార్త తెలిసిన ఒకగంట లోపుగా రాబర్ట్ కెనెడీ, అతని సోదరుడు ఎడ్వర్డ్ కెనెడీ (మసాచుసెట్స్ సెనేటర్) డల్లాస్‌కు వెళ్ళడానికి సిద్ధపడ్డారు.

సెనేట్‌కు అధ్యక్షత వహిస్తుండగా ఎడ్వర్డ్ కెనెడీకి ఈ విషాదవార్త చేరింది. ఆయన తన ప్రసంగాన్ని కొనసాగించ లేక సభనుంచి బయటకు వెళ్ళారు.

తలలోను మెడపైన బలమైన గాయాలు తగలడం వల్ల ప్రెసిడెంట్ కెనెడీ మరణించారని వైద్యులు చెప్పారు. గాయపడిన తర్వాత ప్రెసిడెంట్ కెనెడీకి తిరిగి స్పృహరాలేదని వారు తెలియ జేశారు.

హత్య జరిగిన వెంటనే పోలీసులు హత్య జరిగిన

స్థలానికి హుటాహుటిగా వెళ్ళారు.

ఈ హత్య జరిగిన ప్రాంతంలో ప్రజలు ఎక్కువగా లేరు.

ఆస్పత్రి సర్జన్ ప్రకటన

ప్రెసిడెంట్ కెనెడీకి చికిత్స చేసిన ఆస్పత్రి సర్జన్ ఈ విధంగా చెప్పారు.

"ప్రెసిడెంట్‌ను 'ఎమర్జెన్సీ వార్డు'కు తీసికొని వచ్చినపుడు ఆయన పరిస్థితి అత్యంత ఆందోళనకరంగా ఉన్నది. ఆయనకు తలపైన, మెడలోను తీవ్రగాయాలు తగిలినవి.

"వెంటనే శస్త్రచికిత్స విభాగం అధిపతి డాక్టర్ క్లార్క్‌కు, ఆస్పత్రి సిబ్బందికి కబురు చేశాము.

"వారు వెంటనే వచ్చారు కాని, అప్పటికి కెనెడీ పరిస్థితి మరింత ఆందోళన కరంగా మారింది."

ప్రెసిడెంట్ కెనెడీకి మెడక్రింది భాగంలో గట్టిగాయం తగిలినదని డాక్టర్లు చెప్పారు. రెండవ దెబ్బ కెనెడీ తలకు తగిలిందని కూడా చెప్పారు. అయితే ఈ రెండుగాయాలు ఒకే బుల్లెట్ వల్ల తగిలినదీ లేనిదీ చెప్పజాలమని కూడా అన్నారు.

"ఆయన ప్రాణాన్ని రక్షించగలమన్న ఆశ మాకు ఎన్నడూ లేదు" అని డాక్టర్ చెప్పారు.

కెనెడీ మృతిచెందినట్లు క్రైస్తవ మతాధికారులిద్దరు ఆస్పత్రిలో ఎమర్జెన్సీవార్డు నుంచి బయటకు రాగానే వెల్లడించారు.

[ఆంధ్రజ్యోతి - నవంబర్ 24 - 1963]

బర్మానుంచి 1500 మందిభారతీయులతో మొదటి
ఓడరాక

మదరాసు నుంచి ఇతరప్రాంతాలకు వెళ్ళేందుకు తగినఏర్పాటు
శరణార్థులు పడిన బాధలు

మద్రాసు, జులై 23-

నేడు ఉదయం బర్మానుంచి మద్రాసురేవుచేరుకొన్న ఓడ 'మహమ్మదీ' లో 1500 మంది బర్మానుండి వెళ్ళగొట్టబడిన భారతీయులు సముద్రంమీదుగా కొద్ది సామానులతో మద్రాసు చేరుకొన్నారు.

మద్రాసురేవులో వీరికి తలకొక కప్పు టేనీరుఇచ్చాక వీరందరిని ప్రత్యేకంగా బస్సులలో'కార్పొరేషన్'పాఠశాలఆవరణ లోకి చేర్చారు. అక్కడే వీరికి తాత్కాలిక సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

మధుర, రామ్నాడ్ జిల్లాలలో బంధువులున్న తొమ్మిదివందలమందికి ఆయాప్రాంతాలకువెళ్ళడానికి ఒక స్పెషల్'ట్రెయిన్' ఏర్పాటుచేశారు.మద్రాసు పశ్చిమ జిల్లాలకు, కేరళకు వెళ్ళదలచినవారికి ఆయారైళ్ళలో సౌకర్యాలు చూపుతున్నారు.ఇక భారతదేశంలో బంధువులు గాని, స్నేహితులుగాని లేని వారందరిని, నగరానికి ఇరువది మైళ్ళదూరంలో గుమ్మిడిపూండిలో ఒక శిబిరానికి పంపుతున్నారు. వీరి సంఖ్య మూడువందలా తొంబది నాలుగు. వీరిలో వందా నలభై యెనిమిదిమంది శిశువులు కూడా ఉన్నారు. రాష్ట్ర పబ్లిక్ వర్క్సు మంత్రి శ్రీ వి. రామయ్య ఓడ మద్రాసురేవులోనికి రాగానే

ఓడ పైకి వెళ్ళి కుశలప్రశ్నలు వేశారు.

"బర్మా నుంచి వచ్చిన ఈ శరణార్థులు ఆస్తిపాస్తుల్ని బర్మాలోనే వదులుకొని రావలసినందుకు విచారంతో వున్నా, తమ మాతృదేశానికి తిరిగివచ్చినందుకు కొంత సంతోషమే చూపించారు. వారి పునరావాసానికి, వారి పిల్లల చదువులకు సాధ్యమైనంత సహాయం ప్రభుత్వం చేస్తుంది" అని మంత్రి తెలిపారు.

ఈ ఓడలో వచ్చిన వారిలో పురుషులకన్నా స్త్రీల, శిశువుల సంఖ్యే ఎక్కువగా ఉన్నది. బర్మాలో తాము ఉన్న చివరి మూడుసెలలలో తాము పడిన బాధలు, కష్టాలు హృదయావేదనతో వివరించారు.

దుకాణాదారులు చాలమంది బర్మాలో చిన్నచిన్న దుకాణాలు నడుపుకొంటూ బ్రతుకుతూ వుండేవారు. బర్మా ప్రభుత్వపు జాతీయకరణతో హఠాత్తుగా సర్వం వదులుకొని వీథుల్లో పడవలసి వచ్చింది. ఇరుగుపొరుగు బర్మీయులు దయతలచి సహాయం చేసి ఉండకపోతే వీరు బిచ్చమెత్తుకొని బ్రతకవలసి ఉండేదట. భారతదేశంలో తమకు పునరావాసం కల్పించినందుకు రంగూన్‌లోని భారత రాయబారికి, దౌత్యాలయసిబ్బందికి వీరు కృతజ్ఞత తెలిపారు.

మారియమ్మాళ్ కథ

౨౩ సంవత్సరాల వయస్సుగల మారియమ్మాళ్

తన కథ ఇలా చెప్పింది.

"నా చిన్నతనంలోనే రంగూన్ వెళ్ళాను. అక్కడే పెళ్ళి అయింది. ఇద్దరు పిల్లలు కలిగారు. వారి చిన్నతనంలోనే భర్త పోయారు. నా భర్త నడుపుతూన్న కిళ్లీ కొట్టును నడుపుకొంటూ, కుటుంబాన్ని కాపాడుకొంటూ వచ్చాను. జాతీయకరణతో నేను కూడబెట్టినదంతా తీసివేసుకున్నారు. ఏనాటికైనా భారతదేశానికి తిరిగివెళ్ళి పిల్లలకు అక్కడ చదువు చెప్పించుకొని ఆప్రభుత్వ సహాయంతో బ్రతుకగలనన్న ఆశ ఒక్కటే నన్ను నిలబెట్టింది. నాతో ఏభైరూపాయలు మాత్రమే తెచ్చుకొనేందుకు అనుమతి ఇచ్చారు. నా సామాన్లు ఇతర వస్తువులు ఏవీ కూడా వెంట తెచ్చుకోనీయలేదు."

బర్మా నుండి వచ్చిన వారిలో ఇద్దరు భారతీయులు తాము పెళ్ళిచేసుకొన్న బర్మాస్త్రీలను ఇద్దరినీ కూడా వెంట తీసుకొని వచ్చారు.

ఏడాది సరిగా నిండని శిశువులు దాదాపు ముప్పది మంది ఈ ఓడలో వచ్చారు.

మహమ్మదీయ వర్తకుడొకడు ఒక "కాబిన్"లో ప్రయాణం చేసి వచ్చాడు. తాను బర్మాలో వదిలి వచ్చిన వస్తువుల జాబితాను వెంటతెచ్చుకొన్నాడు. 75 రూపాయలను మెడలో చిన్న బంగారు గొలుసును మాత్రం ఆయన తన వెంట తెచ్చుకోగలిగారు.

వచ్చే నెలలో బర్మానుండి రెండు ఓడలలో భారతీయ శరణార్థులు ఇచటికి రానున్నారు. ఈ ఓడలు

భారతీయ శరణార్థులు ఇచటికి రానున్నారు. ఈ ఓడలు అపుడే ప్రయాణీకులతో నిండిపోయాయి అని రంగూన్‌లోని భారతీయ దౌత్యాలయం ప్రకటించింది.

"ముజఫరీ" నౌక జూలై 28న రంగూన్ నుండి మద్రాసునకు బయలుదేరుతుంది. దానిలో 1474 మంది భారతీయులు వస్తున్నారు. వీరిలో 1176 మందికి ఉచితంగా ఓడ ప్రయాణం అనుమతించారు.

"మహమ్మదీ" నౌక తిరిగి జూలై 30న రంగూన్‌నుండి బయలుదేరి 1537 మంది ప్రయాణీకులతో మద్రాసు వస్తుంది. వీరిలో 1222 మంది ఉచితంగా ప్రయాణం చేయడానికి అనుమతించారు.

"ఇస్లామీ" అనే మరొక నౌక ఆగస్టు 4న బయలుదేరుతుంది. దీనిలో ప్రయాణీకుల బుకింగ్‌లు ఇంకా తెలుపలేదు. ఆగస్టు 8న విశాఖపట్నంరేవుకు బయలుదేరనున్న ముజఫర్ నౌక ప్రయాణానికి ఏడువందలమంది ప్రయాణీకులను ఇపుడే బుక్ చేసివేశారు. ఆగస్టు 10న మద్రాసు బయలుదేరనున్న "ముహమ్మదీ"లో కూడా ప్రయాణీకులకు టికెట్లు ఇస్తున్నారు.

జూలై 1 నుండి జులై 21 వరకు శాశ్వతంగా బర్మా విడిచి స్వదేశం పోదలచిన భారతీయులు 11,283 మందికి భారత దౌత్యాలయం ఎమర్జెన్సీ సర్టిఫికెట్లు మంజూరు చేసినట్లు రంగూన్‌లోని భారతదౌత్యాలయం ప్రకటించింది.

[ఆంధ్రప్రభ - 24 జూలై, 1964]

నవభారత నిర్మాత శ్రీ నెహ్రూ అస్తమయం
12 రోజుల జాతీయ విషాదం
ఢిల్లీకి నాయకుల ఆగమనం

ఢిల్లీ, మే 27–

భారత ప్రధాన మంత్రి శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ నేటి మధ్యాహ్నం 2 గంటలకు అస్తమించినారని తెలియ చేయడానికి విచారిస్తున్నాము.

భారత ప్రధాని శ్రీ నెహ్రూ అంతిమయాత్ర రేపు మధ్యాహ్నం ఒంటిగంటకు ప్రారంభం అవుతుంది.

ఈ శతాబ్దపు భారత మహానాయకుడు, రాజ్యాంగవేత్త, నవభారత నిర్మాత యొక్క తుదిదర్శనం కోసం రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, మంత్రివర్గ సభ్యులు శ్రీ నెహ్రూ నివాసానికి హుటాహుటిగా వెళ్లారు. గత జనవరిలో శ్రీ నెహ్రూ ఒకసారి జబ్బుపడ్డారు. తిరిగి ఈరోజు ఉదయం అకస్మాత్తుగా జబ్బుపడ్డారు. వైద్యులు ఎనిమిదిగంటలపాటు శ్రీ నెహ్రూకు స్పృహ కలిగించడానికి విశ్వప్రయత్నం చేశారు. కాని ప్రయోజనం లేక పోయింది. రెండు గంటలకు శ్రీ నెహ్రూ కీర్తిశేషులైనారు.

ప్రధాని నెహ్రూ అస్తమయవార్తను ప్రకటించడానికిగాను ఆకాశవాణి తన సంగీతకార్యక్రమాన్ని ఆపివేసింది

రాష్ట్రపతి శ్రీ రాధాకృష్ణన్ ఒక ముఖ్యమైన ప్రకటన చేయనున్నారని ఆకాశవాణి మొదట ప్రకటించింది. మూడు నిమిషాల కాలం నిశ్శబ్దంగా గడచిన తర్వాత ప్రధాని నెహ్రూ

అస్తమయ వార్తను ఆకాశవాణి ప్రకటించింది.

డాక్టర్ రాధాకృష్ణన్ ఈ రోజు రాత్రి ఎనిమిదిన్నర గంటలకు రేడియో ద్వారా ప్రసంగించారు. ఈ ప్రసంగాన్ని ఆకాశవాణి అన్ని కేంద్రాల నుండి ప్రసారం చేశారు.

ప్రధాని నెహ్రూ ఈ రోజు ఉదయం హఠాత్తుగా గుండె జబ్బురాగా స్పృహ తప్పి మధ్యాహ్నం రెండు గంటలకు కీర్తిశేషులయ్యారు.

విషాద పరిస్థితి 12 రోజులు

దేశంలో జాతీయ విషాదకాలం పన్నెండు రోజులు ఉంటుందని దేశీయాంగశాఖ కార్యదర్శి ప్రకటించారు.

ఉదయం పదకొండున్నర గంటలప్పుడు ప్రధాని నెహ్రూకు ప్రాణవాయువును ఎక్కించారు. అప్పుడు వారి పరిస్థితి చాల ప్రమాదకరంగా మారిందని తెలిసింది. చివరకు మధ్యాహ్నం రెండుగంటలప్పుడు నవభారత నిర్మాత నెహ్రూ శాశ్వతంగా కన్నుమూశారు.

నిన్నరాత్రి భోజనం చేసిన తరువాత పడకగది లోనికి వెళ్ళేటప్పుడు ప్రధాని నెహ్రూ పరిస్థితి మామూలుగానే ఉండిందని దేశీయాంగశాఖ కార్యదర్శి చెప్పారు.

అంతిమ యాత్ర

భారత ప్రధాని నెహ్రూ అంత్యక్రియలు రేపు సాయంత్రం, రాజఘాట్‌లోని గాంధీజీ సమాధి ప్రక్కన జరుపుతారు.

రేపు ప్రధాని నెహ్రూ భౌతికదేహాన్ని తీన్‌మూర్తి మార్గం, కింగ్‌జార్జి అవెన్యూ, విజయ్‌చౌక్, రాజ్‌పథ్, ఇండియాగేట్, కర్జన్‌రోడ్, కనాట్ ప్లేస్, బారాఖంభారోడ్డు సికిందర్‌రోడ్, హార్డింజ్ బ్రిడ్జ్, మథురారోడ్డు, ఢిల్లీగేట్, రాజ్‌ఘాట్ గుండా ఊరేగింపు జరుపుతారు.

శ్రీ నెహ్రూ మరణవార్త తెలియగానే ఢిల్లీనగరంలో స్త్రీపురుషులు వేలాదిమంది విచారిస్తూ ప్రధాని నివాసానికి వచ్చారు. వచ్చే జనాన్ని పోలీసులు అదుపులో ఉంచలేక పోతున్నారు.

కీర్తిశేషులైన ప్రధాని నెహ్రూ నివాసంలో మొదటి అంతస్థులో వారి భౌతికదేహాన్ని ఉంచారు. కేంద్రమంత్రులు, రాయబారులు, పార్లమెంటుసభ్యులు పురప్రముఖులు వారివద్ద విషాదహృదయాలతో నిలబడి ఉన్నారు.

ప్రధానిగా త్వరలో శ్రీశాస్త్రి ప్రమాణస్వీకరణ
పార్లమెంటు కాంగ్రెసు పక్ష నాయకుడుగా ఏక
గ్రీవంగా ఎన్నిక
నెహ్రూ స్థానంలో సమిష్టి నాయకత్వం అవసరమైనదని
కామరాజ్ వివరణ.

ఢిల్లీ, జూన్ 2-

కాంగ్రెసు పార్లమెంటరీపార్టీ నాయకుడుగా శ్రీలాల్‌బహదూర్ శాస్త్రి నేడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ప్రధాని నెహ్రూ స్థానంలో నూతనప్రధానిగా శ్రీశాస్త్రి పేరును శ్రీగుల్జారిలాల్ నందా ప్రతిపాదించగా శ్రీమొరార్జీ దేశాయ్ బలపరిచారు. అటుపిమ్మట శ్రీశాస్త్రి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించగానే సభ్యులు పెద్దగా హర్షధ్వానాలు చేశారు.

ఈరోజు ఉదయం నూతననాయకుని ఎన్నుకొనే నిమిత్తం పార్లమెంటు సెంట్రల్‌హాలులో కాంగ్రెసుపార్లమెంటరీ పార్టీ సమావేశం ప్రారంభం అయింది. సమావేశానికి కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీకామరాజు అధ్యక్షతవహించారు. నూతన నాయకుని ఎన్నికవిషయంలో అధికసంఖ్యాకుల అభిప్రాయం శ్రీశాస్త్రిగారికి అనుకూలంగా ఉన్నదని ఈసమావేశానికి హాజరైన పార్లమెంటు ఉభయసభల సభ్యులకు, రాష్ట్రాలముఖ్యమంత్రులకు, కాంగ్రెసుకార్యవర్గ సభ్యులకు శ్రీకామరాజు తెలియజేశారు. దేశపురోభివృద్ధికై అందరూ ఐకమత్యంతో ప్రవర్తించడం అవసరము అన్నారు. "ఈరోజు ఎన్నుకొనేనాయకునికి పార్టీసభ్యులందరూ సంపూర్ణమైన సహకారాన్నియివ్వాలి. మనం మన తగాదాలను మరచి దేశపురోభివృద్ధికి కలసి పనిచేయాలి" అనిశ్రీకామరాజు చెప్పగా సభలో హర్షధ్వానాలుచేశారు.

కామరాజ్ ప్రసంగం

శ్రీ కామరాజు తమిళభాషలో మాట్లాడగా ఆ మాటలను శ్రీ సి. సుబ్రహ్మణ్యం ఇంగ్లీషులోనికి అనువదించి చెప్పారు.

శ్రీ నెహ్రూ వారసుని ఎన్నిక ఏకగ్రీవంగా జరగాలని ఈ దేశం ప్రజలు కోరుకొంటున్నారని, కాంగ్రెసువారే కాకుండా ప్రతిపక్షంవారు కూడా అందరూ ఈ సమయంలో ఐకమత్యాన్నే కోరుతున్నారని శ్రీ కామరాజు చెప్పారు. శ్రీ నెహ్రూ వంటి గొప్పవ్యక్తినే తిరిగి నాయకునిగా పొందడం సాధ్యపడేది కాదనీ, అందువల్ల సమష్టి నాయకత్వాన్ని రూపొందించుకొనడం శ్రేయస్కరమని అన్నారు.

అటు పిమ్మట ప్రధాని శ్రీ నందా ముందుకువచ్చి నూతన నాయకుడుగా శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి పేరును ప్రతిపాదించగానే సభ్యులు హర్షధ్వానాలు చేశారు. శ్రీ శాస్త్రి అభ్యర్థిత్వాన్ని శ్రీ మొరార్జీ దేశాయ్ బలపరచగానే హర్షధ్వానాలు మరింత గట్టిగా చాలాసేపు కొనసాగాయి.

ఎన్నిక ప్రకటన

హర్షధ్వానాలు ఆగిన పిమ్మట శ్రీ శాస్త్రి ఏకగ్రీవంగా నూతన నాయకుడుగా ఎన్నికైనట్లు కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ కామరాజు ప్రకటించగానే మరల హర్షధ్వానాలు ప్రారంభమయ్యాయి.

ఈరోజు ఉదయం తొమ్మిది గంటలకు, కాంగ్రెసు పార్లమెంటరీ సమావేశం ప్రారంభం కావడానికి కొంచెం ముందుగా కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీ కామరాజు, కాంగ్రెసు ప్రధాన కార్యదర్శి శ్రీ జి. రాజగోపాలన్‌తో పాటు పార్లమెంటు భవనానికి వచ్చారు. వారికి పార్టీ 'చీఫ్ విప్' శ్రీ సత్యనారాయణ సిన్హా స్వాగతం చెప్పారు.

శ్రీ లాల్ బహాదూర్ శాస్త్రి, శ్రీ జగ్‌జీవన్‌రాంతో పాటు సరిగా తొమ్మిది గంటలకు వచ్చారు.

దాదాపు ౫౦౦ మంది పార్లమెంటు ఉభయసభల సభ్యులు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్న సమావేశంలో శ్రీ శాస్త్రి నూతన నాయకుడుగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించిన తర్వాత తాత్కాలిక ప్రధాని శ్రీ గుల్జారిలాల్ నందా ప్రసంగిస్తూ, కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ కామరాజు "పార్టీలోని ఐకమత్యానికి చిహ్నం"గా ఉన్నారని తెలిపారు.

[ఆంధ్రప్రభ - జూన్ 3, 1964]

సంపాదకీయం:
ఆగస్టు 15 భావాలు

స్వతంత్ర అవతరణోత్సవ దినాన – 1947 ఆగస్టు 15 అర్ధరాత్రి – ఢిల్లీ లాల్ ఖిల్లాపైన జాతీయ పతాకను ఆవిష్కరించినది మన జాతీయ మహానాయకుడు జవహర్‌లాల్ నెహ్రూ, అటు తరువాత పదహారు స్వతంత్ర దినోత్సవాలలో ప్రతిసారీ పతాకను ఆవిష్కరించినది నెహ్రూ. సంపూర్ణ స్వరాజ్యం జాతీయ కాంగ్రెస్ లక్ష్యంగా 1929 లాహోర్ కాంగ్రెస్‌లో చరిత్రాత్మక ప్రకటన చేసింది కూడా అప్పటి కాంగ్రెస్ అధ్యక్షుడు జవహర్‌లాల్; ఈ శతాబ్దంలో పుట్టిపెరిగిన వారికి జవహర్‌లాల్ లేని భారతదేశాన్ని ఊహించుకోవడం కష్టం. కాని విధి బలీయం. దైవ సంకల్పానికి తిరుగు లేదు. ఎంతటి మహాత్ముడైనా మానవుడు మరణాన్ని తప్పించుకోలేడు.

జవహర్‌లాల్ లేని మొట్టమొదటి స్వాతంత్ర్య దినోత్సవము నేడు. ఇది పండుగయా? పర్వదినమా? నెహ్రూ లేని వెలితి ఒకప్రక్క; పదిహేడు సంవత్సరాల స్వాతంత్ర్యం తరువాత

కూడా యిల్లు చక్కబరచుకోలేక లక్ష సమస్యలతో వున్నామనే బాధ యింకొక ప్రక్క; ఈ భావాలతో ఉత్సాహాన్ని తెచ్చుకోవడం కష్టం. ఐతే మరొక సత్యం వుంది. దేశ చరిత్రలో వెలుగునీడలు వస్తూ పోతూ వుంటాయి. ఆధునిక భారత చరిత్రలో ఆగస్టు 15 అనే దినానికి ఒక ప్రత్యేకత వుంది. బ్రిటిష్ వారికి దాస్యం అనే దీర్ఘరాత్రి ముగిసిన దినమది.

స్వాతంత్ర్య అవతరణ దినాన్ని గాంధీజీ దీక్షా దినంగా భావించి, ఉపవాసం చేసి మౌనంగా ప్రార్థన చేసుకున్నారు. ఆ మహనీయుని సంకల్పం ప్రకారం యిది పండుగ దినమా? పర్వదినమా?

సుమారు మూడువేల సంవత్సరాల భారత చరిత్రలో దేశం దాస్యంలో ఉన్నకాలం స్వల్పం. అలెగ్జాండరు కాలం నుండి ఎందరెందరో మన దేశంపై దండయాత్ర జరిపారు. కాని వలస రాజ్యంగా మనరాజ్యాన్ని ఎవరూ పాలించలేదు. గ్రీకులు, శ్వేతహూణులు, శకులు, మంగోలియన్లు- ఎందరెందరో వచ్చినా ఇక్కడే స్థిరపడిపోయి యీదేశాన్ని తమ మాతృభూమిగా చేసుకున్నారు ఒక్క బ్రిటిషు పరిపాలనా కాలంలో మినహా దేశం ఎల్లప్పుడూ స్వతంత్రంగానే వుంది. ఆ సంగతి జ్ఞాపకం చేసుకున్నంత మాత్రాన

ఆగస్టు 15 ప్రాముఖ్యాన్ని తగ్గించినట్టు కాదు.

చరిత్ర పుటల నుండి వర్తమానకాలంలోకి వద్దాము. వర్తమానం అయోమయంగానూ, అస్థిరంగానూ ఉంది. క్రిందటి ఆగస్టు పదిహేనుకీ, నేటికే మధ్య జరిగిన పరిణామాలలో ఒకటి "కామరాజు పథకం." ఈ పేరుతో కొందరు పెద్దలు తమ పదవులను త్యాగం చేయవలసి వచ్చింది. క్రిందటి ఆగస్టు 24న అప్పటి ప్రధానిమైన నెహ్రూ ఒక ప్రకటన ప్రకారం, డజనుమంది నాయకులును పదవులను త్యాగం చేశారు. రెండవ పరిణామం భువనేశ్వర్ కాంగ్రెస్ మహాసభ ప్రకటించిన "ప్రజాస్వామ్య సోషలిజమ్" అనే పాలసీ తీర్మానం. అటు తరువాత జరిగిన అత్యంత విషాద సంఘటన జవహర్‌లాల్ నెహ్రూ మరణం

[ఆంధ్రభూమి - ఆగస్టు 15 - 1964]

నైతిక విలువల పతనమే
అవినీతి ప్రాబల్యానికి హేతువు
ఆంధ్రా యూనివర్సిటీలో ప్రార్థనా మందిరం
ప్రారంభిస్తూ గవర్నర్ ప్రసంగం

విశాఖపట్నం, ఆగస్టు 6-
రాష్ట్ర గవర్నరు శ్రీపట్టం తానుపిళ్లై ఈనెల

3వ, తేదీన ఇక్కడ యూనివర్సిటీ ఆవరణలో 2 లక్షల ఖర్చుతో నిర్మించిన శ్రీ వెంకటేశ్వర ప్రార్థనా మందిరానికి ప్రారంభోత్సవం జరిపారు. మందిర ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి అధ్యక్షత వహించారు.

పట్టం తానుపిళ్ళై ప్రారంభోపన్యాసం చేస్తూ యూనివర్సిటీలు, విద్యాసంస్థలు సోషలిస్టు పద్ధతి సమాజ లక్ష్యాన్ని సాధించడానికి తోడ్పడాలన్నారు. యూనివర్సిటీలలో లభిస్తున్న సదుపాయాలను విద్యార్థులు సంపూర్ణంగా వినియోగించుకోవాలన్నారు.

దేశమంటే మనుషులేనని, దేశపు విలువలకు మనుష్యుల నైతికజీవితమే ప్రాతిపదిక అన్నారు. నిజాయితీ, సత్యదీక్ష ద్వారా విద్యార్థులు దేశానికి ఉత్తమ నాయకత్వాన్ని సమకూర్చాలని గవర్నరు బోధించారు.

దేశమంతటా మహమ్మారిలా వ్యాపిస్తున్న అవినీతిని గూర్చి ప్రస్తావిస్తూ రోజురోజుకు పెరిగిపోతున్న నైతికపతనాన్ని తీవ్రంగా ఖండించారు. సమాజంలో అవినీతిని నిర్మూలించడానికి అన్ని స్థాయిలలోను సదాచార సమితుల స్థాపన జరుగుతున్నదన్నారు.

ముఖ్యమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి అధ్యక్షో

పన్యాసం చేస్తూ మన విద్యాలయాలలో ప్రమాణాలు దిగజారి పోతున్నాయి. కాబట్టి విద్యా ప్రమాణాలను అభివృద్ధి పరచడానికి యూనివర్సిటీ అధికారులు తీవ్రంగా ఆలోచించాలని అన్నారు.

నాలుగవ ప్రణాళికలో మనరాష్ట్రంలో యూనివర్సిటీ స్థాయి విద్యకు, సాంకేతిక శిక్షణకు ప్రాబల్యం వుంటుందని ఆయన తెలిపారు.

ఒక దేశం ఆదేశ ప్రజల నైతిక స్థాయిని బట్టి ఉంటుందన్న స్వర్గీయ నెహ్రూ మాటను పేర్కొంటూ అన్ని కార్యరంగాలలో నైపుణ్యం సంపాదించాలని శ్రీ బ్రహ్మానందరెడ్డి విద్యార్థులకు బోధించారు.

వైస్-చాన్సలర్ శ్రీ ఎ. ఎల్. నారాయణ ముఖ్యమంత్రికి స్వాగతం చెబుతూ వెంకటేశ్వర ప్రార్థనా మందిరాన్ని నిర్మించడానికి తిరుపతి దేవస్థానం రెండులక్షల రూపాయలు ఇచ్చిందని చెప్పారు. హాలుకు శంకు స్థాపన చేసిన శ్రీ బెజవాడ గోపాలరెడ్డి కూడా ఈ ప్రారంభోత్సవానికి హాజరైనారు.

యూనివర్సిటీ 'రిజిస్ట్రారు' శ్రీ ఎం. వి. రాజు గోపాల్ వందన సమర్పణ చేశారు.

[ఆంధ్రభూమి - ఆగస్టు 7, 1964]

క్యూబా నుంచి రష్యన్ 'బాంబర్ల' తొలగింపు: కృశ్చేవ్ సమ్మతి
నౌకాదిగ్బంధనం తొలగిస్తూ అమెరికా ఆదేశం

వాషింగ్‌టన్, నవంబరు 20.

క్యూబా నుంచి సోవియట్ 'జెట్' బాంబర్ల తొలగింపుకు సోవియట్ ప్రధాని శ్రీ నికిటా కృశ్చేవ్ అంగీకరించారని వెళ్ళిపోతున్న విమానాలను పరిశీలించడానికి ఒప్పుకున్నారని అమెరికా అధ్యక్షుడు శ్రీ కెనెడీ నేడు అమెరికన్ ప్రజలకు తెలియజేశారు.

అందువల్ల క్యూబాపై నౌకాదిగ్బంధనాన్ని తొలగించాల్సిందిగా ఈ మధ్యాహ్నమే తాము రక్షణశాఖను ఆదేశించినట్లు శ్రీ కెనెడీ చెప్పారు.

అక్టోబరు 24న ఈ దిగ్బంధనాన్ని అమెరికా విధించింది. విమానాలను పంపివేయగలమని క్యూబా ప్రధాని శ్రీ ఫిడెల్ కాస్ట్రో నేటి ఉదయం ప్రకటించగా రష్యా కూడా అందుకు ఒప్పుకొన్నది.

సోవియట్ దాడి రాకెట్లన్నీ ఉపసంహరింపబడినట్లు తెలిసిందని శ్రీ కెనెడీ తన ప్రకటనలో పేర్కొన్నారు. పైగా ఇకముందు ఇట్టివి తిరిగి అక్కడ వుంచబోమని కూడా రష్యా హామీ ఇచ్చినట్లు వివరించారు.

"ఏమయినా, తనిఖీ అనే ముఖ్య సమస్య అలాగే వున్నది. క్యూబాపై ఆకాశమార్గాన ఈ తనిఖీని

కొనసాగిస్తూనే వుంటాం. అంతర్జాతీయ స్థాయిలో తనిఖీ ఏర్పాట్లు జరిగే వరకు ఇది తప్పదు' అని కెనెడీ తెలిపారు.

క్యూబాలో రష్యన్ బాంబర్లు ముప్పై వరకు వున్నట్లు ఊహిస్తున్నారు.

నౌకాదిగ్బంధనం వెంటనే ఉపసంహరించుకుంటున్నట్లు అమెరికా రక్షణ మంత్రి శ్రీరాబర్ట్ మెక్ నమరా నేటిరాత్రి ప్రకటించారు.

క్యూబా నుంచి సోవియట్ ఆయుధాల ఉపసంహరణను తనిఖీ చేయనివ్వాలన్న పట్టుదలను అమెరికా వదులుకున్నట్లేనని, సముద్రంపై రెడ్‌క్రాస్ తనిఖీ సాగడం కూడా వుండదని ఒకరు చెప్పారు. ఇక క్యూబా కూడ అమెరికా సాగించే తనిఖీ ఆకాశం నుండి విమానాల మూలంగా వుంటుందన్నారు. అంతర్జాతీయ తనిఖీకి కాస్ట్రో ఒప్పుకోలేదు.

[ఆంధ్ర పత్రిక - 1962]

సంపాదకీయం:

శ్రీశాస్త్రి ఎన్నిక

శ్రీలాల్ బహదూర్ శాస్త్రి పార్లమెంటరీ కాంగ్రెస్ పార్టీ నాయకుడుగా — అంటే ప్రధానమంత్రిగా - స్వర్గీయ జవహర్ లాల్ నెహ్రూ స్థానే ఏకగ్రీవంగా ఎన్నికైనారు. నిన్న మొన్నటివరకు పోటీ తప్పదని అనుకున్న

పరిస్థితిలో, నాయకుని ఎన్నిక సాఫీగా జరిగిపోవడానికి కాంగ్రెస్ అధ్యక్షులుగా శ్రీకామరాజు చూపిన ప్రజ్ఞ కారణం. పార్టీలో చెప్పుకోదగినంత బలం ఉండి కూడా, క్రమశిక్షణకు, కాంగ్రెస్ అధిష్ఠానవర్గ నిర్ణయానికి లోబడి తనపోటీ సంకల్పాన్ని ఉపసంహరించుకోవడంలో శ్రీమొరార్జీ ప్రదర్శించిన త్యాగం ప్రశంసింపదగింది. నాయకత్వాన్ని ఆశించిన వారికి ఏమాత్రం బలంలేనందునే ఎన్నిక ఏకగ్రీవంగా జరిగిపోయిందని అనుకోవడం తప్పు.

ఏకగ్రీవ ఎన్నిక అనేది కొన్ని సందర్భాలలో పార్టీలో సంపూర్ణ సమైక్యతకు నిదర్శనం కాదు. ప్రయత్నం తో సాధించిన ఏకగ్రీవ ఎన్నిక కొన్ని సందర్భాలలో సమైక్యతకు గాకుండా అనైక్యతకు కారణం కావచ్చు. అందుకనే ప్రజాస్వామ్య సిద్ధాంతాలపై నడుస్తున్న పార్టీలో ఇలాంటి కృతకమైన ఏకగ్రీవతా ఎన్నిక అనవసరమని, నాయకుని ఎన్నిక పార్లమెంటరీ కాంగ్రెస్ పార్టీ స్వేచ్ఛకు వదలాలని మేము అభిప్రాయ పడ్డాం. ఉత్తమ ప్రజాస్వామ్య సంప్రదాయాన్ని పాటించడమే గాక, పార్టీలో సమైక్యతను పెంపొందించే పద్ధతి కూడా అదేనని ఇప్పటికే మా నమ్మకం. కాంగ్రెస్ అధిష్ఠానవర్గం నాయకుని ఎన్నిక వ్యవహారంలో కల్పించుకుని లాల్‌బహదూర్‌ను అభిమానించడం జరిగింది. పార్టీలో బహు సంఖ్యాకులు లాల్‌బహదూర్‌నే అభిమానించి వుండవచ్చు; కాని వివరాలు బయటు పడనందున, ఆయనకున్న బలంఎంతో తెలియ లేదు.

పోటీనుంచి విరమించినవారి సందేహాలు పూర్తిగా పోలేదు.

అధిష్ఠాన వర్గం అనుసరించిన పద్ధతి ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా వున్నా, లాల్ బహదూర్ పార్టీ నాయకుడుగా ఎన్నికవడం హర్షించతగ్గ విషయం; లాల్ బహదూర్ నలభై ఏళ్ళుగా కాంగ్రెస్‌లో వుంటూ దేశసేవ చేస్తున్న కాంగ్రెస్ అగ్రనాయకులలో ఒకరు. దేశపరిపాలనలో దీర్ఘమైన అనుభవం గలవారు. ప్రతి పనిని సమర్థంగా నిర్వహించి ప్రజ్ఞాశాలి అని అనిపించుకున్న వ్యక్తి శాస్త్రి. అస్సాం భాషా వివాదం, పంజాబ్‌లో మతసమస్య, కేరళ రాజకీయస్థితి, ఇటీవలి కాంగ్రెస్ సంక్షోభం — ఈ మొదలైన వాటిని సంతృప్తికరంగా పరిష్కరించడంలో లాల్ బహదూర్ చూపిన ప్రజ్ఞ ప్రపంచానికి తెలుసు; ఎటువంటి క్లిష్ట సమస్యలనైనా రాజీమార్గాన పరిష్కరింపగల ప్రజ్ఞాశాలి. ఇటువంటి వ్యక్తి ప్రధానమంత్రి అవుతున్నందున ఇంతవరకు పరిష్కరింపబడని అనేక జాతీయ సమస్యలు సరిహద్దుల విషయంలో పాకిస్థాన్, చైనాతోనూ దేశం ఎదుర్కొంటున్న తగాదాలు కొంత బాగుపడి వచ్చునని అనుకోవడంలో తప్పు లేదు.

అయితే లాల్ బహదూర్ ఎంతటి సమర్థుడైనా, నలుగురి సహకారం లేకుండా తానొక్కరే ఈ సమస్యలన్నీ పరిష్కరించలేరు. ఇప్పుడు కావలసింది

ఆ సహకారాన్ని సాగించుకుంటూ, పార్టీలో సమైక్యతను పెంపొందించుకోవడమే. ఇది చాలా మటుకు అధిష్ఠాన వర్గం కృషి పైనా, లాల్ బహాదూర్ ఏర్పాటు చేసే నూతన మంత్రివర్గం మీద ఆధారపడి ఉంటుంది.

[ఆంధ్రపత్రిక - మార్చి 6, 1964]

పాఠకుల లేఖలు:
మరణశిక్ష

ఆర్యా,

మరణ శిక్షను రద్దు చేయాలా, వలదా అన్న సమస్య నేడు కేంద్ర ప్రభుత్వపు పరిశీలనలో వున్నది. ఈ విషయమై ప్రజాభిప్రాయాన్ని సేకరించి తగు సలహా నివ్వ వలసిందిగా న్యాయవిచారణ సంఘాన్ని (లా కమిషన్) కేంద్రం కోరింది. ఈ సమస్య యావద్భారతీయులకు సంబంధించినది.

పూర్వం ఒకరిని హత్య గావించిన యెడల నేరస్థునికి మరణదండన విధించడం, ఒకరికి చేయి విరగగొట్టిన యెడల నేరస్థుని చేతిని ఖండించటం జరుగుచుండెడిది. ఇప్పుడు హత్యానేరాలకు మాత్రం 302 సెక్షన్ క్రింద మరణ దండన విధించబడుతున్నది.

అక్షరాస్యుల సంఖ్యలో మనదేశం కొన్ని ఆఫ్రికా రాజ్యాల కంటె ముందడుగు వేసింది. కాని హత్యలలో కాదు. 1963వ సంవత్సరంలో ఒక్క ఆంధ్రప్రదేశ్ లోనే 861 హత్యలు జరిగినవని వార్త. ప్రతి పదిగంటలకు ఒక హత్య అన్నమాట. ఇవి అధికారుల 'నోటీసు' కు వెళ్ళినవి మాత్రమే. ఇక అధికారుల దృష్టికి పోక, ఆత్మహత్యలుగా 'రిపోర్టు' చేయబడినవి ఎన్నో తెలియదు. ఈ హత్యలకు చాలావరకు

భూమి తగాదాలు, వ్యక్తుల ఆవేశాలు, ప్రేమ కలాపాలు కారణాలు కావచ్చునని అధికార ప్రకటన తెలుపుతున్నది. ఇవి సహజంగా సంభవించేవే. ఆవేశం, పట్టుదలవల్ల సంభవించే హత్యలు కూడా వుంటాయి. నీతులు బోధించడం వల్ల ప్రజలలో మార్పురావడం అరుదు.

మరణ దండన రద్దుచేయడం వల్ల హత్యలు ఎక్కువగా వ్యాపించ వచ్చును.

మరణ దండనకు భారతాధ్యక్షుల పునఃపరిశీలన అవకాశం కల్పించ బడినది. మంచివారు ఎల్లప్పుడూ వారి దయకు పాత్రులు కాగలరనటానికి దృష్టాంతం నానావతి – ఆహుజాల 'కేసు' చాలు. కావున మరణశిక్షను రద్దుచేయడం మంచిదికాదని నా సలహా. మరి కొన్ని నేరాలకు కూడా మరణశిక్షను వర్తింపజేయ వలసిన అవసరం వుంది. ముఖ్యమైనవి:– దేశద్రోహకరమైన గూఢచారి వృత్తులు, బంగారు మొదలగు విలువైన వస్తువులను, చట్ట విరుద్ధంగా దేశంలోకి తీసుక రావడం, ఆహార పదార్థాలను కల్తీ చేసి అమ్మడం.

ప్రభుత్వపు ఆస్తిని దొంగిలించినచో 'సోవియట్' ప్రభుత్వం, మరణదండన విధిస్తుంది. ఉత్పత్తి సాధనాలను ఆటంక పరచినచో బర్మా ప్రభుత్వం మరణ శిక్ష విధిస్తుంది. ఆర్థిక సంబంధమైన నేరాలకు రష్యాలో మరణ దండన వుంది. మన దేశంలో కూడా

ఉరిశిక్ష ఈమూడు నేరాలకు వర్తింప జేయడం అవసరం.

అల్లూరి సుబ్రహ్మణ్యం
(ప్రనకలు)
[ఆంధ్రప్రభ - ఆగస్టు 6, 1964]

పురపాలక సంఘాల అధ్యక్షులను ప్రభుత్వమే తీసివేయ రాదు
సరిగా పనిచేయని వాటి భవిష్యత్తును ప్రజాప్రతినిధులకే వదలాలని శాసన సభ్యుల సూచన
బాడుగకిచ్చిన ఇళ్ళపై రెండురకాలుగా పన్ను విధించరాదు.

(ఆంధ్రప్రభ ప్రతినిధి) హైదరాబాద్, జూన్ 29-
పురపాలక సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులు కార్యవర్గ సంఘాలను రద్దు చేసే హక్కు ఒక్క ప్రభుత్వానికే పరిమితం కారాదని, సరిగా పని చేయని సంస్థల భవిష్యత్తు ప్రజా ప్రతినిధులకే వదిలి వేయాలనీ, కొంతభాగం బాడుగకు ఇచ్చిన గృహాలపై రెండు రకాలుగా పన్ను విధించరాదని రాష్ట్ర పట్టణ పాలక సంఘాల సమగ్ర శాసనంపై శాసన సభలో జరిగిన చర్చ సందర్భంలో పలువురు సభ్యులు సూచించారు.

పురపాలక సంఘాల నూతన చట్టంపై చర్చను ప్రారంభిస్తూ శ్రీ ఎ. సర్వేశ్వరరావు ఈక్రింది విధంగా అన్నారు:- 1920 నుంచీ అమలులో వున్న పురపాలక సంఘాల చట్టం కన్నా, నూతన శాసనంలో ఏలాటి అభివృద్ధి కరమైన సూచనలు లేవు. పాత తెలంగాణా చట్టంలో చాల ప్రయోజనకరమైన అంశాలు వున్నాయి. పై అంశాలు ఏవిగాని ఈ నూతన చట్టంలో లేవు, కాని, వివిధరాష్ట్రాలకు సంబంధించిన చట్టాలలోని అవకతవకలు కొన్ని ఈ నూతన శాసనంలో వున్నాయి.

పట్టణాలలో అక్ట్రాయ్ టాక్సును రద్దుచేయాలని ప్రభుత్వం నిర్ణయించడం చాలహర్షించదగిన విషయమే. కాని స్థానిక సంస్థలపై సర్వాధికారాలు ప్రభుత్వమే వుంచుకోవడం సరికాదు.

పట్టణ సంఘాల అధ్యక్షులను, ఉపాధ్యక్షులను కార్యవర్గ సంఘాలను రద్దుచేసే హక్కు ప్రభుత్వమే వుంచుకొన్నది. ఇటువంటి హక్కులు ఆయా సంస్థలకు సంబంధించిన ప్రజాప్రతినిధులకే వదిలి వేయాలి.

పురపాలకసంస్థల కాలపరిమితి ఐదు ఏండ్ల వరకు పెంచినందున తరచూ అక్రమాలకు పూనుకొంటున్న సంస్థలను రద్దుచేసే హక్కు ప్రజలకు లేకపోయింది.

గృహాలలో కొంతభాగం ఇతరులకు బాడుగకు యిచ్చి వున్నపుడు అటువంటి

గృహాలపై బాడుగలు, పెట్టుబడి విలువ ఆధారంగా పన్ను విధించడం చాల అక్రమం.

ఈ నూతన చట్టం లేత్సా అన్ని హక్కులు కార్యదర్శికి, కార్యవర్గానికి వుంటున్నందున, ప్రజాప్రతినిధులకు ఏలాంటి హక్కులు లేవు. పట్టణపాలన సంఘం సక్రమంగా పని చేయలేనప్పుడు దాని భవిష్యత్తు అక్కడి స్థానికప్రజలకే వదిలి వేయాలని, పెట్టుబడిని బట్టి గృహాలపై పన్ను విధించే పట్ల, గృహయజమానులకు ఎక్కువ నష్టం వుంటుందనీ, అన్నిపాలక సంఘాలకు ప్రభుత్వం ధనసహాయం చేయాలనీ, శ్రీ తెన్నేటి విశ్వనాథం అన్నారు.

పురపాలక సంఘాలను అనవసరంగా పెద్దవి చేస్తున్నారని, దీనివల్ల కమీషనర్లకు అధికారం తప్ప, వేరే లేదనీ, అవిశ్వాస తీర్మానానికి సాధారణ అధిక సంఖ్యాబలం చాలుననీ శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య అన్నారు. స్థానికసంస్థల వ్యవహారాలలో శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులకు ఏలాంటి జోక్యం వుండదని, పాలక సంఘాల పరిమితి ఐదేండ్లకు పెంచడం సరికాదని కూడా శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య అన్నారు.

అవిశ్వాస తీర్మానాలకు 2/3 భాగం సంఖ్యాబలం విధిగా వుండాలని డాక్టర్ టి.వి.ఎస్. చలపతిరావు సూచించారు. అవిశ్వాస తీర్మానాలను ప్రవేశపెట్టవలసిన కాలపరిమితి ఆరుమాసాలనుంచి రెండు సంవత్సరాల వరకు పెంచడం సరికాదని, చాల పట్టణాలలో డ్రైనేజి

సదుపాయాలు సరిగా లేవని డాక్టర్ ఎం. రామగోపాలరెడ్డి అన్నారు.

పురపాలక సంఘాలలో 'వార్డు'ల ఏర్పాటు, పార్టీ రాజకీయాలకు అనుకూలంగా వుంటున్నదనీ, అవిశ్వాస తీర్మానం లేత్తాక అధ్యక్షుని తొలగించినపుడు అతనితో కార్యవర్గ సంఘం కూడా రద్దు కావాలని, శ్రీ పి. రాజగోపాలనాయుడు (స్వ. పా.) సూచించారు.

[ఆంధ్రప్రభ - జూన్, 30, 1964]

సంపాదకీయం:-

ఆగస్టు 15

నేడు ఆగస్టు 15. భారత స్వాతంత్ర్య దినోత్సవం.

దేశం స్వాతంత్ర్యం పొంది పదిహేడు ఏండ్లయింది. ఈ పదిహేడేండ్లలో ఏమి సాధించాము? ఏమి సాధించ వలసి ఉంది?

ఈ ఏడు స్వాతంత్ర్యదినోత్సవ సందర్భంలో స్పష్టంగా కనబడే అంశాలు రెండున్నాయి.

భారత స్వాతంత్ర్యోద్యమ నాయకుడుగా నవభారత నిర్మాతగా, పదహారేండ్లు భారత ప్రధానిగా దేశాన్ని నడిపించిన జవహర్‌లాల్ నెహ్రూ ఇక లేరు. ఇది ఒక తీరని వెలితి.

గత ఏడెనిమిదేండ్లలో ఏనాడూ లేనంత తీవ్రంగా ఆహార సంక్షోభం నేడు ప్రజలను బాధిస్తున్నది.

స్వాతంత్ర్య దినోత్సవం నాడు ప్రజలలో వ్యక్తం కావలసిన ఆనందం, ఉత్సాహం, ఆహార సంక్షోభం వల్ల వ్యక్తం కావడం లేదు.

ఏరోజు తిండిగింజలకు ఆరోజు కుటుంబ సభ్యులలో ఎవరో ఒకరు గంటలకొలది, 'క్యూ' లో నిలబడి, ఒక్కొక్కప్పుడు వట్టి చేతులతో ఇండ్లకు తిరిగి వెళ్తున్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇదేనా మనం సాధించింది అని ప్రజానీకం నిరుత్సాహం

పొందటంలో ఆశ్చర్యం లేదు.

గోదాములలో తిండిగింజలున్నాయి. ప్రజల కళ్ళ ఎదుటనే ఈ ధాన్యం, ఇతర రాష్ట్రాలకు పోతున్నది. చౌక 'డిపో'లలో బియ్యం కనబడవు. ఉన్నా నిర్ణయించిన ధరకు బియ్యం లభించవు.

మంత్రి బలరామిరెడ్డి రహస్యంగా హైద్రాబాద్‌లో ఒక చౌక డిపోకు వెళ్ళగా, వ్యాపారస్తులు హెచ్చుధర వసూలు చేయడం స్వయంగా చూచారు.

ఇంత అన్యాయం జరుగుతున్నా గోదాములలోని ధాన్యాన్ని బైటికి తీయటానికి ప్రభుత్వం పూనుకోవటం లేదు. దక్షిణాది రాష్ట్రాలకు పెద్ద ఎత్తున పోతున్న తిండిగింజల రవాణాను నిషేధించటం లేదు.

ధరల నిర్ణయం పేరుతో మార్కెట్లో అదివరకే ఉన్న ధాన్యానికి అధిక ధరలు ప్రభుత్వం అంగీకరించింది. మార్కెట్ ధరల కంటే ఎక్కువ ధరనే ప్రభుత్వం నిర్ణయించింది.

ఇక 'మిల్లర్ల'కు, ధాన్యం నిల్వదారులకు కావలసిందేముంది? వారి రొట్టె నేతిలో పడ్డది.

ప్రజల బాధలు ప్రభుత్వానికి తెలియడం లేదు. ఎంతసేపటికి, మిల్లర్లను, ధాన్యం నిల్వదారులను తృప్తి పరచాలనే ఆలోచన మినహా ప్రభుత్వానికి మరో దృష్టి లేదు.

పరిమితికి మించిన ధాన్యాన్ని ప్రభుత్వానికి వెల్లడించాలని ప్రభుత్వం తెలియజేసింది. బుద్ధిమంతులైన నిల్వదారులు కొందరు ఆ ఉత్తర్వును పాటించారేమో? అధిక సంఖ్యాకులు ఆ ఉత్తర్వును లెక్క చేయలేదు.

ధాన్యం నిల్వలలో హెచ్చు భాగం 'బ్యాంకు' 'అడ్వాన్సు'ల సహాయంతో జరిగిందే. ఎవరెవరు ఎంతెంత అడ్వాన్సులు గ్రహించారో బ్యాంకులలో లెక్కలుంటాయి. ప్రభుత్వం ఆ సమాచారం తెలుసుకో దలచుకొంటే అది ఒక్క రోజు పని. ఆ నిల్వలను బైటికి తీయించి చౌక డిపోలకు ధాన్యం 'సప్లయి' చేయించ దలచుకొంటే ప్రభుత్వాన్ని కాదనేవారు లేరు.

ఐనా ప్రభుత్వానికి మనసుంటే గదా? నిల్వదారులను భయపెడుతూ ప్రకటనలను చేయటంలో మంత్రులకు గల ఆసక్తి తమ ప్రకటనలను అమలు జరపటంలో ఏమాత్రమూ లేదు.

ప్రభుత్వానికి 'లెవీ' ధాన్యం ఇవ్వకుండా మిల్లర్లు ఊరుకొన్నారు. అందుకుగాను కొందరు మిల్లర్ల మీద ప్రభుత్వం కేసులు పెట్టింది. కేసులు పెట్టింది కాని, ఆ కేసులను నడపాలని ప్రభుత్వానికి లేదు.

కేసులను ఉపసంహరిస్తాము, మీ లెవీధాన్యాన్ని ప్రభుత్వానికిస్తారా అని ప్రభుత్వం మిల్లర్ల కాళ్ళ మీద పడుతున్నారు. లెవీ ధర కాక కొత్తగా

ప్రభుత్వం నిర్ణయించిన హెచ్చుధర ఇస్తే ధాన్యం చెల్లిస్తామని మిల్లర్లు బేరమాడుతున్నారు. ఇదీ జరుగుతున్న సంగతి.

ప్రతి సంవత్సరం ఆగస్టు, సెప్టెంబరు మాసాలలో ఆహార సమస్య తీవ్ర రూపం ధరిస్తూనే ఉంది. తిరిగి నవంబరు, డిసెంబరు నెలల నాటికి కొంత తగ్గుతున్నది.

సమస్య తీవ్రమైనపుడు కొన్ని ప్రకటనలతో ఆహారధాన్యాల దిగుమతులతో తాత్కాలిక నివారణ గావించి ఆపిమ్మట, సమస్య పరిష్కారమై పోయింది అని గొప్పలు చెప్పుకోవటం ప్రభుత్వం చేస్తున్న పని.

ఈ సంవత్సరం కూడా అదే నాటకం ఆడాలని ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది.

కాని గతానికీ, నేటికీ ఒక పెద్ద తేడా వుంది.

కేంద్రప్రభుత్వ నాయకుడు నెహ్రూ కాదు. లాల్ బహదూర్ శాస్త్రి.

బలహీనంగా వున్న శాస్త్రి ప్రభుత్వంపై బలమైన ఒత్తిడి తేవాలని అభివృద్ధి నిరోధక వర్గాలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. దేశీయ, విదేశీయ విధానాలన్నిటిలోనూ ప్రభుత్వాన్ని మరింత మితవాదం వైపు నెట్టాలనే పెద్ద ప్రయత్నం జరుగుతున్నది.

అందులో భాగంగానే ధాన్యం నిల్వదారులు, వ్యాపారస్తులు, పెట్టుబడిదారులు నేటి ఆహారసంక్షోభాన్ని సృష్టించారు.

[విశాలాంధ్ర - ఆగస్టు 15, 1964]

కోటీశ్వరుల దొంగడబ్బు అవినీతికి ఆటపట్టు
ఢిల్లీ అవినీతి నిర్మూలన గోష్ఠిలో హోంమంత్రి నందా ప్రసంగం

భారత దేశంలో ఈనాడు విపరీతంగా వ్యాపించిన అవినీతికి ఆటపట్టుగా వున్న దొంగడబ్బు జాతికి ఒక రోగంగా తయారైనదని కేంద్ర హోమ్ మంత్రి శ్రీగుల్జారీలాల్ నందా నిన్నసాయంత్రం ఇక్కడ జరిగిన అవినీతి నిర్మూలన గోష్ఠిని ప్రారంభిస్తూ హెచ్చరించారు.

అక్రమంగా కోటీశ్వరులు సంపాదించిన దొంగ డబ్బుకు శ్రీనందా "అవినీతి కరెన్సీ" అని పేరు పెట్టారు.

ఈ అవినీతి నిర్మూలన గోష్ఠికి శ్రీజైసుఖలాల్ హాథీ అధ్యక్షత వహించారు. 'ప్లానింగ్ కమిషన్' సభ్యుడు శ్రీమన్నారాయణ ఈగోష్ఠిలో ఒక నివేదిక సమర్పించారు.

భారతదేశానికి రాజధానిగా వున్న ఢిల్లీ నగరంలో మొదట అవినీతిని పూర్తిగా నిర్మూలించాలని తద్వారా యావత్ భారతదేశానికి ఢిల్లీని ఆదర్శప్రాయంగా మార్చటానికి తాను గట్టిగా కృషి చేస్తానని శ్రీగుల్జారిలాల్ నందా చెప్పారు.

అవినీతి పరులపై ఆరోపణలు ఎవరైనా తనకు నేరుగా అందజేయ వచ్చునని, అందుకు తగిన ఏర్పాట్లు తాను చేశానని శ్రీనందా తెలిపారు.

అవినీతి వల్ల దేశానికి, జాతికి కలుగుతున్న విపరీత ప్రమాదాన్ని అందరు గుర్తించి,

అవినీతి నిర్మూలన కృషిలో ప్రభుత్వంతో సహకరించాలని ఆయన కోరారు.

దేశంలో అవినీతిని పూర్తిగా తొలగిస్తేకాని దేశ సౌభాగ్యం సాధించటం సాధ్యం కాదని శ్రీనందా హెచ్చరించారు.

దేశంలో పెద్దపెద్ద అభివృద్ధి పథకాలు అమలు జరుపుతున్న ఈదశలో అవినీతి అన్న రోగం క్యాన్సర్‌లాగా మానవజాతిని నాశనం చేస్తున్నదని కూడా ఆయన హెచ్చరించారు.

ఈ గోష్ఠికి అధ్యక్షత వహించిన శ్రీ శ్రైసుఖలాల్ పాథీ మాట్లాడుతూ, ప్రజల సహకారంతోనే అవినీతిని నిర్మూలించవడం సాధ్యమన్నారు.

ప్లానింగ్ కమిషన్ సభ్యుడు శ్రీ శ్రీమన్నారాయణ గోష్ఠిలో సమర్పించిన నివేదికలో ఎన్నికలలో పాల్గొనే అభ్యర్థుల ఎన్నికల ఖర్చులను పరిమితం చేయడానికి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాచేసినప్పుడే ఎన్నికలలో పోటీచేసేవారు వ్యాపారస్తులపైన, పెట్టుబడిదారులపైన ఆధారపడ వలసిన అవసరం లేకుండా వుంటారని ఆయన అన్నారు.

ఢిల్లీ సదాచార సమితి ఏర్పాటు చేసిన ఈ గోష్ఠి నేటితో ముగుస్తుంది.

[విశాలాంధ్ర - జూలై 6, 1964]

ఉస్మానియాలో అమెరికన్ పరిశోధన కళాశాల

గడచిన కొన్ని సంవత్సరాలుగా ఇండియాలో అమెరికన్ చదువుల పట్ల ఆసక్తి పెరిగింది. ఇప్పుడు ఇరువై యేడు ఇండియన్ యూనివర్సిటీలలో అమెరికన్ సాహిత్యం బోధిస్తున్నారు.

ఇటీవలి సంవత్సరాలలో 'ఫుల్ బ్రైయిట్' కార్యక్రమాన్ని అనుసరించి ప్రత్యేక చదువుల కోసం సుమారు డెబ్బై మంది భారత విద్వాంసులు అమెరికాకు వెళ్ళారు. ఇదే కార్యక్రమం క్రింద సుమారు ఏభై అమెరికన్ విద్వాంసులు ఇండియాలో వివిధ విశ్వవిద్యాలయాలలో ఉపన్యాసాలిచ్చారు.

విద్వాంసుల పరిశోధనలకు, యూనివర్సిటీలలో పరిశోధనా సౌకర్యాలకు కూడా అనుకూలపడడానికి హైదరాబాదు ఉస్మానియా యూనివర్సిటీలో అమెరికన్ పరిశోధనాలయాన్ని నెలకొల్పారు. ఈ సంస్థకు ఏప్రిల్ 4వ తేదీన ఇండియా విద్యామంత్రి ఎం. సి. చాగ్లా ప్రారంభోత్సవం జరుపుతారు.

ప్రారంభోత్సవానికి పూర్వమే ఏప్రిల్ 1వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు సభలు

జరుపుతున్నారు. వాటిలో ప్రముఖ భారతీయ అమెరికన్ విద్వాంసుల ఉపన్యాసాలు జరిగాయి. విస్కాన్సిన్ యూనివర్సిటీ నుంచి మెర్లీకర్టీ, మెరిల్ జెన్సన్ రిచర్డు కరెంట్ అనే ముగ్గురు 'ప్రొఫెసర్లు' వచ్చారు. వాషింగ్టన్ యూనివర్సిటీ నుంచి ప్రొఫెసర్ ఆర్థర్ బెస్టర్, బ్రూక్లియున్ కాలేజీ నుంచి ప్రొఫెసర్ జాన్‌హోప్ ఫ్రాంక్లిన్, షికాగో యూనివర్సిటీ నుంచి ప్రొఫెసర్ నేపియర్ విల్ట్, కాలిఫోర్నియా యూనివర్సిటీ నుంచి ప్రొఫెసర్ ఎవరెట్ కార్టర్‌లు ఇంకా కొందరు వచ్చారు.

మొదట ఈ అమెరికన్ పరిశోధనాలయంలో ఒక గ్రంథాలయం వుంటుంది. అమెరికన్ చరిత్ర, సాహిత్యాలలో పరిశోధనలు చేసే ఉపాధ్యాయులకు పరిశోధకులకు పనికివచ్చే గ్రంథాలు ఇందులో వుంటాయి. కాలక్రమేణా అన్ని అమెరికన్ విషయాలలో భారత విశ్వవిద్యాలయ విద్వాంసులు పరిశోధనలు జరపడానికి వీలైన గ్రంథాలన్నిటిని చేర్చుతారు.

హైదరాబాదు నగరం భారతదేశానికి మధ్యగా వున్నది. వేసవికాలంలో భారతవిశ్వవిద్యాలయ విద్వాంసులు వచ్చి ఉండడానికి అక్కడి వాతావరణం బాగుంటుంది కనుక ఆనగరంలో ఈ పరిశోధనాలయాన్ని నెలకొల్ప నిశ్చయించారు. గ్రంథాలయ భవనాన్ని నిర్మించుకోవడానికి ఉస్మానియా యూనివర్సిటీ సిండికేట్లు వైస్-చాన్సెలరు

స్థలం ఇవ్వడానికి అంగీకరించారు. భవనాన్ని నిర్మించుకొనే వరకు విశాలంగా కొత్తగా నిర్మించిన యూనివర్సిటీ 'లైబ్రరీ'లో ఒక భాగాన్ని ఈ పరిశోధనాలయం కోసం ఇచ్చారు.

[అమెరికన్ రిపోర్టర్- ఏప్రిల్ 3, 1964]

జవహర్ లాల్ నెహ్రూ: బహు పాత్రధారి
చెస్టర్ బౌల్జ్
(ఇండియాలో అమెరికా రాయబారి)

జవహర్ లాల్ నెహ్రూ వీలునామా ప్రకారం ఆయన భస్మాన్ని జూన్ 12వ తేదీన ఇండియా విమానాలు ఆకాశంలోకి కొనిపోయి భారతదేశ భూభాగంలో కలిసి పోయి గుర్తుపట్టలేని విధంగా చల్లారు.

అహింసాత్మకంగా భారత స్వాతంత్ర్య సాధనకు ప్రజలను నడిపించాడని ప్రపంచం గాంధీని జ్ఞాపకం పెట్టుకొంటుంది. కష్టతరమైన మొదటి పదిహేడు సంవత్సరాలలో భారత జాతికి ఆత్మవిశ్వాసం కలిగించిన వ్యక్తిగా నెహ్రూను జ్ఞాపకం పెట్టుకొంటుంది.

జవహర్ లాల్ నెహ్రూకు సన్నిహితుడైన ఏ వ్యక్తి కూడా ఆయన్ని ఒక్క మాటలో వర్ణించడానికి ప్రయత్నించడు. ఆయన బహువిధ వ్యక్తి.

విరుద్ధ ఉత్సాహులున్నారు; ప్రజానీకానికి సన్నిహితుడు.

ఆయన ధనిక బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడు; భారతీయ కార్మిక కర్షక జనం మధ్య, బాలబాలికల మధ్య ఉన్నప్పుడు సంతోషపడేవాడు. వారికి ఆయన యెందున్న ప్రేమ, అనురాగం అపరిమితం. విశాల జీవిత దృక్పథాన్ని అలవరచుకోడానికి ప్రత్యేక పాశ్చాత్య పాఠశాలల్లో విద్యాభ్యాసం చేశాడు; మాతృదేశం పట్ల అమిత ప్రేమానురాగాన్ని పెంపొందించుకున్నాడు.

"బ్రిటిష్ జైలులలో పదమూడు సంవత్సరాల జీవితాన్ని ఆయన ఎన్నడూ మరచిపోనప్పటికీ స్వతంత్ర భారతదేశం బ్రిటిష్ కామన్వెల్తులో భాగంగా వుండాలని ఆయన పట్టుబట్టాడు; నిజానికి, ఈ సంవత్సరం జులై 4వ తేదీన జరిగే వార్షిక కామన్వెల్తు సమావేశానికి హాజరు కావాలని కూడా ఆయన అనుకొన్నాడు.

తన 'ప్రయివేటు' ఉత్తరాలలోగాని, రచనలలోగాని, ఉపన్యాసాలలోగాని, సన్నిహితులతో సంభాషణలలోగాని, తన సమస్యలను, ఆలోచనలను ఆయనంత బహిరంగంగా మాట్లాడిన ప్రజానాయకుడు మరొకడుండడు.

ప్రయివేటు సంభాషణలల్లో ఆయనంత

ఉత్సాహవంతుణ్ణి నేనెప్పుడూ ఎరుగను. ఆయన ఎప్పుడూ దాపరికం లేకుండా, బహిరంగంగా మాట్లాడేవాడు. ఆయన మనస్సులో ఉన్నదేదో చెప్పివేసేవాడు. ఎదుటి వ్యక్తి తన అభిప్రాయాలను గురించి ఏమనుకుంటాడోననే సందేహం లేకుండా పూర్తిగా అర్థమయ్యేటట్టు చెప్పడానికి ప్రయత్నించేవాడు. తరచు ఆయన బహిరంగంగా ఆలోచించుకొంటున్నట్టు అనిపించేది. ఒక సమస్యను సంపూర్ణంగా గ్రహించేవరకు ఆయన అన్ని అంశాలు చర్చించుకొనేవాడు.

ఆయన ప్రపంచంలో నలుపు, తెలుపు జాతులున్నాయనే భేదభావాన్ని ఎన్నడూ పాటించి ఎరుగడు; ఒక జాతికి మరొక జాతికి స్వల్పమైన వ్యత్యాసాలున్నాయని మాత్రమే తలపోసేవాడు. ఎవరి అభిప్రాయాలు వారికి ఉండేటట్టు ప్రోత్సహించి, అందరూ స్వేచ్ఛగా, బహిరంగంగా చర్చించుకొనేటట్టు ప్రోత్సహించేవాడు. ఒక్కొక్కప్పుడు తనకు ఇష్టం లేకపోయినా సరే ఇతరుల అభిప్రాయాలను గ్రహించేవాడనిపించేది.

ఇండియాలో ఆయన రాజకీయ ప్రాబల్యం అసమానమైనది. ఈ కాలంలో అనేక ఇతర దేశాలలో జరిగినట్టు ఆయన సులభంగా "ఏకచ్ఛత్రాధిపత్యంతో ఇండియాను పరిపాలించి ఉండేవాడు. అలా కాక

ఆయన తన అనంతమైన పలుకుబడిని ఇండియా ప్రజాస్వామిక వ్యవస్థలను బలపరచడానికి ఉపయోగించాడు.

నవభారత నిర్మాణానికి రూపొందించబడిన పంచవర్ష ప్రణాళికలు: ఆదర్శాలు, లక్ష్యాలు

భారత ప్రజల దారిద్ర్యాన్ని పోగొట్టి వారి జీవిత ప్రమాణాలను అధికపరచడమే నెహ్రూ లక్ష్యం. అట్టి నవభారత దేశాన్ని సృష్టిస్తామని స్వాతంత్ర్య పోరాట సమయంలో దేశనాయకులు ప్రజలకు వాగ్దానం చేశారు. ఆనాడు జాతీయ నాయకులు చేసిన వాగ్దానాలు కార్యరూపంలో పెట్టడానికే పంచవర్ష ప్రణాళికలు రూపొందించబడ్డాయి. మనదేశంలో ప్రణాళికా రూపంలో కొనసాగుతున్న అభివృద్ధి కృషి దారిద్ర్యాన్ని తొలగించి, చైతన్యం కలిగించి ముందడుగు వేయడానికి విశేషంగా తోడ్పడుతున్నది.

పంచవర్ష ప్రణాళికల సత్ఫలితాలు కొన్ని కనిపిస్తున్నాయి. నగరాలకూ, పరిశ్రమలకూ విద్యుచ్ఛక్తి సరఫరా చేస్తున్న 'హైడెల్ ప్రాజెక్టు'లూ, భూములకు నీరు సరఫరా చేస్తున్న 'ఇరిగేషను' ప్రాజెక్టులూ, ఉక్కు ఫ్యాక్టరీలు, కొత్త గనులు, కొత్త పరిశ్రలు, ఉదాహరణలు.

మరో ఇరవై 'మిలియన్'ల మంది బాలబాలికలు ఇప్పుడు పాఠశాలలలో చేరారు. 'ఇంజనీరింగు' కళాశాలలు. వ్యవసాయ కళాశాలలు, 'సైన్సు' కళాశాలలు

ఆధునిక సాంకేతిక విజ్ఞానాన్ని బోధిస్తున్నాయి. మన పరిశ్రమలలో ఉత్పత్తులు రెట్టింపు అయాయి. రేవులు, రైలుస్టేషనులు, రవాణా సౌకర్యాలు, ఇనుము, ఉక్కు, సిమెంటు అధికమయ్యాయి.

దేశప్రజలను దీర్ఘకాలముగా బాధిస్తున్న మలేరియా వ్యాధిని ఆరోగ్యశాఖ జయించింది.

మరణాల అదుపు

శిశు మరణాలు మనదేశంలో ప్రపంచంలోని యితర అన్ని దేశాలకంటె ఎక్కువ. అది యిప్పుడు క్రమంగా తగ్గుతోంది. సగటు ఆయుః ప్రమాణం ౩౨ నుంచి 47 సంవత్సరాలకు పెరిగింది. ఇంకా సాధించవలసిన అభ్యుదయం ఎంతో వుంది.

అత్యధిక జనాభా, భిన్న భాషలూ, భిన్న ఆచారాలూ గల మనదేశంలో ప్రజాస్వామిక సిద్ధాంతాలకు కట్టుబడి వున్న మనదేశంలో పదమూడేళ్ళుగా సాగిన ఈ అభ్యుదయం తొలిదశ అనే చెప్పాలి. దారిద్ర్య పరిస్థితులు యింకా తీవ్రంగానే వున్నాయి.

తొలి ద్వితీయ పంచవర్ష ప్రణాళికల కాలంలో తలసరి ఆదాయం నూటికి 18 వంతులు పెరిగినా, ఇంకా పెరుగుతూవున్నా తలసరి సగటు వాడకం తృతీయ ప్రణాళికా కాలం మొదట్లో రు.౨౩లకు

కొంచెం ఎక్కువగా ఉంది. నూటికి 70 మంది ప్రజల తలసరి సగటు వాడకం జాతీయ సగటు వాడకం మొత్తం కంటె తక్కువగా వుంది.

మనదేశంలో దారిద్ర్యాన్ని ఎంత త్వరగా నిర్మూలించగలమన్నదే మన ప్రణాళికా రచయితలను ఎదుర్కొంటున్న ముఖ్య సమస్య. వచ్చే 10,15 ఏళ్ళలో అన్నివర్గాల ప్రజలకూ కనీసపు జీవిత ప్రమాణాలను కల్పించడం ప్రణాళికా రచయితల ఆదర్శం.

తొలి ప్రాతిపదిక

ఈ సాంఘిక లక్ష్యసాధనకు దేశంలో ఆర్థిక స్థాయిని పెంపొందించడమే మార్గం. విదేశీయుల మీద ఆధారపడే దుస్థితి లేకుండా వ్యవసాయోత్పత్తి, ఆర్థిక పరిస్థితి పెరుగుదల రేటు ఎక్కువ కావడం కూడ అవసరం.

జనాభా పెరుగుదల రేటు దృష్ట్యా 1971, 1976 నాటికి 124 నుంచి 156 మిలియను టన్నుల ఆహారధాన్యాలు అవసర మౌతాయి. వ్యవసాయోత్పత్తులను గరిష్ఠస్థాయిలో పెంపొందించడం అత్యవసరం. 1961-1976 నాటికి వ్యవసాయోత్పత్తులు రెట్టింపు కావాలి.

తృతీయ ప్రణాళిక తొలిదశలో కృషి బాగా సాగని కారణంగా, తరువాత పన్నెండేళ్ళలోనూ వ్యవసాయోత్పత్తిని సంవత్సరానికి ఆరుశాతం చొప్పున

పెంపొందించ వలసిన అవసరమేర్పడింది.

ప్రస్తుత ప్రణాళికను అమలు జరపడంలోనూ చతుర్థ ప్రణాళికను రూపొందించడంలోనూ, వ్యవసాయోత్పత్తిని పెంపొందించేందుకు అవసరం కాగల చర్యలను గురించే హెచ్చు శ్రద్ధ వహించబడుతోంది.

రైతులకు సహాయం

ఇందుకుగాను పంటలకు ఎరువులూ, విద్యుచ్ఛక్తి, సిమెంటు, ఉక్కూ, తగినంతగా రైతులకు అందజేయాలి. గ్రామ ప్రాంతాలలో అనేక సౌకర్యాలు అదనంగా కల్పించాలి. రైతులకు తగిన సాంకేతిక సహాయం అందజేయాలి. రైతులు హెచ్చు పంట పండించటానికి వ్యవసాయోత్పత్తుల ధరల విషయంలో స్థిరమైన విధానాన్ని అనుసరించాలి.

ఉక్కు, రసాయనికాలు మొదలైన వాటికి సంబంధించిన పరిశ్రమలను విస్తరించడం, విద్యుత్సౌకర్యాలను పెంపొందించడం పారిశ్రామిక రంగంలో అవసరమైన యంత్రాల నిర్మాణ పరిశ్రమలను అభివృద్ధి చేయడం — యీ తృతీయ ప్రణాళిక లక్ష్యాలలో కొన్ని. వీటిని సాధిస్తే అయిదో పంచవర్ష ప్రణాళిక పూర్తయ్యే నాటికి దేశాభ్యుదయం కృషికి విదేశీ సహాయంపై ఆధారపడ వలసిన

అవసరం ఉండదు.

వ్యవసాయ రంగంలోనూ, యితర రంగంలోనూ, చతుర్థ పంచమ పంచవర్ష ప్రణాళికా కాలంలో ఉద్యోగావకాశాలను హెచ్చుగా పెంపొందించవలసివుంది. ద్వితీయ ప్రణాళిక ఆఖరు నాటికి దేశంలో నిరుద్యోగుల సంఖ్య దాదాపు రెండువందలా ముప్పై లక్షలు. ఈ సంఖ్య తృతీయప్రణాళికా కాలంలో సుమారు 420 లక్షల చొప్పున, చతుర్థ ప్రణాళికా కాలంలో సుమారు 230 లక్షల చొప్పున పెరుగుతుందని అంచనా వేస్తున్నారు.

తృతీయ ప్రణాళికా పథకాల అమలు వల్ల ఒక కోటి నలభై లక్షలమంది నిరుద్యోగులకు ఉపాధి సౌకర్యం కల్పించాలని లక్ష్యం. అయితే దాదాపు ఒక కోటి ముప్పైలక్షల మందికి అదనంగా తృతీయ ప్రణాళికా కాలంలో ఉపాధి సౌకర్యం కలుగుతుంది. అయిదో పంచవర్ష ప్రణాళిక కాలం నాటికి దాదాపు 3 కోట్ల మందికి అదనంగా ఉద్యోగావకాశాలు కల్పించవలసి వుంటుంది. పారిశ్రామిక రంగంలో త్వరగా అభ్యుదయాన్ని సాధించినపుడే లక్షలాది నిరుద్యోగులకు ఉపాధి చూపించ వీలవుతుంది.

వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి కృషి

సమాజంలో వెనుకబడి వున్న వర్గాల అభ్యున్నతి నిమిత్తం పంచవర్షప్రణాళికల ద్వారా

కృషి సాగవలసి వుందని బహుజనాభిప్రాయం. ఏఏ వర్గాలకు ప్రత్యేక సహాయం అందజేయవలసి వుందో ముందుగా నిర్ణయించాలి. వ్యవసాయ కార్మికులు, పారిశ్రామిక కార్మికులూ, ఆదివాసులూ, చిన్నరైతులూ వీరు ఈ వర్గాలకు చెందిన వారు. వీరి అభ్యున్నతికి స్పష్టమైన విధానాన్ని ప్రణాళికలలో రూపొందించాలి.

[గోలకొండ పత్రిక – ఆగస్టు 15, 1964]

సంపాదకీయం:—

దారుణ హత్య

గత రాత్రి భారత కాలమానం ప్రకారం పన్నెండున్నర గంటల ప్రాంతంలో జరిగిన ప్రెసిడెంట్ కెనెడీ దారుణ హత్య మొత్తం ప్రపంచాన్నే సంక్షోభ పరచింది.

శ్రీ కెనెడీ హత్యను పోల్చవలసింది 'అబ్రహాం లింకన్' హత్యతోనే, లేదా మహాత్మా గాంధి హత్యతోనే. ప్రార్థన సమావేశానికి వెడుతుండగా గాంధీజీని ఒక గాడ్సే, 'పిస్తోలు' గుండ్లకు బలిచేశాడు. 'థియేటర్'లో కూర్చుని వుండగా లింకన్‌ను ఒక జాన్ విల్క్స బూత్ తన తుపాకి గుండ్లకు బలిచేశాడు. ప్రెసిడెంట్ కెనెడీ డలాస్ నగరంలో ఒక సమావేశంలో ఉపన్యసించడానికి వెడుతుండగా— ఎవడైతేనేం ఒక హంతకుడు తుపాకితో హత్యచేశాడు.

లింకన్, గాంధీజీల వలెనే కెనెడీ తాను ధర్మమని విశ్వసించిన ఆదర్శం కోసం బలి అయ్యాడు. హత్యకు కారణాలు తెలియక పోయినా, జాతీయ అంతర్జాతీయ రంగాలలో ఆయన అనుసరిస్తున్న 'లిబరల్' విధానాలను అంగీకరించని వాడు ఈ దారుణ హత్య చేసి వుంటాడు.

అమెరికన్ చరిత్రలో మొట్ట మొదటి సారిగా కెనెడీ వంటి చిన్న వయసువాని, రోమన్ కాథలిక్

మతస్థుని ప్రజలెన్నుకొనడం ఆయన విశాలభావాల పట్ల, ఉన్నత ఆదర్శాల పట్ల అభిమానంతోనే. సెనేటర్‌గా ఆయన చూపిన ప్రజ్ఞ, ధైర్యం అసమానం. 1961లో ఆయన ప్రెసిడెంట్ పదవిని స్వీకరించినప్పుడు అమెరికా చరిత్ర, దాని ద్వారా ప్రపంచ చరిత్ర మారుతుందని పెక్కుమంది ఆశించారు. తన ఆదర్శాలను సాధించడానికే కెనెడీ గడచిన మూడేళ్ళూ ప్రయత్నించారు.

ఏక్షణంలో నైనా ప్రపంచం అణ్వాస్త్ర ప్రళయం కలగవచ్చునని మానవజాతి భయపడుతున్న రోజులలో ఆయన అమెరికా ప్రెసిడెంట్ అయ్యారు. ఆ భయం ఈనాడు చాలవరకు తొలగి పోయినదంటే దానికి ప్రెసిడెంట్ కెనెడీ కృషి ఒక ముఖ్య కారణం. క్యూబా విషయంలోనే కాదు; అణ్వాస్త్ర పరీక్షల నిషేధంలోనే కాదు; మరెన్నో ప్రపంచ సమస్యల పట్ల ఆయన ప్రదర్శించిన దూరదృష్టి, ప్రజ్ఞ, పట్టుదల మంచి ఫలితాల నిచ్చింది.

రాజకీయ నాయకునికి ముఖ్యంగా ఉండవలసిన లక్షణం నైతిక ధైర్యమని కెనెడీ విశ్వాసం. ఆయన సెనేటరుగా వుండగా రచించిన "ప్రొఫైల్స్ ఇన్ కరేజ్" అనే గ్రంథంలో ఈ విశ్వాసాన్నే ఆయన ప్రతిపాదించారు. అమెరికన్ చరిత్రలో ప్రసిద్ధులైన ఎనిమిది మంది సెనేటర్ల

జీవిత చరిత్రలను తీసుకొని, ఎవరెవరు ఏయే సందర్భాలలో ఎట్టి నైతిక ధైర్యాన్ని ప్రదర్శించారో ఆయన వివరించారు. ఆ ఎనిమిది మంది తాము సత్యమని నమ్మినది ఆనాటి ప్రజాభిప్రాయానికి విరుద్ధమైనదైనా, దాని కోసం తమ రాజకీయ భవిష్యత్తును త్యాగం చేశారు. వారిని, వారి నైతిక ధైర్యాన్ని ఆదర్శంగా నైగొన్న కెనెడీ తన రాజకీయ భవిష్యత్తును కాదు తన ప్రాణాలనే త్యాగం చేశాడు.

స్వదేశంలో నీగ్రో సమస్యను ఆయన ఎదుర్కొన్న విధానంలో ఈ నైతిక ధైర్యమే స్పష్ట మవుతుంది. దక్షిణ రాష్ట్రాలలో తన పలుకుబడి తగ్గిపోగలదని తెలిసి కూడా నీగ్రోలకు చట్టప్రకారం వారి హక్కుల రక్షణకు ఆయన పూనుకొన్నారు. మిసిసిపీ, అలబామాలలో అవసరమైనపుడు 'ఫెడరల్' సైన్యాలను కూడా పంపించి నీగ్రోలకు విద్యాలయాలలో ప్రవేశం కల్పించడం బహుశా అమెరికన్ చరిత్రలోనే అపూర్వమైనది. ఈసంఘటనల తర్వాత నీగ్రోలకు అన్ని జీవితరంగాలలోను శ్వేతజాతీయులతో సమానమైన హక్కులను కల్పించడానికి గాను ఆయన పౌరసత్వాల బిల్లును కాంగ్రెసులో ప్రవేశపెట్టారు. నూరేళ్ళ క్రిందట లింకన్ వలెనే కెనెడీ కూడా "ఏ జాతి కూడా సగం బానిసగా, సగం స్వేచ్ఛగా బ్రతుకలేద"ని విశ్వసించారు.

ఈ విశ్వాసంతోనే లింకన్ ప్రారంభించిన నీగ్రోల స్వాతంత్ర్యోద్యమాన్ని శాంతియుతము, చట్టబద్ధము అయిన పద్ధతులలో పూర్తిచేయడానికి ఆయన ప్రయత్నించారు. బహుశా ఆయన హత్యకు ఇదే కారణమై వుండవచ్చునేమో.

ప్రెసిడెంట్ థియొడోర్ రూజ్‌వెల్ట్ కాలంలో "ఫెయిర్ డీల్" వలె, ప్రెసిడెంట్ ఫ్రాంక్లిన్ రూజ్‌వెల్ట్ కాలంలో "న్యూడీల్" వలె, కెనెడీ ప్రెసిడెంట్ పదవీ కాలంలో "న్యూఫ్రాంటియర్" (కొత్త సరిహద్దు) అనే పదం కొత్తగా ప్రచారంలోకి వచ్చింది. నైతికమైన కొత్త సరిహద్దులపై విజయమనే ఆదర్శాన్ని ఆయన అమెరికన్ ప్రజల ముందు వుంచారు. ఈ ఆదర్శానికి అనుగుణంగానే ఆయన స్వదేశంలో అనేక సంస్కరణలను - వెనుకబడిన దేశాలకు ఆర్థికసహాయం, శాంతిసేన స్థాపన మొదలైన కార్యాలను చేయడానికి పూనుకొన్నారు.

ఆయన మరణం అత్యంత హృదయావేదనకరమైన విషాద పరిస్థితులలో జరిగింది. వాల్ట్ విట్మన్ వంటి కవి "ఓ క్యాప్టెన్! మై క్యాప్టెన్" అని ఆలపించవలసిన విషాద పరిస్థితులలో జరిగింది. ఆయన మరణంతో యునైటెడ్‌స్టేట్స్ తమ ప్రియతమ నాయకునేగాదు, ప్రపంచం ఒక గొప్ప రాజకీయవేత్తను, శాంతిదూతను కోల్పోయింది.

[ఆంధ్ర జ్యోతి - నవంబర్ 24, 1963]